


ఈనాడు

కరీంనగర్ 2-1-2020 గురువారం సిటీ సంపుటి 46 సంచిక 143

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+12 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



హరీతహారం

నిర్వహణ, రక్షణ లేక దక్కని మొక్కలు

ఐదేళ్లలో నాటిన మొక్కలు **177.51** కోట్లు

ఖర్చు రూ. **3,836.16** కోట్లు

- ఆరంభ శూరత్వమేనా!
- నాటక శ్రద్ధపెట్టే వారేరీ?
- ప్రత్యేక శ్రద్ధ చూపిన కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్న పచ్చదనం

ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి

'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారానికి అధికారుల నిర్లక్ష్యం తూట్లు పొడుస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా ఈ పథకాన్ని సమీక్షిస్తున్నా క్షేత్రస్థాయిలో సిబ్బంది అలసత్వం వీడటంలేదు. ఫలితంగా నాటిన మొక్కల్లో మూడింట రెండొంతులుపైగా ఎండిపోయాయి. హరితహారం అమలుతీరుపై రంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నల్గొండ, జనగాం, వరంగల్ గ్రామీణ, పట్టణ, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో క్షేత్రస్థాయి పరిస్థితుల్ని 'ఈనాడు' ప్రత్యేకప్రతినిధి అధ్యయనం చేశారు.. అనేక కీలక అంశాలు వెలుగుచూశాయి. క్రమం తప్పకుండా నీళ్ల పెట్టకపోవడం.. పశువులు, మేకల నుంచి రక్షణ చర్యల్లేకపోవడంతో చాలావరకు చనిపోతున్నాయి. ఉన్న మొక్కలు సంరక్షించడం మరిచిన అధికారులు కొత్త మొక్కలు నాటడంలో మాత్రం ఉత్సాహం కనబరుస్తుండటం గమనార్హం. మొక్కలను రక్షించలేకపోతున్న సిబ్బందే మళ్లీ మళ్లీ వాటిని నాటుతూనే ఉన్నారు.. ఫలితంగా పచ్చదనం మాత్రం ఆశించినంతగా కనిపించడంలేదు.

...పూర్తి వివరాలు 2లో



ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో రోడ్డు డివైడర్‌పై నాటిన మొక్కల్లో ఒక్కటీ దక్కని తీరు

కల్తీ నివారణకు కాసుల కొరత

మార్కెట్‌లో పోటెత్తుతున్న నాసిరకం ఆహారోత్పత్తులు

- నాణ్యమైన నిత్యావసరాల తయారీకి ఉద్యానసంస్థ ప్రణాళిక
- సాంకేతికత, డీపీఆర్ సమకూర్చిన జాతీయ ఆహార సంస్థ
- రూ.4.28 కోట్లు ఉదారంగా గ్రాంటు అందజేసిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమకూరని రూ.26 కోట్ల నిధులు
- మూడేళ్లుగా ప్రారంభానికి నోచని పనులు

ఈనాడు - హైదరాబాద్

మార్కెట్‌లో కల్తీ ఆహారోత్పత్తుల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.. వాటి నియంత్రణకు నిధుల కొరతే అసలు సమస్యగా మారింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి కేంద్రం ఉదారంగా నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం తరపున సాయమందక పనులు ఆగిపోయాయి. ఉత్పత్తుల తయారీకి ప్రత్యేకంగా ఉద్యానశాఖలో రాష్ట్ర ఉద్యాన సంస్థను ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఏర్పాటుచేసింది. ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ ఉత్పత్తులు 'విజయ' పాలు, వంటనూనెల మాదిరిగా నాణ్యమైన సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులను తయారుచేయాలనేది ఈ సంస్థ ఏర్పాటు ప్రధానోద్దేశం. మొత్తం 8 రకాల ఆహారోత్పత్తుల తయారీని తొలి ఏడాదే ప్రారంభించాలని నిర్ణయించారు. ఏడాదికి 3250 టన్నులు ఉత్పత్తి చేసి చిల్లర మార్కెట్‌లో విక్రయించాలి. ప్రజలు నిత్యావసరాలుగా వినియోగించే పసుపు, మిరప కారం, అల్లం, వెల్లుల్లి పొడి, అల్లంసుద్ద, ధనియాల పొడి, చింతపండు సుద్ద, చింతపండు పొడి ఇలా రకరకాల ఉత్పత్తులు తయారుచేయాలి. 'తెలంగాణ బ్రాండు' పేరుతో ప్యాకింగ్ చేయాలి. ఇవి మార్కెట్‌లోకి వస్తే ప్రైవేటు సంస్థలు విక్రయించేవాటికి నాణ్యత, ధరలో పోటీ ఏర్పడి కల్తీ తగ్గుతుందని ప్రభుత్వం తెలిపింది.



ఉద్యాన సంస్థ తయారుచేసిన ఆహారోత్పత్తులు ఇలా ఉంటాయి

తొలి అడుగులే చకచక..

మైసూర్‌లోని కేంద్ర ఆహార సాంకేతిక పరిజ్ఞాన పరిశోధన సంస్థ(సీఎఫ్‌టీఆర్ఐ) ఈ ప్లాంటు ఏర్పాటుకు ఆధునాతన సాంకేతికతతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారుచేసి ప్రభుత్వానికిచ్చింది. ఏడాదిన్నర క్రితం రాష్ట్ర మంత్రి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల బృందం సీఎఫ్‌టీఆర్ఐలో అధ్యయనం చేసి వచ్చింది.

...మిగతా 2లో

2021లో చంద్రయాన్-3



గగన్‌యాన్ కోసం వాయుసేన నుంచి నలుగురి ఎంపిక

రష్యాలో త్వరలోనే వారికి శిక్షణ ప్రారంభం

ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి 11లో

రాజకీయాలకు దూరం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నడుచుకుంటాం

జనరల్ రావత్ ఉద్ఘాటన 11లో

తొలి త్రిదళాధిపతిగా బాధ్యతల స్వీకరణ



గవర్నర్ తమిళిసైకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

కొత్త సంవత్సరంలో ప్రగతి పరవళ్లు

- నేటి నుంచి పల్లె ప్రగతి
- ప్రాజెక్టులు కళకళ్లాడుతున్నాయ్
- బృహత్తర లక్ష్యంతో సంపూర్ణ అక్షరాస్యత
- గవర్నర్‌తో భేటీలో సీఎం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 2020లో ప్రగతి పరవళ్లు తొక్కుతుందని, దీనికి అనుగుణంగా ప్రభుత్వం కార్యాచరణను చేపడుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వెల్లడించినట్లు తెలిసింది. ఆర్థిక మాంద్యాన్ని నివారించేందుకు ముందుజాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించారు. గురువారం నుంచి పల్లె ప్రగతి కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రాజెక్టుల్లో జలకళ ఉట్టిపడుతోందని, రబీ పంటల సాగుకు ఢోకా లేదని అన్నారు. బుధవారం సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

...మిగతా 2లో

నయాసాల్ కిక్కు!



- రెండు రోజుల్లో రూ.378 కోట్ల మద్యం విక్రయాలు
- డిసెంబరు 31 ఒక్కరోజే 150 శాతం ఎక్కువ అమ్మకాలు
- ఒకే రాత్రి పట్టుబడ్డ 3,148 మంది మందుబాబులు

5లో

ఈ దశాబ్దం తెరాసదే

సీఎం అవుతాననే చర్చే లేదు

- కాంగ్రెస్ తీసి పారేసే పార్టీ కాదు
- కేంద్రం సాయం చేయకున్నా ఐటీలో మేమే మేటి
- పుర ఎన్నికల్లో పార్టీ నేతల మధ్య తీవ్ర పోటీ
- ఇష్టాగోష్ఠిలో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రసమితి 2020లో పురపాలక ఎన్నికల్లో విజయంతో శుభారంభం చేస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీ రామారావు చెప్పారు. 2020 నుంచి 2030 వరకు ఈ దశకం తెరాసదేనని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అగ్రగామిగా ఎదుగుతుందన్నారు. కొత్త పురపాలక చట్టం సమర్థంగా అమలు చేయడమే లక్ష్యమన్నారు.

...మిగతా 2లో



నీట్ దరఖాస్తు గడువు 6 దాకా పెంపు

ఈనాడు, హైదరాబాద్: నీట్ 2020కి దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువును ఈ నెల 6 దాకా పెంచుతూ జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత గత నెల 31కే తుది గడువుగా ప్రకటించగా.. తాజాగా వచ్చే సోమవారం అర్ధరాత్రి 11.50 గంటల వరకూ దరఖాస్తు స్వీకరణ గడువును పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. పరీక్ష రుసుము చెల్లించడానికి గడువును కూడా ఈ నెల 7 వరకూ పెంచింది. దరఖాస్తు పత్రంలో తప్పొప్పులను సరిచూసుకోవడానికి ఈ నెల 15 నుంచి 31 వరకూ అవకాశం కల్పించింది.



ఇదీ సంగతి!



మున్సిపల్ ఎన్నికలపై కోర్టుకెళ్లిన కాంగ్రెస్


- రిజర్వేషన్ల ఖరారుకు ముందే షెడ్యూలు విడుదల చట్ట విరుద్ధమంటూ హైకోర్టులో ఉత్తమ్ వ్యాజ్యం
- తదుపరి చర్యలు లేకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని విన్నపం

ఈనాడు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం డిసెంబరు 23న జారీ చేసిన ఎన్నికల షెడ్యూలు నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే జనవరి 7 నుంచి ఎన్నికల ప్రక్రియ ఆరంభమయ్యేలా షెడ్యూలు విడుదల చేయడం చట్ట, రాజ్యాంగ విరుద్ధమంటూ పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

...మిగతా 2లో

ముందు ఎస్టీ రిజర్వేషన్లు..

- తర్వాతే మిగిలినవి
- మహిళలకు 50 శాతం సీట్లు
- పురపాలక రిజర్వేషన్లకు మార్గదర్శకాలు 2లో
- 2011 జనాభానే ప్రాతిపదిక



మున్సిపల్ ఎన్నికలపై కోర్టుకెళ్లిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

సదరు నోటిఫికేషన్ చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని, సవరించేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశించాలని కోరారు. విచారణ ముగిసే వరకు ఆ నోటిఫికేషన్ ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు.

వ్యాజ్యంలోని ముఖ్యాంశాలివీ

"మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిశాక మున్సిపల్ చట్ట సవరణతోపాటు వార్డుల విభజన, వర్గీకరణ నిమిత్తం గత ఏడాది జులై 7న ప్రభుత్వం(జీవో 78) తుది నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా వార్డుల విభజన జరిగిందని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలవగా..దాన్ని రద్దు చేస్తూ కోర్టు నవంబరు 29న ఉత్తర్వులు జారీ చేసింది. వారంలోగా అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించాలని కమిషనర్లను ఆదేశించింది.

అభ్యంతరాలు స్వీకరించకుండానే...

కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో డిసెంబరు 3 నుంచి 9 వరకు ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలు స్వీకరించి, 16లోగా పరిష్కరించాలని పురపాలక శాఖ సంచాలకుడు ఆయా మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే డిసెంబరు 17న తుది నోటిఫికేషన్లు జారీ చేశారు. అందుకు అనుగుణంగా 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలలో డిసెంబరు 31 నుంచి జనవరి 4లోగా ఓటర్ల జాబితాలు ప్రచురించాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం డిసెంబరు 23న నోటిఫికేషన్ జారీ చేసింది. దాంతోపాటు జనవరి 7న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యేలా షెడ్యూలునూ విడుదల చేసింది.

రిజర్వేషన్ల ప్రస్తావన లేకుండానే

షెడ్యూలు విడుదల నాటికి ఓటర్ల జాబితా కూడా తయారు కాలేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల ప్రస్తావనా లేదు. రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎన్నికల షెడ్యూలు విడుదల చేయడం మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 6,7లకు విరుద్ధం. పత్రికల సమాచారం మేరకు ఈ నెల 5, 6 తేదీల్లో ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. 7న నోటిఫికేషన్ జారీ అయితే రిజర్వేషన్లపై అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉండదు. అప్పటికప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు పొందడమూ సాధ్యం కాదు' ' అని పిటిషనర్ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సంచాలకుడు, ఎన్నికల సంఘాలను పేర్కొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు పింఛనుదారుల మద్దతు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో తాము భాగస్వాములం అవుతామని పింఛనర్ల సంఘం తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య, నేతలు ఇనగంటి నవనీతరావు, మహమ్మద్ రఫీయుద్దీన్, శ్రవణ్‌కుమార్ తదితరులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి 3.64 లక్షలమంది పింఛనర్లం ఉన్నామని, అక్షరాస్యత కార్యక్రమంలో తాము వాలంటీర్లుగా పనిచేస్తామని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

పురపాలక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ గవర్నర్ తమిళిసైని కోరారు.

హరితహారం

ఇంకా కారణాలు ఏంటి?

నిర్వహణ సమస్యలతో పాటు నాటే మొక్కల లక్ష్యం కోట్లు, లక్షల్లో ఉండటం. దీంతో నాటిన అన్ని మొక్కల్ని పర్యవేక్షించడం అధికారులు, సిబ్బందికి సవాలుగా మారుతోంది. 2019-20లో తొలుత 100 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. తర్వాత వీలైనంతగా అంటూ మార్చారు. తాజా లెక్కల ప్రకారం ఈ ఏడాది 37 కోట్లకు పైగా నాటారు.

హరితహారం చేపట్టి ఐదేళ్లు పూర్తయ్యింది. 230 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. 2015-16 నుంచి ఏటా జరుగుతున్న ఈ కార్యక్రమంలో 2019-20 నాటికి అడవి బయట, లోపల కలిపి 177 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారిక లెక్కలు. ప్రభుత్వం రూ.3,836 కోట్లు ఖర్చు చేసింది. ఎన్ని బతికాయన్నదానిపై మాత్రం లెక్కల్లేవు. క్షేత్రస్థాయిలో మొక్కల లెక్కల్లో చాలా అంతరం కనిపిస్తోంది. కొన్నిచోట్లయితే కాగితాల్లోనే మొక్కలు. ప్రజలు స్పందించిన చోట, స్థానిక సంస్థలు ప్రత్యేకదృష్టి పెట్టిన కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన మేరకు పచ్చదనం పెరుగుతోంది. మొదటి నాలుగేళ్లతో పోలిస్తే గ్రామపంచాయతీలు దృష్టి పెడుతున్న కారణంగా ఐదో విడత హరితహారం మెరుగ్గా ఉంది. రైతులు ఎక్కువగా టేకు, ఎర్రచందనం మొక్కలు కోరుకుంటున్నా వాటి పంపిణీ జరగడం లేదు. ఇంటింటికి ఇచ్చే మొక్కలు ప్రజలు కోరుకునేవి కాకుండా నర్సరీల్లో ఉన్న గడ్డి గులాబీ వంటి మొక్కలనే ఎక్కువగా ఇస్తున్నారు. మొత్తంగా చూస్తే- గతంలో కంటే హరితహారం ప్రారంభమయ్యాక రాష్ట్రంలో పచ్చదనం పెరుగుతోంది కానీ. . నాటుతున్న మొక్కల సంఖ్యతో చూస్తే ఆశించిన పచ్చదనం కంటే బాగా తక్కువగా కనిపిస్తోంది.

ఔటర్‌లో: హెచ్ఎండీఏ తన పరిధిలో నాలుగేళ్లలో 3.84 కోట్ల మొక్కలు నాటింది. ప్రధానప్రాంతం ఔటర్‌రింగ్ రోడ్డే. కానీ ఆ మేరకు మొక్కలు లేవు. వారానికోసారి వచ్చే ట్యాంకర్లు సర్వీసు రోడ్ల వెంట వెళుతూ ఉంటే పైపుల్ని పట్టుకుని వెళుతున్నారు. మొక్కలు ఓవైపు నీళ్లు పడేది మరోవైపు. మొక్క వద్ద పాదు.. నిలిచేందుకు మట్టి గుంతలులేక పోవడంతో నీళ్లు నిలవడం లేదు.

ట్రీ గార్డులు లేక..

వైరాలో లెక్కల్లో తప్ప క్షేత్రస్థాయిలో మొక్కలు లేవు. గత రెండేళ్లలో 20 వేల చొప్పున మొక్కలు నాటినా ఒక్కటి వదిలేశాం. ఇప్పుడక్కడ కనిపించే మొక్కల సంఖ్య వందల్లోనే ఉంది. రహదారి డివైడర్లపై ఒక్కటీ లేదు. టేకులపల్లి మండలంలో గతేడాది 2.25 లక్షల మొక్కలు నాటితే 35 శాతం వరకే బతికాయి. ఈ ఏడాది 3.25 లక్షల మొక్కల్లో 60 శాతం పైగా మొక్కలు బతికాయి. ఇల్లందు మండలంలో గతంలో నాటినవి 30-40 శాతం మించి బతకలేదు. ఈ ఏడాది నాటిన మొక్కలు పచ్చదనంతో కనిపిస్తున్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలో రహదారుల వెంట, ఖాళీస్థలాల్లో చెరువుగట్ల వెంట, ఇంటికి ఆరేసి మొక్కల చొప్పున ఈ ఏడాది 1.55 లక్షల మొక్కలు అందించారు. అయితే క్షేత్రస్థాయిలో 50 శాతం కూడా కనిపించడం లేదు. పెనుబల్లి మండల కేంద్రంలో ఓ చెరువుగట్టు వద్ద నాటిన మొక్కలు 90 శాతం వరకు చనిపోయాయి. రైతులకు ఇచ్చినవే ఎక్కువగా బతికాయి.

ఐదేళ్లలో హరితహారం ఖర్చు (రూ. కోట్లలో)

శాఖ/సంస్థ	2014	2015	2016	2017	2018	2019	మొత్తం
పంచాయతీరాజ్	257.00	365.05	401.59	455.73	687.33	286.45	2,453.18
అటవీ	111.21	229.00	288.56	248.36	221.35	061.22	1,159.70
హెచ్ఎండీఏ	0.00	39.76	35.28	25.08	47.61	16.29	164.03
జీహెచ్ఎంసీ	0.00	24.91	13.27	16.11	4.48	0.49	059.25
మొత్తం	368.21	658.72	738.71	745.28	960.77	364.45	3,836.16

నాటిన మొక్కలు ఎన్నంటే..

శాఖ/సంస్థ	లక్ష్యం	2015	2016	2017	2018	2019	మొత్తం
అడవి లోపల	100	2.93	3.99	3.93	28.86	3.53	43.26
అటవీప్రాంతం వెలుపల	120	12.66	25.86	28.46	27.77	32.93	127.71
జీహెచ్ఎంసీలో	3	0.00	0.84	0.76	0.43	0.65	2.70
హెచ్ఎండీఏ పరిధిలో	7	0.26	0.97	0.90	0.87	0.83	3.84
మొత్తం	230	15.85	31.66	34.05	57.93	37.94	177.51

● లక్ష్యం, నాటిన మొక్కలు.. కోట్లలో.

పచ్చదనం ఉంది కానీ..




ఖిలా వరంగల్‌లో గుండుచెరువు ప్రాంతం.. వేప, మర్రి వంటి మొక్కలు 10 వేల వరకు నాటారు. నీళ్లు పెట్టడం, ఎరువులు వేయడం, కలుపు తీయడం సహా నిర్వహణలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుండటంతో అక్కడ పచ్చదనం పరవళ్లు తొక్కుతోంది. అయితే మొక్కలు నాటడంలో మాత్రం కొద్దిగా కూడా ప్రణాళిక లేదు. మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరమైనా లేదు. మర్రి వంటి భారీ వృక్షాల వేర్లు బాగా చొచ్చుకుపోతాయి. కాండం బాగా పెద్దగా అవుతుంది. కొమ్మలు విస్తరిస్తాయి. పక్కన పక్కన నాటడంతో అవి చనిపోయే అవకాశం ఉంటుంది.

వరంగల్




బెస్తం చెరువు పక్కన ప్రభుత్వభూమి.. లక్ష్యం 10 వేల మొక్కలు. అటవీశాఖ 5 వేల మొక్కలు ఇచ్చింది. వేలాది మంది విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. స్మృతివనంగా అభివృద్ధి చేస్తామంటూ అటవీశాఖ చుట్టూ గోడలు కూడా కట్టింది. ఆ తర్వాత మొక్కల నిర్వహణను 'కుడా' గాలికి వదిలేసింది. మొక్కలు మేకలు, పశువుల పాలయ్యాయి. మూడు నెలల తర్వాత ఒక్క మొక్క కూడా మిగల్లేదు.

భువనగిరి



అర్బన్‌కాలనీలో రెండేళ్ల క్రితం వెయ్యి మొక్కలు నాటారు. ఒక్కటీ బతకలేదు. అక్కడే గతేడాది మరో వెయ్యి నాటారు. ఇప్పుడక్కడ పట్టుమని 10 మొక్కలు కూడా లేదు. జాతీయరహదారి పక్కన పెద్దచెరువు. . 14 ఎకరాల మున్సిపల్ స్థలం.. బస్సుల్లో పిల్లల్ని రప్పించారు. మామిడి, జామ, వేప వంటి 4 వేల మొక్కలను మూడేళ్లక్రితం నాటారు. 8-10 లక్షలు ఖర్చుచేశారు. మొక్కలన్నీ పశువులు, మేకలకు ఆహారమయ్యాయి. వంద మొక్కలు కూడా లేవు

చౌటుప్పల్



దండుమల్కాపురం చెరువుకట్టపై నాలుగేళ్ల క్రితం వెయ్యి ఈత, ఖర్జూర మొక్కలు నాటితే నీటి సమస్యతో 40 శాతమే మిగిలాయి. ఇక్కడకు దగ్గరలోని రామలింగేశ్వరస్వామి ఆలయభూముల్లో సీతాఫలం, మామిడి, టేకు మొక్కలు నాటారు. సంరక్షణకు మనుషుల్ని పెట్టడంతో పచ్చదనం కళకళలాడుతోంది. ఆరెగూడంలో భూగర్భజలాల కాలుష్యంతో మొక్కలు సరిగా ఎదగడం లేదు. ఏకంగా నర్సరీనే ఇక్కడినుంచి మార్చేశారు.

ఐనవోలు ఆదర్శం..

గ్రామగ్రామానికి మధ్య రహదారులు ఇరువైపునా ఏపుగా పెరిగిన చెట్లు.. రక్షణకు ట్రీగార్డులు, క్రమం తప్పకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా.. వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీలు.. వెరసి మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా పచ్చదనమే. మండల కేంద్రం ఐనవోలులో అయితే వీధివీధిలో, పాఠశాల ప్రాంగణంలో, పశువుల సంత ఎక్కడ చూసినా పచ్చటి మొక్కలే. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటిస్థానంలో కొత్తవి పెడుతున్నారు. రైతులకు ఆదాయం వచ్చేలా టేకు మొక్కలు ఎక్కువ సంఖ్యలో పంపిణీ చేస్తున్నారు.

జనగామ: పట్టణంలో నాలుగేళ్లలో 2.20 లక్షల మొక్కలు నాటితే బతికినవి దాదాపు 15 శాతం మించి లేవు. అందులోనూ అత్యధికంగా వరంగల్-హైదరాబాద్ రహదారిలోనే. పక్కనే శామీర్‌పేట గ్రామంలో రెండేళ్లక్రితం 16 వేలు నాటితే 40 శాతం కూడా బతకలేదు.

ఈ దశాబ్దం తెరాసదే

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాల్లో తమకు శత్రువులెవరూ లేరన్నారు. ఉన్నదల్లా ప్రత్యర్థులేనన్నారు. కాంగ్రెస్ తీసి పారేసే పార్టీ కాదని, పురపాలక ఎన్నికల్లో దానినే ప్రత్యర్థిగా భావిస్తున్నామన్నారు. తన బాల్యంలో భాజపా ఎలా ఉందో.. ఇప్పుడూ అలాగే ఉందని చెప్పారు. ఐదు ట్రిలియన్ డాలర్ల కేంద్ర ప్రభుత్వ కల సాకారం కావాలంటే ప్రగతిశీల రాష్ట్రాలను ప్రోత్సహించాలని కేటీఆర్ సూచించారు. కేంద్రం సాయం చేయకపోయినా ఐటీలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. సంక్రాంతి తర్వాత పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తామన్నారు. మరో పదేళ్లు సీఎంగా ఉంటానని కేసీఆర్ ప్రకటించారని, ఇప్పుడు తాను సీఎం అవుతాననే చర్చ అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. పురపాలక ఎన్నికల్లో పార్టీ నేతల మధ్య తీవ్ర పోటీ ఉందన్నారు.కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

- 2019 మాకు బ్రహ్మాండమైన ఆరంభం ఇచ్చింది. శాసనసభ ఎన్నికలను గెలిచి రెండోసారి అధికారంలోకి వచ్చాం. పార్లమెంటు ఎన్నికల్లో తొలి స్థానంలో నిలిచాం. 90శాతం గ్రామ పంచాయతీలు గెలిచాం. మొత్తం 32 జిల్లా పరిషత్‌లను చేజిక్కించుకున్నాం. 2020ని సైతం పురపాలక ఎన్నికలలో ఘన విజయంతో ప్రారంభిస్తాం. సింహభాగం స్థానాలు గెలుస్తాం.. తెరాస రాష్ట్ర కార్యాలయాలను అన్ని జిల్లాల్లో నిర్మిస్తున్నాం. సంక్రాంతి తర్వాత వీటిని సీఎం ప్రారంభిస్తారు. ఈ నెల మొదటివారంలో కేసీఆర్ అధ్యక్షతన శాసనసభా పక్షం, రాష్ట్రకమిటీల ఉమ్మడి సమావేశం ఉంటుంది. పురపాలక ఎన్నికలకు పార్టీ సమాయత్తంపై శ్రేణులకు సీఎం దిశానిర్దేశం చేస్తారు.
- పురపాలక చట్టాన్ని వంద శాతం అమలుచేయడం అతిపెద్ద సవాలు. ఈ చట్టం ఎంతో ఉపయోగకరం. సత్వర అనుమతులొస్తాయి. అక్రమ నిర్మాణాలను నోటీసులు లేకుండా కూల్చేసే అధికారం ప్రభుత్వానికి సంక్రమిస్తుంది. చట్టాన్ని ఉల్లంఘిస్తే పురపాలక చైర్మన్‌ను సైతం తొలగించవచ్చు. పోటీచేసే అభ్యర్థులు చట్ట నిబంధనలన్నీ ముందే తెలుసుకుంటే మంచిది. సరిగా విధులు నిర్వర్తించని పక్షంలో తెరాస కౌన్సిలర్లపైనా వేటుకు వెనుకాడేది లేదు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఈ ఏడాది పూర్తి సంతృప్తినిచ్చింది. 60లక్షల మందితో సభ్యత్వ నమోదు, కమిటీల నిర్మాణం పూర్తిచేసుకున్నాం.
- వ్యతిరేకతను అనుకూలంగా మలచుకోవడంలో కేసీఆర్‌ను మించినవారు లేరు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేశారు. తర్వాతే వారే జేజేలు కొడుతున్నారు. ఎన్పీఆర్, ఎన్నార్సీ విషయంలో పార్టీ నిర్ణయం కంటే ప్రభుత్వ నిర్ణయమే ముఖ్యం. అందరితో మాట్లాడి సీఎం ఓ నిర్ణయం తీసుకుంటారు.
- ఇరుగుపొరుగు రాష్ట్రాలతో మాకు సత్సంబంధాలున్నాయి. జగన్‌తోనే కాదు, చంద్రబాబు ఉన్నప్పుడూ కొనసాగాయి. మేము యాగం చేసినప్పుడు ఆయనను పిలిచాం. రాజధాని శంకుస్థాపనకు ఆయన పిలిచారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో సత్సంబంధాల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయింది. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కి ఏపీ, తెలంగాణ కలిసి తరలించాలా.. విడివిడిగానా అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.
- పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తేలికగా తీసుకోం. ఉత్తమ్ టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటారా లేదా అనేది ఆయన వ్యక్తిగతం. ఒక ఐపీఎస్ అధికారిని ఆయన దూషించడం సరైంది కాదు. హైదరాబాద్లో సీఏఏ అనుకూల, వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. కాంగ్రెస్ వాళ్లు ర్యాలీకి ఎంచుకున్న ప్రాంతం సరైంది కాదు. సరూర్‌నగర్‌లో ఉంటే పోలీసులు అనుమతి ఇచ్చేవారే. ఇక దిశ ఘటనపై మానవీయంగా స్పందించాం. మజ్లిస్‌తో స్నేహ సంబంధాలున్నాయి. గతంలో కలిసి పోటీ చేయలేదు. ఇప్పుడూ చేయం.

రాష్ట్రాలు బాగుంటేనే దేశం బాగు..

కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల రంగంలో రూ.104లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే ఆలోచన చేస్తోంది. పూర్తి వివరాలు వచ్చాక ఆర్థిక పరిస్థితిని అంచనా వేయొచ్చు. ఎన్నికల కోసమా, దార్శనికతతో చెప్పారా అనేది త్వరలో తెలుస్తుంది. రాష్ట్రాలు బాగుంటేనే దేశం బాగుంటుంది. కేంద్రం ఈ కోణంలో ఆలోచించడం లేదు. బెంగళూరు, హైదరాబాద్ నగరాలు రక్షణ ఉత్పత్తులకు పేరొందాయి. వాటి మధ్య రక్షణ పరిశ్రమల కారిడార్ పెట్టాలని కోరితే.. కేంద్రం మాత్రం బుందేల్‌ఖండ్‌లో ఏర్పాటుచేసింది. తమకు అనుకూలంగా, వాళ్ల ఎంపీలు ఉన్నచోటే పరిశ్రమలు పెడితే లాభమేంటి? ఐటీఐఆర్‌ను పట్టించుకోబోమని కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్ ప్రకటించారు. కేంద్రం సాయం చేయకపోయినా రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధి ఆగదు.

- 2020లో ఔషధనగరిని ఆరంభిస్తాం. భారీ భూభాగం ఉంటే పరిశ్రమలకు అనుకూలం. చైనా, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో అదే జరుగుతోంది. ఆ బాటలో ఔషధనగరిని తీర్చిదిద్దుతున్నాం. శుక్రవారం ముంబయిలో జరిగే భారత ఔషధ సంఘ సమావేశంలో ఔషధనగరి, ఈ రంగం అభివృద్ధిపై దృశ్యరూపక ప్రదర్శన ఇవ్వబోతున్నాం. జహీరాబాద్ నిమ్జ్‌లోనూ త్వరలో భారీ పరిశ్రమ మొదలు కానుంది. పిరామిల్ సంస్థ అక్కడ కార్యకలాపాలు విస్తరించనుంది.
- తెలంగాణకు నౌకాశ్రయాల అవసరం ఉంది. బందరు ఓడరేవు సేవలను ఉపయోగించుకోవాలని అనుకున్నాం. గోదావరి, కృష్ణా నదులపై జలమార్గాలు ప్రారంభమయితే భద్రాచలానికి నౌకలు వస్తాయి. అప్పుడు మనకు ఇతర రాష్ట్రాల నౌకాశ్రయాలతో పనుండదు. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ విస్తరణ ఉంటుంది. పాతనగరానికి మెట్రోను విస్తరిస్తాం.

ముందు ఎస్టీ రిజర్వేషన్లు

ఈనాడు, హైదరాబాద్: పురపాలక సంఘాల్లో రిజర్వేషన్లను ఖరారు చేయడానికి అవసరమైన కీలక ప్రక్రియను తెలంగాణ పురపాలకశాఖ కొనసాగిస్తోంది. ఈనెల 4 నాటికి రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన నేపథ్యంలో వార్డులవారీగా ఎస్సీ, ఎస్టీ జనాభా, వార్డులవారీగా బీసీ ఓటర్లను గుర్తించే ప్రక్రియకు పురపాలకశాఖ మార్గదర్శకాలను నిర్దేశించింది. తెలంగాణ రాష్ట్ర పురపాలక చట్టం మేరకు రిజర్వేషన్ల విధానాన్ని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గరిష్ఠంగా 50 శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. మొదటిగా ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలను గుర్తిస్తారు. అనంతరం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు, తర్వాత బీసీ రిజర్వేషన్లను నిర్ణయిస్తారు.

ఇదీ విధానం

- ముందుగా పురపాలక సంఘంలోని ఎస్టీల శాతాన్ని గుర్తిస్తారు. అనంతరం మొత్తం వార్డులు, ఎస్టీ జనాభా శాతం ఆధారంగా ఎస్టీలకు ఎన్ని స్థానాలో నిర్ణయిస్తారు.
- ఎస్సీల విషయంలోనూ ఇదేవిధానం ఉంటుంది.
- ఆ తర్వాత బీసీలకు ఎన్ని వార్డులనేదిగుర్తిస్తారు.

మేయర్, చైర్మన్‌ల రిజర్వేషన్లు

- ఎస్సీ, ఎస్టీలకు మేయర్లు, పురపాలక చైర్మన్ స్థానాలను గుర్తించేందుకు ప్రత్యేక విధానం అనుసరిస్తారు. రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తారు.
- కార్పొరేషన్లు లేదా పురపాలక సంఘాల్లో ఎస్సీ లేదా ఎస్టీ జనాభా శాతాన్ని గుర్తిస్తారు. ఆ శాతం ఆధారంగా ఎన్ని స్థానాలు ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలో నిర్ణయిస్తారు.

మహిళల రిజర్వేషన్లు ఇలా

- మొత్తం వార్డుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలుకానున్నాయి. వాటిని లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు.
- ఒక పురపాలక సంఘంలో ఒకే వార్డు ఎస్టీకి రిజర్వ్ అయితే అక్కడ మహిళా రిజర్వేషన్ వర్తించదు. ఎస్సీలకు కూడా ఒక వార్డే రిజర్వ్ అయితే అక్కడ కూడా మహిళల రిజర్వేషన్ అంశం వర్తించదు.
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 2011 జనాభా లెక్కలనే తీసుకుంటారు.
- ఒకవేళ పురపాలక సంఘంలో ఎస్సీ, ఎస్టీ స్థానాలు 50 శాతం ఉంటే అక్కడ బీసీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఉండవు.
- ఎస్సీ, ఎస్టీల వార్డులు 50 శాతం కంటే ఎక్కువ ఉంటే ఆ మేరకు వార్డులను విధిగా కేటాయించాలి. ఇటువంటి చోట మిగిలిన స్థానాలు జనరల్‌గా ఉంటాయి.

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు వేటిని కేటాయించారనేది 5న ప్రకటించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేస్తారు.

రిజిస్టర్డ్ పార్టీలకూ కామన్ సింబల్: రాష్ట్రంలో గతంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాదిరే రిజిస్టర్డ్ పార్టీలకు కామన్ సింబల్ కేటాయించే విధానాన్నే ఈసారీ అమలు చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. గుర్తుల కేటాయింపు కంటే ఐదు రోజుల ముందు రిజిస్టర్డ్ పార్టీలు దరఖాస్తు చేసుకోవాలి. రూ. 10,000 డిపాజిట్ చెల్లించాలి.

ఏడోతేదీలోపే 'పుర' అభ్యర్థుల జాబితా: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: రానున్న పురపాలక సంఘాల, నగరపాలక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను ఈనెల ఏడోతేదీ లోపు సిద్ధం చేయాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ ఇన్‌ఛార్జిలను ఆదేశించారు. ఎన్నికల అంశంపై బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన రాష్ట్ర కమిటీ నేతలు, సీనియర్ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "ఈనెల ఎనిమిది నుంచి కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ఎన్నికల కోసం నామినేషన్లు ప్రారంభమవుతున్నాయి. దానికంటే ముందే జాబితాలు ఖరారుచేయాలి. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి అంశాలను పరిగణనలోకి తీసుకొని వివరాలు సేకరించాలి. ఎమ్మెల్యేలు,ముఖ్యనేతల సమన్వయంతో జాబితాలను సిద్ధం చేయాలి" అని సూచించారు.

కల్తీ నివారణకు కాసుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

ఆహారోత్పత్తుల తయారీకి మేడ్చల్ జిల్లా దూలపల్లిలో 16.56 ఎకరాల స్థలాన్ని ఈ సంస్థకు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక బాగుందని కేంద్రప్రభుత్వం ఆహార శుద్ధి పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూ.4.28కోట్లను గ్రాంటుగా గత జులైలో మంజూరుచేసింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 18 నెలల్లోగా నిధులిచ్చి ఖర్చుచేస్తేనే వీటిని విడుదల చేస్తామని షరతు పెట్టింది. అక్కడితో అసలుకు ఎసరు వచ్చింది. ఇప్పటికే ఆరునెలలైనా రాష్ట్ర ప్రభుత్వం నిధులేమీ ఇవ్వలేదు. దీంతో కేంద్రం నిధులూ వెనక్కిపోయే ప్రమాదం ఏర్పడింది.

పునాదులైనా పడితేగా..!

ఒకవైపు రాష్ట్రంలో భారీగా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకావాలని, నిత్యావసర వస్తువులన్నీ ఇక్కడే కల్తీ లేకుండా తయారుచేయాలని ప్రత్యేక ఆహార శుద్ధి విధానం తెస్తున్నట్లు ప్రభుత్వం చెపుతోంది. కానీ మూడేళ్లుగా ఉద్యానసంస్థకు అవసరమైన రూ.26.38 కోట్లు సమకూర్చకపోవడంతో ఆహారశుద్ధి కేంద్రం భవన నిర్మాణానికి పునాదులైనా తవ్వలేదు. టీఎస్ఐపాస్ కింద ఈ ప్లాంటుకు పారిశ్రామిక రాయితీలు సైతం ఇవ్వడానికి పరిశ్రమల శాఖ అనుమతించింది. దీనిపై ఉద్యాన సంస్థ ఎండీ వెంకట్రాంరెడ్డిని 'ఈనాడు' వివరణ అడగ్గా నిధులివ్వమని రాష్ట్ర సర్కారును మళ్లీ అడిగినట్లు చెప్పారు.

తగ్గిన చలి తీవ్రత

ఈనాడు, హైదరాబాద్: రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో రాష్ట్ర రాజధాని సహా కొన్ని ప్రాంతాల్లో చలి తీవ్రత కొంత తగ్గింది. బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత 20 డిగ్రీలుంది. ఇది సాధారణంకన్నా 5.1 డిగ్రీలు అధికం అని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. ఇలాగే నిజామాబాద్‌లో 6.4 డిగ్రీలు అదనంగా పెరిగి 20.2 డిగ్రీలకు చేరింది.

కొత్త సంవత్సరంలో ప్రగతి పరవళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం గవర్నర్, సీఎం దాదాపు 3 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం పల్లె ప్రగతి కార్యక్రమంపై సమగ్ర నివేదికను గవర్నర్‌కు అందజేశారని తెలిసింది. పల్లెలన్నీ పరిశుభ్రత, పచ్చదనంతో అద్దంలా మెరిసేలా, ప్రజల అవసరాలు తీరేలా కార్యక్రమాలను రూపొందించామని చెప్పారు. 'ప్రతీనెలా రూ. 339 కోట్లను వాటికి విడుదల చేస్తున్నాం. గ్రామస్థాయిలో పాలనా వ్యవస్థను పటిష్ఠం చేశాం' అని సీఎం వివరించినట్లు తెలిసింది. . తెలంగాణలోని ఆదర్శ గ్రామాలను సందర్శించాలని సీఎం ఆహ్వానించారు.

మానేరు సందర్శించాలి

ఈ సందర్భంగా సీఎం నీటిపారుదల ప్రాజెక్టుల గురించి వివరించినట్లు తెలిసింది. కాళేశ్వరం నిర్మించిన మొదటి సంవత్సరంలోనే అద్భుతాలను సృష్టించిందని పేర్కొన్నట్లు తెలిసింది. గతంలో మధ్యమానేరు ప్రాంతం దుర్భిక్షంతో ఉండేదని, కాళేశ్వరం నీటితో ఇప్పుడు మానేరు జలసంపదతో నిండిందని వివరించినట్లు సమాచారం. ఆ ప్రాజెక్టును సైతం సందర్శించాలని ఆయన కోరినట్లు తెలిసింది. బృహత్తర లక్ష్యంతో సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని వెల్లడించినట్లు సమాచారం. తెలంగాణలో విద్యావైద్య రంగాలకు ప్రాధాన్యం పెంచే చర్యల్లో భాగంగా వందశాతం అక్షరాస్యతపై దృష్టి సారించామని పేర్కొన్నట్లు సమాచారం. దీనిలో ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తామని పేర్కొన్నట్లు తెలిసింది. గవర్నర్ పర్యవేక్షణలో రెడ్‌క్రాస్ సొసైటీ యాప్ రూపకల్పనపై సీఎం అభినందనలు తెలిపారు. దీనికి ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని వెల్లడించినట్లు తెలిసింది.

సీఎంకు శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలువురు మంత్రులు, ప్రముఖులు, ఉద్యోగ సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు మహమూద్‌అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాఠోడ్, నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్, పార్టీ పార్లమెంటరీపక్ష నేత కె.కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు మొక్కలు పువ్వులను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూలు విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ డిక్షనరీని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి సీఎంకు అందజేశారు.

గ్రహం అనుగ్రహం

2-1-2020 గురువారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
సప్తమి: రా.6.50 తదుపరి అష్టమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: తె.5.47 తదుపరి రేవతి
అమృత ఘడియలు: రా.12.28 నుంచి 2.14 వరకు
వర్జ్యం: ఉ.9.23 నుంచి 11.09 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.14 నుంచి 10.58 వరకు
తిరిగి మ.2.37 నుంచి 3.21
రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5.33

నిరక్షరాస్యులపై త్వరలో సర్వే

- 'ఈచ్ వన్.. టీచ్ వన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహణ
- గ్రామాల వారీగా తాజాగా గణాంకాల సేకరణ
- విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు బాధ్యత
- జాతీయ నమూనా సర్వేలో తెలంగాణ అక్షరాస్యత 72.80 శాతమే
- జాతీయ సగటు కంటే 5 శాతం తక్కువ

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీల వారీగా నిరక్షరాస్యులు ఎంత మంది ఉన్నారో తాజా లెక్కలు సేకరించేందుకు సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచే లక్ష్యంతో ప్రతీ అక్షరాస్యుడు మరో నిరక్షరాస్యుడికి చదువు నేర్పే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించిన నేపథ్యంలో త్వరలోనే సర్వేకు శ్రీకారం చుట్టనుంది. విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు ఈ సర్వేలో భాగస్వాములు కానున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ బుధవారం ఈ మూడు శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తాజా గణాంకాలు ఉంటే అక్షరాస్యత కార్యక్రమంపై కార్యాచరణ రూపొందించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ సగటు అక్షరాస్యత 72.99 శాతం. తెలంగాణ రాష్ట్రంలో అది 66.54 శాతమే. అంటే ఇంకా ఆరున్నర శాతం తక్కువ. తెలంగాణ కంటే వెనుకబడిన రాష్ట్రాలు ఝార్ఖండ్, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ మాత్రమే. కేంద్రపాలిత ప్రాంతాలనూ కలిపితే రాష్ట్రం 32వ స్థానంలో నిలిచింది. అన్ని రంగాల్లో ముందున్నా అక్షరాస్యత శాతంలో బాగా వెనుకంజలో ఉండటంతో జాతీయస్థాయిలో రాష్ట్రంపై చిన్నచూపు ఉందని ప్రభుత్వం భావిస్తోంది. 2021లో జరిగే జనాభా లెక్కల్లో అక్షరాస్యత శాతం వెల్లడవుతుంది. అప్పుడు సైతం రాష్ట్రం వెనుకబడితే మళ్లీ దశాబ్దంపాటు విద్యావేత్తలు, మేధావులు ఇదే విషయాన్ని తరచూ ప్రస్తావిస్తూ ఉంటారు. జాతీయ స్థాయిలో తెలంగాణపై చులకనభావం ఏర్పడుతుంది. దీన్ని ఎదుర్కోవాలంటే ఆలోగా ఒక ప్రజా ఉద్యమంలా అక్షరాస్యత కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 1.04 కోట్ల మంది నిరక్షరాస్యులున్నారు. వారిలో 15-49 మధ్య వయసు ఉన్న నిరక్షరాస్యులు 60 లక్షల మంది.

ఆశించింది 75..నమూనా సర్వేలో తేలింది 72.80 శాతమే

వచ్చే జనాభా లెక్కల నాటికి రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 75కు చేరుకుంటుందని వయోజన విద్యాశాఖ అంచనా వేసింది. అయితే ఇటీవల జాతీయ నమూనా సర్వే(ఎన్ఎస్ఎస్) నివేదిక ప్రకారం రాష్ట్రంలో అది 72.80 శాతమే ఉన్నట్లు తేలింది. అప్పటికీ జాతీయ సగటు(77.70) కంటే దాదాపు 5 శాతం తక్కువ ఉన్నట్లే. అందుకే ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలకు భిన్నంగా ఈచ్ వన్-టీచ్ వన్‌కు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మినహాయించి గ్రామాల్లో త్వరలోనే సర్వే ప్రారంభిస్తామని విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి చెప్పారు. ఒకే ఇంట్లో అక్షరాస్యులు, నిరక్షరాస్యులున్నారు...ఒకవేళ ఆ ఇంట్లో చదువుకున్న వారు లేకుంటే పొరుగింటి వారిచే అక్షరాస్యులుగా మారుస్తామని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో అక్షరాస్యత పరిస్థితి (2011 జనాభా లెక్కల ప్రకారం)

అక్షరాస్యత శాతం

- ★ పురుషులు - 75.04
- ★ మహిళలు - 57.99 (వ్యత్యాసం 17 శాతం)
- ★ ఎస్సీల్లో - 58.90
- ★ ఎస్టీల్లో - 49.51

10 లోగా జాబితాలు సిద్ధం చేయాలి

నిరక్షరాస్యుల జాబితాలను ఈ నెల 10వ తేదీ లోగా సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత పల్లెప్రగతి కార్యక్రమం గురువారం నుంచి మొదలవుతున్న సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడి బీఆర్‌కేఆర్ భవనం నుంచి కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వయోజనుల అక్షరాస్యతను పెంచేందుకు గ్రామాల్లో ప్రత్యేక ప్రచారాన్ని చేపట్టాలని, నిరక్షరాస్యుల జాబితాలను గ్రామాల వారీగా రూపొందించాలని సీఎస్ సూచించారు. జాబితాలను 10వ తేదీ వరకు ఎదురు చూడకుండా ఏ రోజుకారోజు అప్‌డేట్ చేయాలన్నారు. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, జనాభా లెక్కల సంచాలకులు ఇలంబర్తి, మహబూబ్‌నగర్ కలెక్టర్ రోనాల్డ్‌రోస్, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు పాల్గొన్నారు.

ఫాస్టాగ్‌కు ప్రత్యేక కౌంటర్లు

- కొన్ని హోటళ్లలో విక్రయ కేంద్రాలు
- సంక్రాంతి రద్దీని తట్టుకునేందుకు..
- జాతీయ రహదారుల సంస్థ ప్రణాళిక



హైదరాబాద్-విజయవాడ మార్గంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి రద్దీని గుర్తించిన జాతీయ రహదారుల సంస్థ అందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. జాతీయ రహదారుల్లో వాహనదారులు వేచి ఉండే వ్యవధిని తగ్గించేందుకు వీలుగా ప్రత్యేక ఫాస్టాగ్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-వరంగల్ మార్గాల్లో రద్దీ భారీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా జాతీయ రహదారుల్లో గుర్తించిన హోటల్స్‌లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల వద్ద టోల్‌ట్యాక్స్ వసూలును ఫాస్టాగ్ ద్వారా వసూలు విధానాన్ని గత నెలలో కేంద్రం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టోల్‌ప్లాజాలో ఉన్న టోల్‌గేట్లలో 25శాతం హైబ్రీడ్ పేరిట నగదురూపంలో ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి కేవలం రెండు వైపులా ఒక్కో మార్గాన్ని మాత్రమే నగదు వసూళ్ల కోసం కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది.

సంక్రాంతి సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆ సమయంలో కేవలం ఒక్కో మార్గంలోనే నగదు వసూలు విధానాన్ని అమలు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయి. గడువును మరికొన్ని రోజులపాటు పొడిగించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో టోల్‌గేట్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు ఫాస్టాగ్‌లను పెంచేందుకు జాతీయ రహదారుల వెంట ఉన్న హోటల్స్‌లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణం చేసే వాహనాలు ఏదో ఒక హోటల్ వద్ద కొద్దిసేపు సేద తీరుతుంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ మార్గంలో ఐదు హోటల్స్ హైదరాబాద్-బెంగళూరు మార్గం, హైదరాబాద్-వరంగల్ మార్గంలో రెండేసి హోటళ్ల చొప్పున గుర్తించి వాటిల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయ రహదారుల సంస్థ ప్రాంతీయ అధికారి ఆరేపల్లి కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. అన్ని టోల్‌ప్లాజాల వద్ద ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని చెప్పారు. ఫాస్టాగ్ ద్వారా చెల్లింపులు సుమారు 56 శాతం వరకు ఉన్నట్లు ఆయన వివరించారు.

కరీంనగర్ డీసీసీ అధ్యక్ష పదవికి మృత్యుంజయం రాజీనామా

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖలను సోనియాగాంధీకి పంపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పరాజయాన్ని చవి చూసినప్పటికీ చక్కదిద్దడంలో పార్టీ విఫలమైందన్నారు. పురపాలక ఎన్నికల్లో ఆయనకు తెలియకుండా కమిటీలు వేయడంపై మృత్యుంజయం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

ఏఎండీ డైరెక్టర్‌గా డీకే సిన్హా

ఈనాడు, హైదరాబాద్: అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్(ఏఎండీ) ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్‌గా డాక్టర్ డీకే సిన్హా నియమితులయ్యారు. దేశంలోని తూర్పు, పశ్చిమ, మధ్య భాగాల్లో విస్తరించి ఉన్న అణు ఖనిజాల అన్వేషణలో సిన్హాకు 35 ఏళ్ల విశేష అనుభవం ఉంది. ఆయన వ్యూహంతో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పెద్దఎత్తున అణు ఖనిజాల నిక్షేపాలు పెరిగాయి. ప్రస్తుతం ఆయన అదనపు డైరెక్టర్ హోదాలో ఇక్కడే ఉన్నారు. తాజాగా ఏఎండీ డైరెక్టర్‌గా నియమించారు.

తెరాసది దోపిడీ పాలన

- దొడ్డిదారిన మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది
- పోలీసుల తీరు మారకపోతే 'జైల్ భరో'
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్


వనపర్తి మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, మల్లురవి, వనపర్తి నియోజకవర్గ కార్యకర్తలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెరాసది దోపిడీ, కుటుంబ పాలన అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించారని, డబ్బు మయం చేశారని ఆరోపించారు. ఎన్నికల హామీలు గాలికొదిలేసి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన తెరాసకు పురపాలిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో అనేక కారణాలతో కాంగ్రెస్‌ను వీడిన నేతలు తిరిగి పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. తెరాస నేత, వనపర్తి మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ అనుచరులతో కలిసి ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల ఖరారుకు, నామినేషన్ల దాఖలుకు మధ్య రెండు రోజుల గడువుంటే అభ్యర్థుల ఎంపిక, బీ ఫారం అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని ఇదంతా చేస్తోందని ధ్వజమెత్తారు. ఇదేమని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ఎన్నికలంటే భయపడుతోందంటూ తెరాస నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వార్డుల రిజర్వేషన్ల ప్రకటనకు, నామినేషన్ల ప్రక్రియకు మధ్య కనీసం వారం గడువు ఉండాలని మాత్రమే కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే ఇలా దొడ్డిదారిలో గెలవాలని చూస్తోందన్నారు. తెరాస నేతలు పోలీసుల సాయంతో కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసుల తీరు మారకపోతే 'జైల్ భరో' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

పురపాలక ఎన్నికలకు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న పురపాలక ఎన్నికలకు మేనిఫెస్టో కమిటీని నియమిస్తూ ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి ఆర్‌సీ కుంతియా బుధవారం ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారు. రాములునాయక్, బెల్లయ్యనాయక్, ఎస్ఏ సోహెయిల్, ఆకుల రాజేందర్ ముదిరాజ్, ఎ.చంద్రశేఖర్, ఎం.జయపాల్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, సత్యం శ్రీరంగం, గాలి అనిల్‌కుమార్, పవన్ మల్లాడి తదితరులు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీ సమావేశమై పురపాలక ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టోను రూపొందించి ఈ నెల 4వ తేదీ లోగా టీపీసీసీకి అందజేయాలని కుంతియా సూచించారు.


ఈనాడు

మౌలిక సమస్యలు అధిగమిస్తేనే...

వచ్చే అయిదేళ్లలో భారత్‌ను అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరింపజేసే క్రమంలో మౌలిక వసతుల రంగాన నూరు లక్షల కోట్ల రూపాయల దాకా వెచ్చిస్తామన్నది మోదీ ప్రభుత్వం గతంలో జారీచేసిన హామీ. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతాను చక్రవర్తి సారథ్యంలో సీనియర్ బ్యూరోక్రాట్లతో కూడిన కార్యదళం- 18 రాష్ట్రాల్లో రూ.102 లక్షల కోట్లతో పట్టాలకు ఎక్కించాల్సిన పథకాల్ని జాబితాగా క్రోడీకరించింది. కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా వెలుగుచూసిన మౌలిక అజెండాకు ఆ కార్యదళం సిఫార్సులే ప్రాతిపదిక. ఆర్థిక, సామాజిక శ్రేణులుగా విభజించిన మౌలిక ప్రాజెక్టుల్లో విద్యుత్ సహా ఇంధన రంగానికి 24 శాతం, రహదారులకు 19 శాతం, పట్టణాభివృద్ధికి 16 శాతం, రైల్వేలకు 13 శాతం ప్రత్యేకించారు. గ్రామీణ మౌలిక వసతులకు ఎనిమిది శాతం; ఆరోగ్యం, విద్య, తాగునీరు తదితరాల సామాజిక పద్దుకు మూడు శాతం కేటాయించామంటున్నారు. ఇవన్నీ యథాతథంగా కార్యాచరణకు నోచుకుంటే ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్న అంచనాల్లో అతిశయోక్తి ఏమీ లేదు. మూలధన వ్యయీకరణలో ఎవరు ఎంత భారం తలకెత్తుకుంటారన్న లెక్కలపైనే శంకలు ఉత్పన్నమవుతున్నాయి. కేంద్రం, రాష్ట్రాలు చెరో 39 శాతం, ప్రైవేటు సంస్థలు తక్కిన 22 శాతం వ్యయభారం మోస్తే అనుకున్న లక్ష్యం సజావుగా నెరవేరుతుందన్నది కేంద్ర విత్తమంత్రి అభిప్రాయం. సుందర దృశ్యం. ఆ లెక్కన, మొత్తం అంచనా వ్యయంలో రమారమి 40 లక్షల కోట్ల రూపాయల మేర రాష్ట్రాలు సొంతంగా నిధులివ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే కాసుల కటకటతో కిందుమీదులవుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు అది నిస్సంశయంగా తలకుమించిన భారమేనన్నది నిర్వివాదం. మాంద్యానికి మౌలిక చికిత్స వినసొంపుగానే ఉన్నా, ఏ మేరకది సాకారమవుతుందన్నదే గడ్డుప్రశ్న.

దేశార్థిక వికాసానికి అత్యంత కీలకమైన ఎనిమిది పారిశ్రామిక విభాగాలు వరసగా నాలుగో నెల ఆందోళనకర ఫలితాలతో దిగులు పుట్టిస్తున్నాయి. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, ఉక్కు, విద్యుత్ రంగాల్లో వృద్ధి కుంచించుకుపోవడం మాంద్యం తాలూకు దుష్ప్రభావాలకు అద్దంపడుతోంది. సిమెంటు ఉత్పత్తిలో వృద్ధి నవంబరులో సగానికి పడిపోయింది. కొత్తగా రహదారులు, నౌకాశ్రయాలు, విద్యుత్-నీటిపారుదల వసతుల నిర్మాణం జోరందుకుంటే సిమెంటు, ఉక్కు రంగాలకు గొప్ప ఊపొస్తుందన్నది ఆశావహమైన అంచనా. బృహత్తర చొరవతో భారీ సత్ఫలితాలు సుసాధ్యం కానున్నాయన్న అధికారిక కథనాలకు, నిపుణులు లేవనెత్తుతున్న అభ్యంతరాలకు లంగరందడం లేదు. కేంద్రం తనవంతుగా అయిదేళ్లలో వెచ్చిస్తామంటున్న దాదాపు నలభై లక్షల కోట్ల రూపాయల రాశి ఇప్పటికే చేస్తున్న వ్యయంతో పోలిస్తే ఏమంత అధికం కాదంటున్న విశ్లేషణల్ని తేలిగ్గా కొట్టిపారేసే వీల్లేదు. పన్నెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో మౌలిక సదుపాయాల రంగానికి సుమారు రూ.52 లక్షల కోట్లు అవసరమని, అందులో 47 శాతం మేర ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో రాబట్టాల్సి ఉంటుందని ఏడేళ్ల క్రితం దీపక్ పరేఖ్ కమిటీ సూచించింది. విస్తృత స్థాయి నిధులు కూడగట్టడంలో బ్యాంకులదే ప్రధాన పాత్రగా అసోచామ్, క్రిసిల్ సంస్థల సంయుక్త శ్వేతపత్రం నాలుగేళ్లనాడు అభివర్ణించింది. మొండి బాకీల బరువు కింద బ్యాంకులు సతమతమవుతున్న నేపథ్యంలో, అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి ఎంతో మారిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది మాసాల్లో పరిశ్రమలకు బ్యాంకు రుణాలు 3.9 శాతం మేర కుంగిపోయాయి. అనుమతుల్లో ఎనలేని జాప్యం కారణంగా మౌలిక వసతుల ప్రాజెక్టులు నిలిచిపోయే దుర్గతిని చెదరగొట్టకుండా, నవ సంకల్పం నెరవేరుతుందని కేంద్రం ఎలా ధీమా వ్యక్తీకరించగలుగుతుంది?

అసలు దేశంపై మాంద్యం తాలూకు దుష్ప్రభావం మంచుదుప్పటిలా పరుచుకోవడానికి కారణాలే- క్షీణించిన విద్యుదుత్పత్తి, మందగించిన రుణ లభ్యత, రైతుకు కరవైన గిట్టుబాటు. సమగ్ర విధాన నిర్ణయాలు కొరవడి ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతులు చతికిలపడి- కడకు రెవిన్యూ అంచనాలు, రాష్ట్రాల బడ్జెట్ లెక్కలూ కిందుమీదులయ్యే దురవస్థ దాపురించింది. ఇందుకు విరుగుడుగా మౌలిక అజెండా అక్కరకొస్తుందని తలపోస్తున్న కేంద్రం, వాస్తవిక స్థితిగతుల్ని ఏమాత్రం ఉపేక్షించే వీల్లేదు. అయిదేళ్ల క్రితం వ్యాపార అనుకూలత సూచీలో 142వ స్థానానికి పరిమితమైన ఇండియా ఇటీవల 63కు చేరినా- ఒప్పందాల అమలులో 163, ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 154 ర్యాంకులతో దిమ్మెరపరుస్తోంది. అందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకాలనేనని ఆర్థికమంత్రిత్వ సలహాదారు సంజీవ్ సన్యాల్ మొన్నీ మధ్య స్పష్టీకరించారు. వివిధ ఒడంబడికలకు కట్టుబడటంలో ప్రభుత్వాల దివాలాకోరుతనాన్ని నిపుణులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అంతర్జాతీయ మౌలిక సదుపాయాల సూచీ 2019 ప్రకారం- విమానాశ్రయాల పద్దులో మనకన్నా మలేసియా మెరుగు. చైనా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా తదితరాలతో పోలిస్తే ఇక్కడి రహదారుల ముఖచిత్రం వెలాతెలాపోతోంది. వరదల నివారణ విధివిధానాల రీత్యా చైనా, సౌదీ, జర్మనీ వంటి దేశాలకన్నా ఇండియా చాలా వెనకబడి ఉంది. డెన్మార్క్, న్యూజిలాండ్, సింగపూర్, హాంకాంగ్‌లు నిపుణ మానవ వనరుల బలిమితో వెలుపలి పెట్టుబడిదారుల్ని సూదంటురాయిలా ఆకర్షిస్తున్నాయి. అటువంటి అనుభవాల నుంచి విలువైన గుణపాఠాలు నేర్చి, మౌలిక రంగాన్ని పటిష్ఠీకరిస్తూ వాణిజ్య ప్రతిబంధకాల్ని రూపుమాపితేనే- ఇక్కడికీ పెట్టుబడిదారులు బారులు తీరి ఆర్థిక దిగ్గజశక్తిగా భారత్ ఎదగగలుగుతుంది!



జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)కు, జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్)కు ఏ మాత్రం సంబంధం లేదని, ఎన్‌పీఆర్ అనేది 2021 జనగణనలో అంతర్భాగమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ఇటీవల పాత్రికేయుల సమావేశంలో స్పష్టీకరించారు. జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) రూపకల్పనకు ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సుల సంఖ్యలను ఇవ్వడమనేది పౌరుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది తప్ప నిర్బంధమేమీ ఉండదని ఆయన వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చిన వివరాలను స్వీకరిస్తామే తప్ప ఎన్‌పీఆర్ పేరుతో అనుమానాస్పద వ్యక్తుల జాబితా తయారుచేసే ఆలోచనే లేదని చెప్పుకొచ్చారు. ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను ముడిపెట్టే ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు. కానీ, 2003 నాటి పౌరసత్వ (పౌరుల నమోదు, జాతీయ గుర్తింపు పత్రాల జారీ) నిబంధనల్లోని మూడో నిబంధనకు చెందిన నాలుగో ఉప నిబంధన ప్రకారం జనాభా పట్టికలో తగు మార్పులుచేర్పులు చేయాలని ఈ

తొలగని సందేహాలు

- ★ ఎన్ఆర్‌సీకి ఎన్‌పీఆర్ బాట వేస్తుందా?
- ★ ప్రభావం చూపని కేంద్రం వివరణలు

ఏడాది జులై 31నాటి రాజపత్రం స్పష్టంగా పేర్కొంది. విశేషమేమంటే మూడో నిబంధనలోనే భారత పౌరుల జాతీయ పట్టిక (ఎన్ఆర్ఐసీ) భావన పొందుపరచి ఉంది. సదరు పట్టిక తయారీకి నాలుగో ఉప నిబంధన వీలుకల్పిస్తోంది.

కొత్త ప్రశ్నతోనే చిక్కు

నిజానికి కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాములోనే, అంటే 2010లో మొట్టమొదటిసారిగా జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) కోసం సమాచారం సేకరించారు. 2011 జన గణన కోసం కూడా ఇంటింటి సమాచార సేకరణ ప్రారంభమైంది. వాటి ఆధారంగా అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు కూడా. 2010 ఎన్‌పీఆర్ సమాచారాన్ని 2015లో ఇంటింటి సర్వే సాయంతో క్రోడీకరించారు. 2021 జనగణన కోసం 2020లోనే ఇళ్లూ భవంతుల నమోదు ప్రారంభించి, దానితోపాటే ఎన్‌పీఆర్‌ను రూపొందించే పనినీ చేపట్టాలని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయించింది. ఎన్‌పీఆర్ కోసం ప్రజలు ఇచ్చే సమాచారాన్ని స్వీకరిస్తామే తప్ప యక్షప్రశ్నలు వేయబోమని జావడేకర్ చెప్పుకొచ్చినా, ఇంతకుముందెన్నడూ అడగని ప్రశ్నను ఈసారి అడగబోతున్నట్లు తెలియవచ్చింది. అది- తల్లిదండ్రుల పుట్టిన స్థలం, తేదీలను తెలపాలని. దీంతో జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) గురించిన భయాలను మరింత ఎగదోస్తోంది. ప్రధాని మోదీ ఎన్ఆర్‌సీ తయారీపై ఇంకా నిర్ణయమేదీ తీసుకోలేదని చెప్పినా అవి సద్దుమణగలేదు. ఎన్ఆర్‌సీ తయారీకి ఎన్‌పీఆర్ తొలి మెట్టు అనే అనుమానంతో కేరళలో సీపీఐ(ఎం) నాయకత్వంలోని ప్రభుత్వం, పశ్చిమ్ బంగలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఎన్‌పీఆర్ మార్పులుచేర్పుల ప్రక్రియను నిలిపి ఉంచాయి. ఎన్‌పీఆర్‌కు, 2021 జనగణనకు సంబంధమే లేదని మమత అంటున్నారు. ఇక కేరళ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వచ్చిన దరిమిలా ఎన్‌పీఆర్ క్రమంగా ఎన్ఆర్‌సీకే దారితీస్తుందని భావిస్తూ ఎన్‌పీఆర్ పనులను నిలిపేసింది. సీఏఏ కాందిశీకులకు పౌరసత్వం ఇవ్వడానికి మతాన్ని కొలబద్దగా తీసుకుంటుందని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఒక మత వర్గంపై గురిపెట్టడానికి ప్రభుత్వం ఎన్‌పీఆర్ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తుందనే అనుమానాన్ని ఓ ప్రతిపక్ష నాయకుడు వ్యక్తం చేశారు.

ఎన్‌పీఆర్ కోసం సమాచార సేకరణ జరిపేటప్పుడు ఒక నిర్దిష్ట మతవర్గంవారు తమ తల్లిదండ్రుల పుట్టుపూర్వోత్తరాలను సరిగ్గా చెప్పలేకపోతే, వారి వివరాలతో రహస్య జాబితా ఒకటి తయారుచేయవచ్చని, అవకాశం వచ్చినప్పుడు ఆ జాబితాలోనివారిని చొరబాటుదారులుగా ముద్రవేసే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై వ్యాఖ్యానించడానికి భారతీయ జనతా పార్టీ వర్గాలు నిరాకరించాయి.

పదేపదే వివరణలతో చల్లారని అనుమానాల వల్ల ఎన్‌పీఆర్‌ను తాజా సమాచారంతో రూపొందించాలని డిసెంబరు 24న కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆ తరవాత కొద్దిగంటలకే ఎన్ఆర్‌సి, ఎన్‌పీఆర్‌లకు సంబంధమే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఎన్ఆర్‌సీపై పార్లమెంటులో కాని, మంత్రివర్గంలో కాని చర్చ జరగలేని ప్రధాని మోదీ చెప్పిన సంగతిని షా గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వు వల్లనే అసోమ్‌లో ఎన్ఆర్‌సిని అమలు చేశామని డిసెంబరు 22న దిల్లీ సభలో మోదీ వివరించారు. కానీ, కూలంకషంగా చర్చించిన తరవాత జాతీయవ్యాప్తంగా ఎన్ఆర్‌సి రూపకల్పన చేపడతామని భాజపా ఉపాధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ డిసెంబరు 23న ప్రకటించారు. సీఏఏని వ్యతిరేకిస్తున్న భాజపాయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులపై ఆయన విమర్శలు గుప్పించారు కూడా. పౌరసత్వమనేది కేంద్ర జాబితాలోని అంశం. సీఏఏ రాజ్యాంగ ప్రక్రియ ద్వారా చట్టరూపం ధరించింది, దాన్ని పార్లమెంటు ఆమోదించింది కూడా. కాబట్టి ముఖ్యమంత్రుల నిరసనలతో నిమిత్తం లేకుండా దాన్ని అమలు చేసి తీరతామని చౌహాన్ స్పష్టం చేశారు. వారు ఆ చట్టాన్ని అమలు చేయడానికి మొరాయిస్తే ఇతర మార్గాల్లో దాన్ని కార్యరూపంలోకి తెస్తామన్నారు. ప్రధాని మోదీ అఖిల భారత ఎన్ఆర్‌సీ గురించి ఎన్నడూ చర్చించలేదనడం పట్ల ఎన్‌సీపీ నాయకుడు శరద్ పవార్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రాష్ట్రపతి పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ఎన్ఆర్‌సీ ప్రస్తావన ఉందని, రాజ్యసభలో అమిత్ షా కూడా అఖిల భారత ఎన్ఆర్‌సీని తీసుకొస్తామని చెప్పారని ఆయన గుర్తుచేశారు. భారత్ నుంచి అక్రమ చొరబాటుదారులను గెంటేయడానికి ఎన్ఆర్‌సీని ప్రవేశపెడతామని సీనియర్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేడీ నడ్డా గతంలో చాలాసార్లు స్పష్టంగా ప్రకటించి ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు భాజపా విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలోనూ ఎన్ఆర్‌సీని పొందుపరచారు.

నిర్వచనంలో మతలబు

యూపీఏ హయాములోనే ఎన్‌పీఆర్ కోసం తొలి అడుగు పడినా, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాతనే దేశవ్యాప్తంగా ఎన్ఆర్‌సీ తయారీకి సాధికారంగా కృషి మొదలైంది. 2019 జులై 31న ఇందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. భారత పౌరుల జాతీయ పట్టిక (ఎన్ఆర్ఐసీ) తయారీకి ఈ విధంగా తొలి అడుగు పడింది. అన్నట్లు జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) తయారీకీ 2003లో ఎన్డీయే హయాములోనే బీజం పడింది. ఇదంతా కాకతాళీయం కాదని వేరే చెప్పాలా? ఆ సంవత్సరం భాజపా నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పౌరసత్వ (పౌరుల నమోదు, జాతీయ గుర్తింపు పత్రాల జారీ) నిబంధనలను వెలువరించింది. 'గ్రామం లేక గ్రామీణ ప్రాంతం, పట్టణం లేదా వార్డు లేక పౌరుల నమోదు రిజిస్ట్రార్ గుర్తించిన ప్రాంతంలో నివసిస్తున్న వ్యక్తుల వివరాలతో కూడిన పట్టికను జనాభా పట్టికగా వ్యవహరించాలి' అని సదరు నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ఈ నిబంధనలు ఎన్ఆర్ఐసీని భారతదేశం లోపల, వెలుపల నివసిస్తున్న భారతీయ పౌరుల పట్టిక అని నిర్వచించాయి. తనిఖీ సమయంలో కొందరు వ్యక్తులు తాము భారత పౌరులమని నిర్ద్వంద్వంగా నిరూపించుకోలేకపోవచ్చు. అటువంటి అనుమానాస్పద వ్యక్తుల గురించి లోతుగా విచారణ జరపాలని 2003నాటి నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. కాబట్టి జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) అనుమానాస్పద వ్యక్తుల జాబితా తయారుచేసి, వారి పూర్వాపరాలను విచారించనుంది. ఇది చివరకు ముస్లిములకు వ్యతిరేకంగా పరిణమిస్తుందని ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నాయి.

- రాజీవ్ రాజన్

పేదల కోసమే ప్రయత్నాలు



జాతీయ పౌర పట్టిక కార్డులతో అసోం ప్రజలు

జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ఆధారంగానే పేదలకు వివిధ ప్రభుత్వ పథకాల ఫలాలను అందిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరించారు. కాబట్టి ఎన్‌పీఆర్‌ను రాజకీయం చేయవద్దని కేరళ, పశ్చిమ్ బంగ ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. వారి వ్యతిరేకత వల్ల పేదలకు నష్టం వాటిల్లుతుంది కాబట్టి ఈ విషయమై పునరాలోచన చేయాలని కోరారు. ఎన్‌పీఆర్‌కు, ఎన్ఆర్‌సీకి మధ్య పేరు మార్పే తప్ప, మరే తేడా లేదని మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ వర్ణించడాన్ని షా ఖండించారు. భాజపా ఎడ్డెమంటే మజ్లిస్ తెడ్డెమనడం మామూలేనని ఈసడించారు. 'సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని భాజపా అంటే, లేదు లేదు పడమర ఉదయిస్తాడని మజ్లిస్ అంటుంది. ఎన్‌పీఆర్ కూడా ఎన్ఆర్‌సీకి సంబంధం లేదని ఒవైసీజీకి నేను భరోసా ఇస్తున్నా' అని షా పేర్కొన్నారు. ఎన్‌పీఆర్ అనేది భాజపా ఎన్నికల ప్రణాళికలో లేనేలేదని, గతంలో కాంగ్రెస్ ప్రారంభించిన కార్యక్రమాన్ని తాము కొనసాగిస్తున్నామని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ హయాములో ఎన్‌పీఆర్ కోసం సమాచార సేకరణ జరిగిన మాట నిజం. 2011 జనగణన కోసం ఇళ్లూ భవంతుల చిట్టా తయారీని 2010లో చేపట్టారు. తరవాత అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ జాతీయ గుర్తింపు పత్రాలను జారీచేశారు. అయితే అదంతా లాంఛనప్రాయమేనని చెప్పాలి.

అఫ్గాన్‌లో ఆశాకిరణం

అంతర్యుద్ధంతో సతమతమవుతున్న అఫ్గానిస్థాన్‌లో శాంతివీచికలు వీస్తున్నాయి. ఏళ్ల తరబడి కొనసాగుతున్న మారణకాండ అంతం కావడానికి సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాత్కాలికంగా కాల్పుల విరమణకు తాలిబన్ ఉగ్రవాద సంస్థ అంగీకరించడంతో శాంతిస్థాపనకు అవకాశాలు తెరచుకుంటున్నాయి. అమెరికాతో శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు వీలుగా సుదీర్ఘ తర్జనభర్జనల అనంతరం తాలిబన్లు ఒక అడుగు ముందుకేశారు. కాల్పుల విరమణ ఎంతకాలమన్న విషయమై స్పష్టత లేదు. కనీసం పది రోజులపాటు తుపాకులు మోగబోవని తాలిబన్ వర్గాలు చెబుతున్నాయి. 2018 జూన్‌లో రంజాన్ సందర్భంగా మూడురోజులపాటు కాల్పుల విరమణ పాటించారు. ఈసారి ఈ గడువు పెంచడం ఒకింత ఊరట కలిగించే అంశం. అఫ్గాన్ నుంచి అమెరికా దళాలు వైదొలగడం, అఫ్గాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలకు స్వస్తిపలకడం శాంతి ఒప్పందం లక్ష్యం.

నష్టపోయిన అమెరికా

ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో 18 ఏళ్ల క్రితం అమెరికా సైన్యం అఫ్గాన్‌లో అడుగుపెట్టింది. దీనివల్ల సమస్య పరిష్కారం కాకపోగా తీవ్రరూపం దాల్చింది. ఏళ్ల తరబడి సైన్యం కొనసాగింపు వల్ల అమెరికా ఆర్థికంగా, సైనికపరంగా నష్టపోయింది. ఉగ్రదాడుల్లో అనేకమంది సైనికులూ హతులయ్యారు. దీంతో ఈ యుద్ధం అసలు ఎవరి కోసమన్న అంతర్మథనం ప్రారంభమైంది. దళాల ఉపసంహరణకు ఒబామా హయాములోనే ప్రయత్నాలు జరిగినప్పటికీ కొలిక్కిరాలేదు. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అఫ్గాన్ నుంచి దళాల ఉపసంహరణను తన ఎన్నికల ప్రణాళికలో ప్రత్యేకంగా ప్రకటించారు. అయితే పదవీకాలం ముగుస్తున్నా ఆ దిశగా విజయవంతం కాలేకపోయారు. 2018 సెప్టెంబరులో కతార్ రాజధాని దోహా నగరంలో తాలిబన్లతో శాంతి చర్చలను ట్రంప్ అర్ధంతరంగా నిలిపేశారు. అసలు చర్చించడానికి అంశమంటూ ఏమీ లేదని ప్రకటించి గందరగోళం సృష్టించారు. ఆపై నవంబరు నెలాఖరులో ఆకస్మికంగా అఫ్గానిస్థాన్ వెళ్లిన ట్రంప్ మళ్ళీ చర్చలు జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు నిరుడు నవంబరు మొదటివారంలో జరిగిన చర్చల్లో తాత్కాలికంగా అయినా కాల్పుల విరమణ పాటించాలని అమెరికా పిలుపిచ్చింది. దీనికి స్పందనే తాలిబన్ల తాజా ప్రకటన!

పైకి చెప్పనప్పటికీ అఫ్గాన్‌లో జోక్యంతో అమెరికాకు తలబొప్పి కట్టింది. దీంతో ఏదో ఒక పేరుతో వీలైనంత త్వరగా తట్టాబుట్టా సర్దుకుని అక్కడి నుంచి నిష్క్రమించాలన్న ఆలోచనతో అగ్రరాజ్యం ఉంది. ప్రస్తుతం 12 వేల మంది అమెరికా సైనికులు అఫ్గాన్‌లో ఉన్నట్లు అంచనా. ఒప్పందం కుదిరితే వీరు వెనక్కు వెళ్లిపోతారు. తాలిబన్లకు కావలసిందీ అదే. అంతర్యుద్ధానికి తెరదించేందుకు అఫ్గాన్ అధ్యక్షుడు ఘనీ ప్రయత్నించారు. తాలిబన్ల డిమాండ్లపై ఓ మెట్టు దిగేందుకూ ఆయన సిద్ధపడ్డారు. అయితే ఎన్నికలు వద్దన్న తాలిబన్ల



తాలిబన్, అమెరికా ప్రతినిధుల మధ్య చర్చల దృశ్యం (పాత చిత్రం)

డిమాండ్లను తిరస్కరించారు.

కాల్పుల విరమణ వైపు తాలిబన్లు

ఏళ్ల తరబడి కొనసాగుతున్న అంతర్యుద్ధంతో అఫ్గానిస్థాన్ అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ప్రజల ప్రాణాలకు పూచిక పుల్ల పాటి విలువ లేకుండా పోయింది. ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య దాడుల్లో అమాయక పౌరులు హతులవుతున్నారు. కొన్ని సందర్భాల్లో భద్రతాదళాలు సైతం బలవుతున్నాయి. అంతర్యుద్ధం ఫలితంగా దేశ ఆర్థికవ్యవస్థ దారుణంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణానికి రెక్కలొచ్చాయి. నిత్యావసర సరకుల ధరలు నింగినంటాయి. దీంతో ప్రజలు కడగండ్ల పాలవుతున్నారు. మరోపక్క విద్యారంగం ఉసూరుమంటోంది. నిత్యం ఘర్షణల కారణంగా బాల్యం విద్యకు దూరమవుతోంది. పదేళ్ల అంతర్యుద్ధంలో లక్షమంది పౌరులు మరణించడమో, లేదా తీవ్ర గాయాల పాలవడమో జరిగింది. ఐక్యరాజ్య సమితి వెల్లడించిన అధికారిక సమాచారమిది. సగటున దేశంలో రోజుకు వంద మంది మరణించడమో, గాయపడటమో జరుగుతోంది.

స్థానిక ప్రభుత్వం, అమెరికా దళాలకు వ్యతిరేకంగా పోరాడిన తాలిబన్లు అరాచకాలను సృష్టించారు. అధ్యక్ష ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలపై దాడులకు తెగబడ్డారు. ఓటర్లను బెదిరించారు. కొన్నిచోట్ల అభ్యర్థులను కాల్చి చంపారు. ఒకపక్క శాంతి చర్చలంటూనే మరోపక్క దాడులకు తెగబడటం ఈ ఉగ్రవాద సంస్థ నైజం. అందువల్లే ఇప్పుడు కూడా కాల్పుల విరమణ ప్రకటనకు తాలిబన్లు ఎంతవరకు కట్టుబడి ఉంటారనేది ప్రశ్నార్థకమే! పొరుగున ఉన్న పాకిస్థాన్ అండదండలు తాలిబన్లకు పుష్కలంగా ఉన్నాయి. తాలిబన్ల ద్వారా అఫ్గాన్‌లో చిచ్చు పెట్టాలన్నది పాకిస్థాన్ లక్ష్యం. దాదాపు సగం దేశాన్ని తాలిబన్లు నియంత్రిస్తున్నారు. వారిని అడ్డుకునే శక్తి భద్రతా దళాలకు లేదన్నది వాస్తవం. ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) కూడా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో విధ్వంసానికి పాల్పడుతోంది.

మరోపక్క దేశంలో బాలల పరిస్థితి దయనీయంగా ఉంది. వారి భవితవ్యానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లభించడం లేదు. దాదాపు సగంమంది బాలలు విద్యకు దూరంగా ఉన్నారు. 2018లో యునిసెఫ్ నివేదిక బయటపెట్టిన చేదునిజమిది. భద్రతా లోపం, పేదరికం, బాల్య వివాహాలు, లింగ వివక్షణ ఇందుకు కారణాలు. ముఖ్యంగా ఏడు నుంచి 17 ఏళ్లలోపు పిల్లలు పాఠశాలలకు వెళ్లడం కనాకష్టంగా ఉంది. సంపన్న వర్గాలవారు 10 నుంచి 18 ఏళ్ల వయసు గల మగ పిల్లలను బానిసలుగా మార్చుకుంటున్నారు. సాయుధ ముఠాలు, మాజీ కమాండర్లు, ధనవంతులు, రాజకీయ ప్రాబల్యం గలవారు తమ సామాజిక హోదా, స్థోమతలను చాటుకునేందుకు పేద తల్లిదండ్రుల నుంచి వీరిని కొనుగోలు చేస్తారు. కొన్ని సందర్భాల్లో అపహరిస్తున్నారు. వారితో ఇంటి పనులు చేయిస్తూ బానిసలుగా చూస్తున్నారు. తూర్పు, దక్షిణ ప్రాంతాలు, ఉత్తర అఫ్గాన్‌లోని తజిక్ ప్రాంతంలోనూ ఈ విష సంస్కృతి విస్తరించింది.

శాంతిస్థాపనకు అవకాశం

అమెరికా కనుసన్నల్లో పనిచేసే అఫ్గాన్ పౌర ప్రభుత్వాలు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో విఫలమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. 2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు అధికారంలో ఉన్న హమీద్ కర్జాయ్ ప్రభుత్వం అచేతనంగా వ్యవహరించింది. 2014 ఎన్నికల్లో గెలిచి అధ్యక్ష పదవిని అందుకున్న అష్రాఫ్ ఘనీ శాంతిభద్రతలను చక్కదిద్దడంలో చేతులెత్తేశారు. కర్జాయ్, ఘనీ ఇద్దరూ అమెరికా కీలుబొమ్మలే. ఘనీ గతంలో ఆర్థికమంత్రిగా, ప్రపంచబ్యాంకులో ఆర్థికవేత్తగా పనిచేశారు. తాజాగా 2018 సెప్టెంబరు 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘనీ విజయం సాధించారు. ఆయనపై పోటీచేసిన అబ్దుల్లా అబ్దుల్లా ఎన్నికల్లో ప్రభుత్వం రిగ్గింగ్‌కు పాల్పడిందంటూ ఫలితాలను గుర్తించడానికి నిరాకరించారు. ఈయన కూడా అమెరికా మనిషే. గతంలో విదేశాంగ మంత్రిగా, నిన్నమొన్నటి వరకు ఘనీ ప్రభుత్వంలో ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా పనిచేశారు. రిగ్గింగ్ ఆరోపణలను ఐరాసతో పాటు ఎన్నికల సంఘమూ తోసిపుచ్చింది. తాలిబన్ల పాలన అంతం తరవాత పారదర్శకంగా జరిగిన ఎన్నికలు ఇవేనని ఐరాస స్పష్టం చేసింది. ఈ విషయాన్ని పక్కనపెడితే తాలిబన్ల కాల్పుల విరమణ ప్రకటన ద్వారా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ, అమెరికా చొరవ చూపడం అవసరం!

- గోపరాజు మల్లపరాజు

కాలగమనం

సూర్యోదయం, సూర్యాస్తమయం, దివారాత్రాలు, రుతువులు, అవి తెచ్చే మార్పులు... మనిషి అన్నీ గమనిస్తూనే ఉంటాడు. అది కాలగమనం అనుకుంటాడేకాని కళ్లముందే కరిగిపోతున్న తన జీవితమని అతడు తెలుసుకోడు. తెలుసుకునేందుకు తగినంతగా ప్రయత్నించడు. ఉపనిషత్తులన్నీ- కాలాన్ని దాటుకు వెళ్లగల శక్తి అతడికి లేదని, కాలమే అతడిని దాటుకుంటూ వెళ్లిపోతుందని తెలుసుకొమ్మన్నాయి. కాలంలో కలిసిపోయిన ప్రతిక్షణం తాను ఉంటున్న ఈ భౌతిక ప్రపంచంలో, శిథిలమైపోతూ తాను పూర్తిగా నశింపజేసే పరిస్థితికి చేర్చేందుకే ఉన్నదని, అతడు తెలుసుకోదగ్గ విషయమన్నాయి. భజగోవిందంలోని శ్లోకంలో ఆదిశంకరులు మనిషికి లోకంలో కాలం మిగిల్చి ఉంచేదేమీ ఉండదని కాలం మహత్వపూర్ణతను హెచ్చరికగా అతడికి వినిపించారు. కాలం కదిలే చైతన్యం. కాలానికి ఆద్యంతాలు ఏమిటన్నవి శేషప్రశ్నలు.

కాలాన్ని నిర్ణయించేది గడియారాలు కాదు. తాను తెచ్చే మార్పులు కాలానికి మాత్రమే తెలుసు. ప్రవాహం లాంటి కాలానికి అడ్డుకట్టలు వేయాలనుకున్నా, ఎదురీదాలనుకున్నా మనిషి ప్రయత్నిస్తే అతడికి మిగిలేది దుఃఖమే. కాలం కదలికలన్నింటినీ నిశితంగా పరిశీలించగలవాడైనప్పుడే అతడీ లౌకిక ప్రపంచంలో ఉన్నంత కాలం తాను చేయవలసిన నిర్మాణాత్మకమైనదెంతో ఉందని తెలుసుకుంటాడు. తన ఉనికి, గమ్యాలపై ఆలోచనలను మెరుగుపరచుకుంటాడు. పారమార్థిక సత్యాలు గ్రహించడానికి కాలంతోపాటే కదులుతూ, భూత, భవిష్యత్ వర్తమానాలను అనుసంధానించుకునే ప్రయత్నాల్లో ఉంటాడు. సనాతన ధర్మం అతడికెప్పుడూ కాలానుగుణమై, భౌతిక జీవనానికి సమగ్రత కల్పించుకుంటూ, అది ముగించగలదెలాగో చెప్పే పురుషార్థ సాధనలనే సూచించింది.

కాలం మనిషికి అతడీ ప్రపంచంలో భాగమై ఉన్నంతకాలం తననెలా ఉపయోగించుకోవాలో ఆ మర్మాలు మాత్రమే చెబుతుంది. ఇదే విధంగా వాడుకొమ్మని ఆదేశాలివ్వదు. అరచేతిలో పరికరంలా ఉంచుకుని, బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకొమ్మంటుంది.

కాలాన్ని యుగాలుగా, శతాబ్దాలు, సంవత్సరాలు, మాసాలుగా విభజించి మనిషికి ఎవరూ ఇవ్వలేదు. ఆ విభజన జరుపుకొన్నది



అంతర్యామి

అతడే. విలువ లేని క్షణమంటూ ఒక్కటైనా కాలంలో ఉండదు. కాలం విరామమెరుగదు. వేదాంతి ఎమర్సన్ అరనిమిషమైనా తమకు తీరికలేదంటూ, అర్థవంతంగా కాలాన్ని ఉపయోగించని మనుషుల్ని అవివేకులన్నాడు. అమరత్వ సిద్ధికి వారు అనర్హులంటాడు.

కాలాన్ని సంస్మరించుకుంటూ తగిన రీతిలో మాన్యత ఇవ్వాలన్నది మనిషికి తెలియనిది కాదు. కొత్త సంవత్సరంగా అతడు లెక్కించుకునే అందులోని ఆ మొట్టమొదటి రోజు, కాలభ్రమణంలో కనురెప్పపాటు కానిదైనా, అది పండుగ వాతావరణంలో జరుపుకోవాలనే సంప్రదాయం ఏర్పరచుకుని అతడు విధిగా పాటిస్తాడు. గడచిన సంవత్సరం విడిచివెళ్లిన అనుభవాలు, భయాలు, అవరోధాలుగా మారిన అలవాట్లను జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. అవి నేర్పిన పాఠాలను మననం చేసుకుంటాడు. ప్రతికూల ఆలోచనలు వదిలి, కొత్త లక్ష్యాలపై గురిపెట్టాలనుకుంటాడు. ప్రతిజ్ఞలు, తీర్మానాలు చేస్తాడు. కొత్త సంవత్సరం అందుకు మంచి ముహూర్తం అనుకుంటూ పర్వదినంలా, పండుగలా బంధుమిత్రుల మధ్య ఉల్లాసంగా గడుపుతాడు.

కొత్త సంవత్సరం తొలినాళ్ల సంకల్పాలు మనిషికి ఆకాంక్షల పట్టికగా మిగిలిపోకూడదు. అవి ఆమోదయోగ్యమైన ఆలోచనలని పించాలి. అందరికీ మేలు జరిగే నిర్ణయాలకు, తన భవిష్యత్ దర్శనానికి బాటలు వేయాలి. తనకున్న బలహీనతల్లో ఏ ఒక్క దానినుంచైనా బయట పడవేయగల ప్రయత్నానికి కొత్త సంవత్సరం నాంది కావాలి.

- జొన్నలగడ్డ నారాయణమూర్తి



వితరణ.. వినూత్నం..

సాధారణంగా కొత్త సంవత్సరం రోజున శుభాకాంక్షలు తెలిపేందుకు పుష్పగుచ్ఛాలు ఇస్తారు. వరంగల్ అర్బన్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాత్రం జనవరి ఒకటో తేదీన తన వద్దకు వచ్చే వారు పుష్పగుచ్ఛాలకు బదులు విద్యార్థులకు ఉపయోగపడే రాత పుస్తకాలు, పెన్నులు, శీతాకాలం కావడంతో అనాథ విద్యార్థుల కోసం దుప్పట్లు, ఖాదీకట్లు వితరణగా అందివ్వాలని పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు కలెక్టరేట్‌లో వస్తు సామగ్రి అందజేశారు. కలెక్టర్ ప్రయత్నాన్ని ప్రశంసించారు.

- ఈనాడు, వరంగల్

పడిగాపులు.. నిత్యం..

కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతన్నకు ఇబ్బందులు తప్పటంలేదు. నల్గొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి సమీపంలో రెండు జిన్నింగ్ మిల్లులు ఉండటంతో చుట్టుపక్కల ఐదు మండలాల రైతులు పత్తి కొనుగోళ్ల ఇక్కడే చేస్తున్నారు. ఈ మండలాల్లో పత్తి బాగా పండటంతో సీసీఐ కేంద్రం ప్రారంభించి 40 రోజులు దాటుతున్నా రైతులు తెచ్చిన పత్తి వాహనాలు బారులు తీరుతున్నాయి. టోకెన్ పద్ధతితో మరింత జాప్యం జరుగుతోంది. ఇక్కడి పడిగాపులు పడినా.. కాంటా సమయంలో పత్తి ఏ కొంచెం బాగా లేక పోయినా కొనడంలేదు. దీంతో రైతులు తప్పనిసరై దళారీలకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

- ఈనాడు, నల్గొండ



నయాసాల్ కిక్కు!

రెండు రోజుల్లో రూ.378 కోట్ల మద్యం విక్రయాలు

ఈనాడు, హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం ఏరులై పారింది. పెద్దసంఖ్యలో మందుబాబులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రూ.378 కోట్ల విక్రయాలు జరిగాయి. సంవత్సరం చివరి రోజు మందు అందుబాటులో ఉండదేమో అనే ఆందోళనతో చాలా మంది ముందు రోజే కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. బీరు, మద్యం కలిపి రాష్ట్రంలో రెండు రోజుల్లోనే 83.43 లక్షల లీటర్ల ఖాళీ చేశారు. సగటు రోజువారీ అమ్మకాల కంటే డిసెంబరు 31వ తేదీ ఒక్కరోజే 150 శాతం ఎక్కువగా జరిగాయి. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో రూ.2,050 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ లెక్కన సగటున రోజుకు రూ.66 కోట్ల మందు అమ్మారన్నమాట. అయితే, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 30, 31 తేదీల్లో రెండు రోజుల్లోనే రూ.378 కోట్ల సరకు అమ్మారు. విడివిడిగా చూసుకుంటే డిసెంబరు 30న 2.93 లక్షల కేసుల మద్యం, 2.97 లక్షల కేసుల బీర్ల చొప్పున రూ.220 కోట్లు, 31వ తేదీన 1.92 లక్షల కేసుల మద్యం, 2.15 లక్షల కేసుల బీర్ల చొప్పున రూ.158 కోట్ల అమ్మకాలు జరిగాయి. వీటిని లీటర్లలో చూస్తే.. రెండు రోజుల్లో రాష్ట్రంలో సుమారు 39.78 లక్షల లీటర్ల బీర్లు, 43.65 లక్షల లీటర్ల మద్యం తాగేశారన్నమాట.



ప్రమాద రహితంగా వేడుకలు: డీజీపీ

రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వేడుకలు ముగిశాయి. స్వీయ నియంత్రణతో ట్రాఫిక్ నిబంధనల్ని పాటించిన ప్రజలకు కృతజ్ఞతలు. ప్రమాద రహితంగా వేడుకలు జరిగేలా పోలీసు సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించారు.

31 రాత్రి పట్టుబడ్డది 3,148 మంది మందుబాబులు

రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఒకే రోజు రాత్రి ఏకంగా 3,148 మంది మందుబాబులు చిక్కారు. ప్రమాద రహిత వేడుకలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 29 యూనిట్లలో పోలీసులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. డిసెంబరు 31న రాత్రి నుంచి ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ క్రమంలో మొత్తం 3,148 మంది మందుబాబులు అడ్డంగా దొరికిపోయారు. వీరిలో ఓ మహిళా చోదకురాలూ ఉన్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 951 మంది, సైబరాబాద్‌లో 873 మంది, రాచకొండలో 281 మంది దొరికారు. వరంగల్, కరీంనగర్ కమిషనరేట్ల కంటే అధికంగా మందుబాబులు నల్గొండ జిల్లాలో పట్టుబడ్డారు. అత్యల్పంగా వికారాబాద్, సూర్యాపేటల్లో 9 మంది చొప్పున, కామారెడ్డి, నాగర్‌కర్నూలులలో ఏడుగురు చొప్పున, ములుగులో ఆరుగురు దొరికిపోయారు. నారాయణపేటలో కేవలం ఒక్కరే చిక్కారు.

పోలీసులు హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లలేదు

వరవరరావు తరఫు న్యాయవాది వెల్లడి

పుణె: విరసం వ్యవస్థాపక సభ్యుడు వరవరరావు ఇంట్లో గతేడాది పుణె పోలీసులు సోదాలు చేసి హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకోలేదని ఎల్గార్ పరిషద్-మావోయిస్టుల కేసులో వరవరరావు తరఫు న్యాయవాది తెలిపారు. ఈ మేరకు న్యాయవాది రోహన్ నాయర్ విచారణ న్యాయస్థానం వద్ద ఓ దరఖాస్తు దాఖలు చేశారు. వరవరరావు ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న హార్డ్ డిస్క్‌లో ఏ సమాచారం ఉందో తెలుసుకోవడానికి అమెరికా సంస్థ ఎఫ్‌బీఐ సహకారం తీసుకుంటామని పుణె పోలీసులు మీడియాలో వచ్చిన కథనాలపై వివరణ కావాలంటూ అందులో అభ్యర్థించారు. పోలీసుల పంచనామాలో ఎక్కడా 'హార్డ్ డిస్క్'ను స్వాధీనం చేసుకున్నట్లు లేదన్న సంగతిని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మీడియా కథనాలపై పోలీసుల నుంచి వివరణ కోరడం తప్పనిసరని పేర్కొన్నారు. ఈ వివాదంపై సవివర నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. వరవరరావు ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్‌ను అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ప్రయోగశాలకు పంపిస్తామని, ఇందుకు కేంద్ర హోం శాఖ అన్ని అనుమతులు ఇచ్చిందని ఇటీవల ఓ పోలీసు అధికారి తెలియజేసిన సంగతి తెలిసిందే.

సత్వర న్యాయంతోనే కోర్టులపై నమ్మకం

తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ దినోత్సవంలో జస్టిస్ ఎన్.వి.రమణ



చార్మినార్, న్యూస్‌టుడే: సత్వర న్యాయం అందించడానికి న్యాయమూర్తులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ సూచించారు. న్యాయాన్ని ప్రజలకు చేరువ చేయడంతో వారికి న్యాయస్థానంపై నమ్మకం కలుగుతుందన్నారు. హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి తనవంతు సాయం అందిస్తానని మాటిచ్చారు. బుధవారం సాయంత్రం తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉన్నప్పుడు ప్రజలు కొట్లాటలకు దూరంగా ఉంటారని, ఈ దిశగా సత్వర న్యాయం అందించడంలో ముందుండాలని జస్టిస్ రమణ సూచించారు. అంతకుముందు ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర ఎస్.చౌహాన్‌తో కలిసి కేకును కోశారు. అనంతరం హైకోర్టులోని న్యాయమూర్తులను సన్మానించారు. తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి, తెలంగాణ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.సూర్యకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరళాసాగర్ ఘటన దురదృష్టకరం

మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఈనాడు డిజిటల్: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టుకు భారీ గండి పడి కట్ట తెగిపోవడం దురదృష్టకరమని, అనుకోని అవాంతరం వచ్చి రైతులకు కలిగిన ఇబ్బందిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితిని అనుకూలంగా మలుచుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టుకు గండి పడటం మంచిదేనని ఎవరూ అనుకోరని, కట్ట తెగిపోయి ప్రాజెక్టు ఖాళీ అయిన నేపథ్యంలో అందులోని ఇసుకను ప్రభుత్వ అవసరాలకు వాడుకోవచ్చని మాత్రమే అన్నట్లు తెలిపారు.

పత్తి రక్షణ విత్తనాల తయారీ గడువు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: బీటీ పత్తి పంటకు పచ్చపురుగు ఆశించకుండా అదే చేనులో 20 శాతం విస్తీర్ణంలో వేయాల్సిన రక్షణ(రెఫ్యూజీ) విత్తనాల తయారీ గడువును మరో 6 నెలలు పొడిగిస్తూ కేంద్ర వ్యవసాయశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఇచ్చిన గడువు డిసెంబరు నెలాఖరుతో ముగియడంతో తాజాగా గడువును పొడిగించారు. బీటీ పత్తి విత్తనాల ప్యాకెట్‌లో 450 గ్రాముల విత్తనాలుంటాయి. ఇందులో 20 శాతం అదనంగా బీటీ లేని అవే రకం సంకరజాతి సాధారణ పత్తి విత్తనాలు ఉండాలని, వాటి తయారీ ప్రతీ విత్తన కంపెనీకి తప్పనిసరి అని కేంద్రం తెలిపింది.

ముగిసిన పుస్తక ప్రదర్శన

- వందకు పైగా పుస్తకాల ఆవిష్కరణ
- 10 రోజుల్లో 10 లక్షల మంది సందర్శన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా జరిగిన 33వ జాతీయ పుస్తక ప్రదర్శన బుధవారంతో ముగిసింది. 330 స్టాళ్లలో లక్షలాది పుస్తకాలు ఒకేచోట కొలువుదీరడంతో పదిరోజుల్లోనూ దాదాపు 10 లక్షలమంది పాల్గొన్నారు. దాదాపు 35 లక్షలకు పైగా పుస్తకాల విక్రయాలు జరిగినట్లు అంచనా. స్థానిక సంస్థలతోపాటు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ప్రచురణ సంస్థలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. సేజ్, పెంగ్విన్ వంటి ప్రముఖ ఆంగ్ల ప్రచురణ సంస్థలు కూడా ఉండడంతో ఆంగ్ల సాహితీ ప్రియులు సైతం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. గతేడాదితో పోలిస్తే ఈసారి యువత పెద్దయెత్తున సందర్శించింది. యువ రచయితలకు ప్రాధాన్యమిస్తూ ఏర్పాటు చేసిన 'అన్వీక్షికి' ప్రచురణల స్టాల్ యువ పాఠకులను ఆకట్టుకుంది. పిల్లలకు పుస్తక పఠనాన్ని అలవాటు చేసే క్రమంలో నిర్వహించిన బాలమేళా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని అక్షర తెలంగాణగా మార్చేందుకు కృషి చేస్తామని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ పుస్తక ప్రదర్శన ముగింపు వేడుకలో ప్రకటించారు. కవి, గాయకుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ మనిషిలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించేవి పుస్తకాలేనని అన్నారు.

ధర్మం ఓడితే గెలిచేవాడిని కాను

- మొన్నటి ఎన్నికల్లో నాకు చేసినట్లుగా.. తూట్లు పొడిస్తే కష్టం
- ఈ పదవి నాకు తల్లిదండ్రులు ఇచ్చింది కాదు.. ప్రజలు పెట్టిన భిక్ష
- డబ్బు, మద్యం సీసాలకు ఓట్లు పడవు.. చేసిన పనులకే పడతాయి
- మంత్రి ఈటల రాజేందర్
- గులాబీ కండువా లేకుంటే మనం లేమని వ్యాఖ్య

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గులాబీ కండువా లేకుంటే మనం లేమని.. ఈ పదవీ తనకు తల్లిదండ్రులు ఇచ్చింది కాదని, ప్రజలు పెట్టిన ఓట్ల భిక్ష అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఓట్లనేవి కష్టానికి, ప్రేమకు, చేసిన పనులకు పడతాయని.. డబ్బు, మద్యం సీసాలకు పడతాయంటే చాలా తప్పన్నారు. ఎప్పుడు కూడా అమ్ముడుపోనిది ఆత్మగౌరవమని పేర్కొన్నారు. ధర్మం ఓడిపోయేదుంటే మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో తాను గెలిచేవాడ్ని కాదని చెప్పారు.



హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్‌లో బుధవారం హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలోని తెరాస ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఈటల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. "మనకు మనమే కుట్రలు చేసుకుంటే, పుల్లలు పెట్టుకుంటే, మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో నాకు చేసినట్లుగా తూట్లు పొడిస్తే కష్టమవుతుంది. ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలువడం తేలిక.. కౌన్సిలర్‌గా గెలవడమే చాలా కష్టం. హుజూరాబాద్, జమ్మికుంట ప్రజలను ఓట్లడిగే హక్కుదారుడ్ని నేనే. రెండు పట్టణాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చా. అందులో ఒక్క రూపాయి కూడా ఆశించలేదు. కలిసిమెలిసి పని చేసి గులాబీ జెండాను ఎగురవేయాలి. పుర ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఛైర్మన్ పదవుల కోసం క్యాంపు రాజకీయాలు ఉండవు. రెండు మున్సిపాలిటీల్లో కమిటీలు వేస్తాం. రిజర్వేషన్ల ప్రక్రియ, ఛైర్మన్ ఎంపికలో నా ప్రమేయం ఉండదు. పైసలుంటే పార్టీ టికెట్లు రావు. . ప్రజల ప్రేమ ఉంటేనే వస్తాయి. టికెట్లు ఇచ్చే వ్యవహారంలో కొంత కఠినంగా వ్యవహరిస్తాం. జిల్లా బాధ్యులతో సమీక్షించాకే ఇస్తాం. నాకు తెలుసు.. కొంతమందికి సమయం గడిచిన తర్వాత జలసీ ఉంటుంది.. అది మంచి పద్ధతి కాదు. ధర్మం, న్యాయం, సత్యం ఇవేవీ బయటకు కనబడకపోవచ్చు. . కానీ, వాటిదే విజయం తప్ప అధర్మానిది కాదు. పార్టీ టికెట్ ఇచ్చి మనస్ఫూర్తిగా పని చేసి గెలిపించిన తర్వాత మీరు అక్కరలేదు, నేనే గెలిచాననే భావన ఉన్నవాళ్లు అక్కడక్కడా కనిపిస్తారు. అప్పుడు మనసు గాయపడుతుంది'' అని ఈటల పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ కరీంనగర్ జిల్లా బాధ్యుడు బస్వరాజు సారయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కనుమల్ల విజయ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలకు వీసీలేరీ?

- ఇప్పటికే 5 నెలలుగా ఇన్‌ఛార్జులుగా ఐఏఎస్‌లు
- పాలన గాలికి.. కుంటుపడుతున్న విద్య

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని 11 విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ఉపకులపతి ఉన్న ఒకే ఒక్కటి జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ). ఈనెల 17 తేదీతో అదీ ఖాళీ కానుంది. అంటే రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఇన్‌ఛార్జి ఉపకులపతులే దిక్కు. వారు ఐఏఎస్‌లు కావడం, కీలక శాఖలకు అధిపతులుగా ఉండటంతో విశ్వవిద్యాలయాలపై దృష్టి సారించలేకపోతున్నారు. శాశ్వత వీసీలు లేకపోవడం వల్ల వర్సిటీల్లో పాలన కుంటుపడుతోంది. రాష్ట్రంలోని 8 విశ్వవిద్యాలయాలకు 2016 జూన్, జులైలో ప్రభుత్వం శాశ్వత ఉపకులపతులను నియమించింది. వారి పదవీకాలం మూడేళ్లు పూర్తికావడంతో 2019 జూన్, జులైలో ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. ఒక్కొక్క అధికారికి రెండు వర్సిటీల బాధ్యతలు అప్పగించింది. ఇక ఆర్‌జేయూకేటీకి తెలంగాణ ఆవిర్భావం నుంచి శాశ్వత ఉపకులపతి లేరు. దానికి కులపతిగా గవర్నర్ కాకుండా విద్యావేత్త ఉంటారు. దానికి కూడా గవర్నర్ ఉండేలా మార్చాలన్నది ప్రభుత్వ ఆలోచన. అయిదున్నరేళ్లు దాటినా అదీ కార్యరూపం రాలేదు. దీనికి అసెంబ్లీ ఆమోదం అవసరం. ఫలితంగా ఐఏఎస్ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ వస్తున్నారు. ఇప్పుడు విద్యా సంబంధిత వ్యవహారాల పర్యవేక్షణకు కనీసం సంచాలకుడు కూడా లేరంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇక కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీకి 2015 ఆగస్టు నుంచి.. అంటే నాలుగున్నర సంవత్సరాల నుంచి ఐఏఎస్‌లే ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు.

అడుగడుగునా జాప్యం

- జూన్, జులైలో వీసీల పదవీకాలం ముగుస్తుందని తెలిసినా జులై 9న ప్రభుత్వం భర్తీకి ప్రకటన జారీ చేసింది. 984 దరఖాస్తులు అందాయి. ఈనెల 17కు జేఎన్ఏఎఫ్ఏయూ వీసీ పదవీకాలం ముగియనున్నా ఇప్పటివరకు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదు.
- ఉపకులపతుల ఎంపికకు వర్సిటీ, ప్రభుత్వ, యూజీసీ నామినీలతో అన్వేషణ కమిటీలను నియమించాల్సి ఉండగా ఉపకులపతుల పదవీకాలం ముగిసిన రెండు నెలలకు.. అంటే సెప్టెంబరు 23న కమిటీలను నియమిస్తూ జీఓ జారీ చేసింది.

ఏ వర్సిటీకి ఎప్పటి నుంచి శాశ్వత ఉపకులపతులు లేరు?

విశ్వవిద్యాలయాలు...	పదవులు ఖాళీగా ఉన్నది
ఆర్‌జీయూకేటీ	రాష్ట్ర ఆవిర్భావం నుంచి
శాతవాహన.....	2015 ఆగస్టు 12
మహాత్మాగాంధీ వర్సిటీ	2019 జూన్ 29 నుంచి
మిగిలిన వర్సిటీలకు	2019 జులై 24 నుంచి

- ఆ కమిటీలు ఏర్పాటై మూడు నెలలు దాటినా ఉపకులపతుల ఎంపికకు సమావేశం నిర్వహించలేదు.
- మరోవైపు పూర్తిస్థాయి వర్సిటీలకు పూర్తిస్థాయి పాలక మండళ్ల (ఈసీ)లు నియామకం జరపలేదు. ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు ఈసీల నియామకం జరగలేదు.

ఎన్నో సమస్యలు....

- శాశ్వత ఉపకులపతులను నియమిస్తేనే ఆచార్యుల ఖాళీల భర్తీ జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 60 శాతానికిపైగా బోధనా సిబ్బంది ఖాళీలున్నాయి.
- రూసా కింద నిధులను ఈ మార్చిలోపు ఖర్చు చేయాల్సి ఉంది. శాశ్వత వీసీలు లేకపోవడంతో కీలక నిర్ణయాలు తీసుకోవడం కుదరడం లేదు. ఓయూలో రూసా కింద ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)కి ఇప్పుడు మేనేజింగ్ డైరెక్టర్ లేని పరిస్థితి.
- ఐఏఎస్ అధికారుల వద్దకు రిజిస్ట్రార్లు కేవలం అత్యవసర దస్త్రాలు మాత్రమే తీసుకెళ్లి సంతకాలు చేయిస్తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వాములను చేశారా?

- దీనిపై వివరణ ఇవ్వండి
- స్వైన్‌ఫ్లూ నివారణపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: స్వైన్‌ఫ్లూ నివారణలో ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వాములను చేశారో? లేదో? స్పష్టంగా వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శీతాకాలంలో స్వైన్‌ఫ్లూ విజృంభించకుండా చర్యలు తీసుకోవడంపై జిల్లా వైద్యాధికారులకు అవగాహన కల్పించాలని సూచించింది. స్వైన్‌ఫ్లూ నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ డా.కరుణ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంతోపాటు న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు పిటిషన్‌గా స్వీకరించి విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కౌంటరు దాఖలు చేస్తూ 15 లక్షల కరపత్రాలను, 2 లక్షల పోస్టర్లను పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాలనూ ఇందులో భాగస్వాములను చేసినట్లు తెలిపారు. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు కౌంటరు దాఖలు చేస్తూ రాష్ట్రంలో ల్యాబ్‌ల ఏర్పాటు నిమిత్తం రోగ నియంత్రణ జాతీయ కేంద్రం అనుమతి కోరామని, రావాల్సి ఉందన్నారు. గత ఆదేశాల మేరకు ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేకపోయామని వివరించారు. స్వైన్‌ఫ్లూ నియంత్రణకు వినియోగించే వ్యాక్సినేషన్ వికటిస్తుందన్న భయంతో ప్రజలు ఆసక్తి చూపడంలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ స్వైన్‌ఫ్లూ నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ తెలిపారు. స్వైన్‌ఫ్లూ విస్తరించకుండా చర్యలు తీసుకుంటామన్న విశ్వాసం ప్రభుత్వానికి ఉందన్నారు. స్వైన్‌ఫ్లూ నిర్ధారణకు నమూనాల సేకరణ, ధ్రువీకరణ తదితర అంశాలపై జిల్లా వైద్యాధికారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, పరీక్ష కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయకుంటే తీవ్రత ఎక్కువగా ఉంటుందని కోర్టు సహాయకుడైన సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. స్వైన్‌ఫ్లూ నివారణపై చేపట్టిన చర్యలపై సీఎస్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో సరైన ఆధారాలు కనిపించడంలేదని, వాటికి పత్రసహిత ఆధారాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. గత ఉత్తర్వుల్లో ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వాములను చేయాలని సూచించామని, దాని ప్రస్తావన లేదని పేర్కొంది. ఏ మేరకు వాటికి భాగస్వాములను చేశారో వివరణ ఇవ్వాలంటూ విచారణను ఈ నెల 9కు వాయిదా వేసింది.



యాదాద్రి కొండపై స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జనసందోహంగా యాదాద్రి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రం బుధవారం భక్తజన సందోహంగా మారింది. మొక్కు పూజల నిర్వహణతో మండపాలు, దైవదర్శనాలకి వేచిఉన్న భక్తులతో సముదాయాలు కిక్కిరిసిపోయాయి. బాలాలయంలో శ్రీస్వామి అమ్మవార్ల దర్శనానికి కొన్ని గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం నుంచి రాత్రి వరకు దైవదర్శనాలు కొనసాగాయి.

సీఎంకు ప్రసాదం అందజేత

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆంగ్ల సంవత్సరారంభం సందర్భంగా బుధవారం 'యాడా', ఆలయ నిర్వాహకులు దేవుడి ప్రసాదం, 2020 సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో యాడా వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈవో గీతారెడ్డి ముఖ్యమంత్రిని కలిసి వాటిని అందజేస్తూ క్షేత్ర సందర్శనను మరోసారి రావాలని ఆహ్వానించారు.

తెలంగాణ ప్రజలు సహృదయులు

- నెలకోసారి వినతిపత్రాల స్వీకరణ
- పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ
- గవర్నర్ తమిళిసై వెల్లడి
- రాజ్‌భవన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు మంచి మనసున్న వారని, పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రాష్ట్ర ప్రజలు కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రం నీటిపారుదల, వ్యవసాయం, విద్యారంగాల్లో అభివృద్ధిని సాధిస్తోందని వెల్లడించారు. బుధవారం రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గవర్నర్ విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్ర గవర్నర్‌గా వంద రోజుల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నాను. బతుకమ్మ, దివ్యాంగుల దినోత్సవాల నిర్వహణ, గిరిజనులతో మమేకం కావడం, రెడ్‌క్రాస్ సొసైటీ యాప్‌ను విడుదల చేయడం ఎంతో సంతృప్తినిచ్చాయి. నేను గవర్నర్‌గా చేరకముందు రెడ్‌క్రాస్ సొసైటీలో 30 వేల మంది మాత్రమే సభ్యులుండగా నేడు ఆ సంఖ్య 15 లక్షలకు చేరడం ఆనందంగా ఉంది. గిరిజన ప్రాంతాల పర్యటనకు వెళ్లినప్పుడు బోడగూడెం ప్రజలు సమస్యలను వివరించారు. వారిని శుక్రవారం ఇక్కడికి ఆహ్వానించాం. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. ఇప్పటికే రాజ్‌భవన్‌లో వినతిపత్రాలను స్వీకరిస్తున్నాం. పరిష్కారం కోసం ప్రభుత్వానికి పంపుతున్నాం. ఇక నుంచి నెలకోసారి వినతిపత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి రాజ్‌భవన్ వేదికగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం' అని గవర్నర్ తమిళిసై తెలిపారు.

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాఠోడ్, నిరంజన్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, తెలంగాణ అమర వీరుల కుటుంబాల సభ్యులు, దివ్యాంగులు, బ్రహ్మకుమారీలు, విద్యార్థులు, అధికారులు గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమిళిసై దంపతులకు యాదాద్రి ఆలయానికి చెందిన వేద పండితులు, పూజారులు బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీర్వచనాలను అందజేశారు.



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులకు ప్రసాదం అందజేస్తున్న యాదాద్రి వేదపండితులు

రాజధాని కోసం జైలుకైనా వెళ్తా

- భవనాలు కూలగొట్టి భూములు వెనక్కిస్తారా? ● పాలన చేతగాక అమరావతిని చంపేస్తున్నారు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై తెదేపా అధినేత చంద్రబాబునాయుడి ధ్వజం ● అన్నదాతల నిరసనలకు సంఘీభావం

ఈనాడు డిజిటల్ - అమరావతి

ఏపీ రాజధానిని తరలించే శక్తి ఈ భూమిపై ఎవ్వరికీ లేదని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. జగన్ తన చేతగాని పాలనతో అమరావతిని చంపేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరి, తెదేపా నాయకులతో కలసి బుధవారం రాజధాని గ్రామాల్లో పర్యటించారు. ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడం గ్రామాల్లో ప్రజలు చేస్తున్న దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి, మంత్రుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "రాజధానికి రైతులిచ్చిన భూముల్ని తిరిగి ఇచ్చేస్తామని కొందరు మంత్రులంటున్నారు. ఎలా ఇస్తారు? వాటిలో నిర్మించిన సచివాలయం, హైకోర్టు, రోడ్లు, భవనాల్ని ఏం చేస్తారు? వాటిని పడగొట్టి, భూముల్ని తిరిగిస్తారా? గన్నవరం విమానాశ్రయానికి 650 ఎకరాలు సమీకరించాం. వాటిలో నిర్మించిన రన్‌వేని తొలగించి భూములు వెనక్కిస్తారా? కొంచెమైనా బుద్ధుండే మాట్లాడుతున్నారా?'' అని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు వద్దనుకుంటున్న దక్షిణాఫ్రికా దేశాన్ని జగన్ ఆదర్శంగా తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే...



మందడంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడికి చేతులెత్తి మద్దతు తెలుపుతున్న రాజధాని రైతులు

రైతుల్ని దొంగలంటారా?

రాజధాని రైతులపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆధారాలు చూపమని నిలదీస్తే దొంగతనం కేసుగా మార్చారు. రైతులు రూ.200 దొంగతనం చేశారని కేసు పెట్టారు. రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆస్తి ఇచ్చిన రైతుల్ని దొంగలంటున్నారు. మరోసారి అర్ధరాత్రి సమయంలో పోలీసులు మీ జోలికొస్తే చెప్పండి. మీతో పాటు నేనూ జైలుకి వస్తాను. గూగుల్‌లో ఖైదీ నంబర్ 6093 అని శోధిస్తే ఏపీ సీఎం అని వస్తోంది. - చంద్రబాబు

ఎలుక వెంట్రుకనీ పట్టలేకపోయారు..

"రాజధానిలో భూముల క్రయవిక్రయాలపై ఆంక్షలు పెడితే విలువ పెరగదని, తమ బిడ్డల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాలకు భూములు అమ్ముకునేందుకు అనుమతివ్వాలని రైతులు కోరితే అంగీకరించాం. దాన్ని వైకాపా నాయకులు ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటున్నారు. రాజధానిని ప్రకటించాక భూములు కొంటే ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఎలా అవుతుంది? తెదేపా నేతలు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారనీ, వాటన్నిటినీ తవ్వాలని అధికారులపై ఈ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. కొండను తవ్వి... ఎలుకను కాదు కదా, దాని వెంట్రుక కూడా పట్టుకోలేకపోయారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సీబీఐతో దర్యాప్తు జరిపిస్తామని లీకులిస్తున్నారు. సీబీఐపై జగన్‌కు నమ్మకం లేదు కదా?

జగన్‌కు ఎందుకంత కడుపుమంట..

ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరిగితే జగన్‌కు ఎందుకంత కడుపుమంట? ఆయనలా అందరూ దొంగలే ఉంటారా? రాజధాని ఒకే సామాజికవర్గానికి చెందినదని దుష్ప్రచారం చేస్తున్నారు. నా సామాజికవర్గం బాగే చూసుకునే వాడినైతే హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేవాడినా? అమరావతి ముంపు ప్రాంతమని, పునాదుల నిర్మాణానికి ఎక్కువ ఖర్చవుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. 1953లో కృష్ణానదికి భారీ వరదలు వచ్చినప్పుడూ అమరావతి మునగలేదు. పునాదుల నిర్మాణానికి హైదరాబాద్, చెన్నై కంటే ఇక్కడే తక్కువ వ్యయమవుతుందని మద్రాస్ ఐఐటీ నిపుణులు తేల్చారు.

పాలన చేతకాదని అంగీకరించొచ్చు కదా!

అమరావతికి జగన్ దిష్టి తగిలింది. అసలు ద్రోహి ఆయనే. రాజధానికి రూ.లక్ష కోట్లు అవుతుందని, అంత డబ్బెక్కడిదని అంటున్నారు? రూ.లక్ష కోట్లు ఖర్చయ్యేది 2050 నాటికి. ప్రభుత్వం ఏదైనా పనిచేస్తే కదా ఆదాయం వచ్చేది. అన్నీ పంచుకుంటూ పోతే చివరకు మిగిలేదేం ఉండదు. జగన్‌కు పాలించడం చేతకాకపోతే ఆ విషయాన్ని అంగీకరించవచ్చు కదా? తెదేపా ప్రభుత్వం గ్రాఫిక్స్ చూపించిందని దుష్ప్రచారం చేస్తున్నారు. గ్రాఫిక్సే అయితే... జగన్ ఏడు నెలలుగా ఎక్కడి నుంచి పాలిస్తున్నారు? కారుణ్య మరణానికి అనుమతివ్వాలని రాజధాని ప్రజలు కోరుతున్నారంటే వారిలో ఎంత ఆవేదన ఉందో అర్థమవుతోంది. ఈ ముఖ్యమంత్రి ఎంత మందిని బలి తీసుకోవాలనుకుంటున్నారు?

వీళ్లా విశాఖను ఉద్ధరించేది

విశాఖలో విజయమ్మ పోటీ చేసినప్పుడు... పులివెందుల నుంచి అడ్డపంచెల వాళ్లు దిగడంతో తమ ప్రశాంతత దెబ్బతింటుందన్న భయంతో ప్రజలు ఆమెను ఓడించారు. మేం విశాఖకు అదానీ డేటా సెంటర్, లులూ గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థలను తెస్తే... వైకాపా అధికారంలోకి వచ్చాక వాళ్లందర్నీ తరిమేశారు. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయానికి అతీగతీ లేదు. అలాంటి వీళ్లు విశాఖను ఉద్ధరిస్తారా?

పోలీసుల ధాటికి రాజధాని ప్రజలు రోడ్డు మీదకు రావడానికే భయపడుతున్నారు. డీజీపీ ఓ మహానాయకుడు.. . నాపై ఒంటి కాలితో లేస్తున్నారు. చేయాల్సినవన్నీ చేసి పదవీ విరమణ తర్వాత ఇక్కడి నుంచి పారిపోవాలనుకుంటున్నారు. హైదరాబాద్‌లోని స్థిరాస్తి వ్యాపారులకు చెందిన టీవీ ఛానళ్ల ప్రతినిధులు... రాజధాని ప్రజల్ని మీరు పెయిడ్ ఆర్టిస్టులా? బిర్యానీ కోసం వచ్చారా? అని అడగడం తప్పుకాదా? అమరావతిని నాశనం చేస్తే అక్కడ వాళ్ల వ్యాపారం పెరుగుతుందనే అలా చేస్తున్నారు.

పవన్‌కు ముళ్లకంచెలు అడ్డు పెడతారా?

రాజధాని రైతులకు సంఘీభావం తెలపడానికి వెళుతున్న పవన్‌కల్యాణ్‌ను ముళ్లకంచెలు పెట్టి అడ్డుకుంటారా? సీఎం కాన్వాయ్ వస్తోందని రోడ్డుపై నిలబెడతారా? సీఎం ఆకాశం నుంచి ఊడిపడ్డారా? జగన్ పాదయాత్ర చేసినప్పుడు ముళ్లకంచెలు పెట్టి అడ్డుకున్నామా? అప్పుడు భద్రత కల్పించకపోతే రాష్ట్రమంతా తిరిగేవారేనా? జగన్ ఏదో తమాషా అనుకుంటున్నారు. అందరూ తిరుగుబాటు చేస్తే పులివెందుల పారిపోతారు. ఆయనెంత పిరికివాడో అందరికీ తెలుసు. పోలీసులు లేకుండా ఇంట్లో నుంచి బయటకు కూడా రారు.

ఎన్ని కమిటీలు వేస్తారు?

రాజధాని కోసం ఏడు నెలల్లో ఐదు కమిటీలు వేశారు. జీఎన్‌రావు కమిటీ పనికిమాలిన నివేదిక ఇచ్చింది. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు రోహిత్‌రెడ్డి స్నేహితుడి సంస్థ. దానిపై పోర్చుగల్‌లో ఎఫ్‌బీఐ విచారణ జరుగుతోంది. ఇప్పుడు హైపవర్ కమిటీ వేశారు. ఆ తర్వాత సూపర్ హైపవర్ కమిటీ అంటారు. దొంగలంతా కలసి రాజధానిని నిర్ణయిస్తారా?

మీరు అప్పుడే స్పందించి ఉంటే..!

ప్రజావేదిక కూల్చుతున్నప్పుడే మీరు ప్రతిఘటించి ఉంటే పరిస్థితి ఇక్కడ దాకా వచ్చేది కాదు. జగన్ ఇంతటి దుస్సాహసానికి దిగేవారు కాదు. కరెంటు తీగను పట్టుకోవద్దు అని చెప్పినా వినకుండా జగన్‌ను గెలిపించారు. తెలిసో, తెలియకో రాష్ట్ర ప్రజలు నెత్తిన అగ్నిగుండాన్ని పెట్టుకున్నారు. ఇప్పుడా కుంపటి తీయలేరు.. తీయకపోతే తల కాలిపోతుంది.

నా కుటుంబం కోసం కాదు

హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివనాడార్ నాపై అలిగారని తెలిసి... నేరుగా ఆయన ఉన్న హోటల్‌కు వెళ్లి కలిశాను. నేనే విమానాశ్రయంలో దించి వచ్చాను. మీకోసం ఏం చేయమంటారని ఆయన అడిగితే... హెచ్‌సీఎల్ కేంద్రం పెట్టమని కోరాను. 20 వేల మందికి ఉద్యోగాలిచ్చే కేంద్రం పెట్టారు. ఇదంతా తెదేపా కార్యకర్తల కోసమో, నా కుటుంబం కోసమో చేయలేదు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చేశా'' అని చంద్రబాబు పేర్కొన్నారు.



అమరావతి పరిరక్షణ సమితి రైతుల ఉద్యమానికి తన వంతు సహాయంగా నారా భువనేశ్వరి ఇచ్చిన చేతిగాజును చూపిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబునాయుడు

జీవితాలనైనా పణంగా పెడతాం.. అండగా నిలుస్తాం

- రైతులకు భువనేశ్వరి భరోసా
- గాజులు విరాళంగా ఇచ్చిన చంద్రబాబు సతీమణి

ఈనాడు డిజిటల్- అమరావతి, గుంటూరు: కొత్త సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న తెదేపా అధినేత చంద్రబాబు బుధవారం రోజంతా రాజధాని కోసం పోరాడుతున్న రైతుల మధ్య గడిపారు. సతీమణి భువనేశ్వరితో కలిసి ఆయన రాజధాని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు మద్దతు ప్రకటించారు. ఉదయం 10.40 నుంచి సాయంత్రం 5 గంటలు దాటేంత వరకు అమరావతి ప్రజలతో ఉన్నారు. ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడంలలో దీక్షల్లో పాల్గొన్నారు. నూతన సంవత్సర వేడులకు ఖర్చు చేయాలనుకున్న మొత్తాన్ని అమరావతి పరిరక్షణ సమితికి విరాళంగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు... ఆయన సతీమణి భువనేశ్వరి తన చేతికున్న బంగారు గాజులు తీసి విరాళంగా అందజేశారు. వాటిని వేలం ద్వారా విక్రయించాలని, ఆ సొమ్మును ఐకాసకు ఇవ్వాలని చంద్రబాబు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడారు. ఇంటి పట్టున ఉండే మహిళలు రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని అన్నారు. తోటి మహిళల ఆవేదన తాను అర్థం చేసుకోగలనని, తమ జీవితాలను పణంగా పెట్టయినా రాజధాని రైతులు, మహిళలకు అండగా నిలుస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడంలో భువనేశ్వరి మాట్లాడారు. "మహిళలు తలచుకుంటే రాజ్యాలు నిర్మించనూగలరు, కూల్చనూ గలరు. ఇప్పుడు మహిళలంతా కలిసి అమరావతిని నిర్మించుకుందాం. మీరంతా చంద్రబాబుపై నమ్మకంతో అమరావతి కోసం భూములిచ్చారు. అమరావతి గొప్ప నగరంగా నిలిచిపోవాలని ఆయన ప్రతి నిముషం కలగన్నారు. ఆరోగ్యం చెడిపోయినా పట్టించుకోకుండా రాష్ట్రం కోసం కష్టపడ్డారు. మీ నమ్మకాన్ని ఆయన ఎప్పటికీ వమ్ముకానివ్వరు. అమరావతి మంచి నగరంగా రూపుదిద్దుకుంటుంది" అని ఆమె పేర్కొన్నారు.

కన్నీటి పర్యంతమైన రామకృష్ణ

రాజధాని ప్రజలకు ఇలాంటి రోజు వస్తుందని కలలో కూడా అనుకోలేదని ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానులపై జగన్ ప్రకటన చేసిన నాటి నుంచి రైతులు పడుతున్న బాధ చూడలేకే ఇక్కడికి వచ్చానన్నారు.

అమరావతి... ఆంధ్రుల హక్కు

రాజధాని ప్రాంతంలో కొనసాగిన ఆందోళనలు

ఈనాడు-గుంటూరు, విజయవాడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రపంచమంతా వేడుకల్లో మునిగి తేలితే.. రాజధాని ప్రాంత రైతులు మాత్రం ఉద్యమబాటలోనే ముందుకు సాగారు. అమరావతినే ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా కొనసాగించాలన్న డిమాండుతో నిరసనలు హోరెత్తించారు. ప్రతి ఇంటి ముందు "సేవ్ అమరావతి... సేవ్ ఐదుకోట్ల ఆంధ్రుల కలల రాజధాని, రాజధాని రైతుల మహాధర్నా" అనే నినాదాలతో రంగువల్లులు వేసి వినూత్న రీతిలో తమ నిరసన గళం వినిపించారు. బుధవారమూ మందడం, తుళ్లూరులో మహాధర్నాలు, వెలగపూడిలో 15వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఉదయాన్నే మహిళలు, చిన్నారులు, రైతులు, రైతుకూలీలు రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మందడంలో మహిళలు షిర్డీసాయి చరిత పారాయణంతో దీక్ష ప్రారంభించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. 'సేవ్ అమరావతి... సేవ్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు" అని ప్లకార్డులు ప్రదర్శించి, 'అమరావతి... ఆంధ్రుల హక్కు' అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఏపీ నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ... "అమరావతి ప్రాశస్త్యం... జగన్ పాలన తీరు"పై పాడిన పద్యాలు ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు, చిలకలూరిపేట నుంచి వచ్చిన 30 మంది మహిళల బృందంతో పాటు పలు సంఘాల ప్రతినిధులు దీక్షలకు సంఘీభావం తెలిపారు. కర్నూలు జిల్లా రుద్రవరం మండలం ఆర్.నాగులవరం నుంచి శ్రీనివాసులు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు.

ముమ్మరంగా దీక్షలు

రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ తెదేపా చేపట్టిన ఆందోళన రాజధానేతర ప్రాంత జిల్లాలకు వేగంగా విస్తరిస్తోంది. ఈ నిరసనలకు పార్టీలు, కులమతాలకతీతంగా మద్దతు లభిస్తోంది. రాజధాని ప్రాంత రైతుల దీక్షలకు సంఘీభావం దక్కుతోంది. ఈ క్రమంలో తెదేపా నేతలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. అమరావతినే రాజధానిగా ఉంచాలంటూ నినదించారు. స్థానిక ప్రజలతో కలిసి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు నిరసన దీక్షలు చేపట్టారు. రాజధానిని తరలించొద్దంటూ ఉద్యమం చేస్తున్న రైతులు, రైతు కూలీలకు సంఘీభావంగా, తెదేపా అధినేత చంద్రబాబు పిలుపు మేరకు పలువురు నాయకులు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల విలీనం సాహసోపేతం

ఏపీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య

ఈనాడు, విజయవాడ: ఏపీ ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం సాధ్యం కాదంటూ గత ప్రభుత్వాలు తేల్చేశాయని.. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయంతో దానిని సాధ్యం చేసి చూపారని రవాణాశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించేలా చూస్తామని ఆయన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా కృతజ్ఞత సభను ఉద్యోగులు విజయవాడ డిపోలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నాని మాట్లాడుతూ.. 'ఆర్టీసీ ఉద్యోగుల విలీనం సాధ్యం కాదని.. ఆంధ్రాలో మూడు నెలల్లో ఏం జరుగుతుందో చూడమని పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. కానీ, జగన్ చేసి చూపించారని'' అని అన్నారు.

చెప్పినట్లు వినకపోతే చంపేస్తా...

- యువతిపై కత్తితో రౌడీషీటర్ వీరంగం
- కొత్త సంవత్సర వేడుకల్లో కలకలం
- తప్పించుకున్న బాధితురాలు
- అడ్డుకున్న అమ్మమ్మపై హత్యాయత్నం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: వెంటబడి, వేధిస్తున్న రౌడీషీటర్‌ను ప్రతిఘటించినందుకు ఆ విద్యార్థినిపై అతగాడు కక్ష పెంచుకున్నాడు. కొత్త సంవత్సర వేడుకల్లో ఉండగా ఆమెను అంతమొందించేందుకు ప్రయత్నించాడు. యువతి ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా అడ్డుకోబోయిన ఆమె అమ్మమ్మను కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. ఈ సంఘటన ఖమ్మం నగరంలో మంగళవారం రాత్రి జరగగా బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన ఓ వృద్ధురాలు, మనవరాలు కలిసి మంగళవారం రాత్రి ఇంటి ఎదుట కూర్చున్నారు. వీధిలో మహిళలు ముగ్గులు వేస్తున్న దృశ్యాలను చూస్తున్నారు. నూతన సంవత్సరం ఆరంభం కాగానే ఒక్కసారిగా అక్కడివారంతా ఆనందంతో శుభాకాంక్షలు తెలుపుకొంటున్నారు. అదే సమయంలో నగరంలోని రేవతి సెంటర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ అక్కడకు వచ్చాడు. వృద్ధురాలి ఇంటి ముందుకెళ్లి ఆమె మనవరాలిపై ఆకస్మాత్తుగా దాడిచేశాడు. అడ్డుకోబోయిన అమ్మమ్మ పొట్ట, ఛాతీ భాగంలో కత్తితో పొడిచాడు. భయాందోళనలతో బాధితులు ఇంట్లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకున్నారు. ఇంటి ముందు వీరంగం వేస్తున్న యువకుడిని వారించేందుకు వచ్చిన స్థానికులకు అతడు కత్తి చూపిస్తూ పారిపోయాడు. స్థానికులిచ్చిన సమాచారంతో రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. స్పృహతప్పి పడిపోయిన వృద్ధురాలిని పెద్దాసుపత్రికి తరలించారు. ఆమెకు కత్తిగాట్ల వద్ద 18 కుట్లు పడ్డాయని, అత్యవసర విభాగంలో చికిత్స చేస్తున్నామని వైద్యులు తెలిపారు.

వేధింపుల నేపథ్యమే..

మనవరాలు ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ(తృతీయ) చదువుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువతి రోజూ నడుచుకుంటూ కళాశాలకు వెళ్తుంది. ఈ సమయంలో ప్రేమ్‌కుమార్ వెంటపడుతూ వేధిస్తున్నాడు. నెల రోజులుగా విద్యార్థినిని అటకాయిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. తన జోలికి రావద్దని ఆమె హెచ్చరించినా చెప్పినట్లు వినకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. విషయాన్ని విద్యార్థిని ఇంట్లో తెలియజేయగా.. జాగ్రత్తలు చెప్పి ధైర్యం కల్పించారు. ఈ క్రమంలోనే విద్యార్థినిపై అతగాడు దాడికి యత్నించగా అమ్మమ్మ అడ్డుకుంది. మరోవంక.. నిందితుడు ప్రేమ్‌కుమార్ తానూ చెవి కోసుకుని ఆస్పత్రిలో చేరాడు. సంఘటనపై బాధిత కుటుంబీకులు బుధవారం రాత్రి రెండో పట్టణ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు.

జరిమానాల గోలేల.. బండి వదిలేస్తే పోలా!

- వాహనాలను విడిచి పోతున్న మందుబాబులు
- స్టేషన్లలో వేలాదిగా పేరుకుపోతున్న బండ్లు
- వేలం ద్వారా విక్రయానికి ఏర్పాట్లు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: హైదరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్ల వద్ద మందుబాబుల వాహనాలు గుట్టలా పేరుకుపోతున్నాయి. తప్ప తాగి వాహనాలు నడిపేవారికి పోలీసులు భారీ జరిమానా వేస్తున్నారు. కోర్టులో హాజరుపరిస్తే గరిష్ఠంగా పదిరోజుల వరకు జైలు శిక్షను పడుతోంది. దీంతో వేలాదిమంది మందుబాబులు జరిమానా చెల్లించకుండా వాహనాలను వదిలేసి వెళ్లిపోతున్నారు. దీనివల్ల హైదరాబాద్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లలో పోలీసుస్టేషన్ల దగ్గర వేలాది వాహనాలు పేరుకుపోతున్నాయి.



గోషామహల్ స్టేడియంలో వదిలేసిన వాహనాలు

60 శాతం ద్విచక్ర వాహనాలే

- హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో 50కి పైనే ట్రాఫిక్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి.
- హైదరాబాద్ కమిషనరేట్‌లో 2019 జనవరి నుంచి డిసెంబరు వరకు 28,209 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- మిగిలిన రెండు పోలీసు కమిషనరేట్లలో దాదాపు 30,000 వరకు కేసులు నమోదయ్యాయి.
- కేసు పెట్టిన వెంటనే పోలీసులు సంబంధిత వ్యక్తి వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు.
- ఇలా పట్టుబడినవాటిలో 60 శాతం వరకు ద్విచక్ర వాహనాలే ఉంటున్నాయి.
- డిసెంబరు 31 రాత్రి పట్టుబడేవాటితో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

బండి ధరకన్నా జరిమానా ఎక్కువ

తాగి వాహనం నడుపుతూ మొదటిసారి పట్టుబడితే రూ. 10,000.. రెండోసారి పట్టుబడితే రూ. 15,500 జరిమానా వేస్తున్నారు. ఇది వాహనదారులకు భారంగా మారింది. చాలా పాత వాహనాలు రూ. 15,000 కూడా ఖరీదు చేయవు. అదీకాకుండా జరిమానా కట్టాక పోలీసులు వాహనం ఇచ్చేస్తే ఫర్వాలేదు.. కానీ ఛార్జిషీటు దాఖలు చేసి కోర్టులో హాజరుపరుస్తారు. ఆధారాలను బట్టి కోర్టు ఒకరోజు నుంచి పదిరోజుల వరకు జైలు శిక్ష విధిస్తోంది. వీటన్నింటితో ఎందుకు ఇబ్బందిని కొని తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో చాలామంది ద్విచక్ర వాహనదారులు జరిమానా చెల్లించడం లేదు.. కోర్టుకు హాజరు కావడం లేదు. ట్రాఫిక్ పోలీసులు పట్టుబడిన వారిని వెంటనే కోర్టుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం లేదు. జరిమానా చెల్లించడానికి వచ్చిన వారినే హాజరుపరుస్తున్నారు.

దొరకని చిరునామాలు

నగరంలోని చాలామంది తమ వాహనాలను అమ్మేసినా రిజిస్ట్రేషన్‌లో పేరు మార్చుకోవడం లేదు. దీంతో కొంతమంది చిరునామాలను పట్టుకోవడం పోలీసులకు సమస్యగా మారింది. హైదరాబాద్ నగర పరిధిలో దాదాపు 7,000 వాహనాలు ఇలా పోలీసు స్టేషన్లలో పడి ఉన్నాయి. మిగిలిన రెండు కమిషనరేట్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి. జైలు శిక్షలకు భయపడి వాహనాలను తీసుకువెళ్లకుండా స్టేషన్లలోనే వదిలేసే వారి సంఖ్య పెరుగుతోందని ట్రాఫిక్ డీసీపీ ఎల్ఎస్ చౌహాన్ 'ఈనాడు'కు తెలిపారు. వీటి విషయంలో ఓ ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. అంబర్‌పేట మైదానం, గోషామహల్ స్టేడియం, పోలీసు స్టేషన్ల దగ్గర వేలాది వాహనాలు ఎండకు ఎండుతూ ఉంటున్నాయి. హైదరాబాద్ పోలీసులు వీటిలో 1200 ద్విచక్ర వాహనాలను వేలం వేయడానికి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారు.




ఒకే రోజు.. ఒకే చోట.. 41 మంది పుట్టిన రోజు వేడుక

ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 41 మంది విద్యార్థినులు ఒకే రోజు.. అది నూతన సంవత్సరం రోజు పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ పాఠశాలలో 883 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ రోజు ఎవరెవరి పుట్టినరోజు అని ఉదయం విద్యార్థినులు లెక్కించుకోగా మొత్తం 41 మందిగా తేలింది. వసతి గృహ సంక్షేమాధికారి రోజ నీలాకు విషయం తెలియగా ఆమె వారందరి చేత కేకు కోయించి పుట్టిన రోజు జరిపారు. విద్యార్థినులకు చిరు కానుకలు అందించారు.

- న్యూస్‌టుడే, నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్)

సవ్యసాచి




కుడి చేతితో రాసే వ్యక్తికి ఎడమ చేతితో రాయడం కష్టం.. ఎడమ చేతితో రాసే అలవాటున్న వ్యక్తికి కుడి చేతితో రాయడం కష్టం. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నగునూరి తిరుపతి-శ్రావణిల కుమారుడు విశ్వాంత్ రెండు చేతులతో రాస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఒకటో తరగతి చదువుతున్న విశ్వాంత్ మొదట ఎడమ చేతితో రాసేవాడు. పాఠశాల ఉపాధ్యాయులు కుడి చేతితో రాయడం అలవాటు చేసుకోవాలనడంతో.. విశ్వాంత్ రెండు చేతులతోనూ రాయడం సాధన చేశాడు. ఒకేసారి రెండు చేతులతో రాస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.

– న్యూస్‌టుడే, బుగ్గారం

మకరందం
7 కరీంనగర్, గురువారం జనవరి 2, 2020 ఈనాడు
మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

కొత్త సంవత్సరం వచ్చేసింది...
'ఏం చేస్తావో చూస్తాను' అని అశరీరవాణి ప్రతిధ్వనిస్తోంది.
'కాలాన్ని నీ చేతుల్లో పెడుతున్నాను... జాగ్రత్త' అని ఎవరో వాత్సల్యంతో తల నిమిరి చెబుతున్నట్లు అనిపిస్తోంది.
ఈ రెండు భావనలూ మన రెండు చేతులూ పట్టుకుని ముందడుగు వేయిస్తున్నాయి...
ఇది మన జీవితంలోకి వచ్చిన కొత్త సంవత్సరం కాదు... ఏడాది పాటు మన జీవితం.
దాన్ని సానుకూలంగా స్వాగతించాలి.



మంచో... చెడో...
నడకో... పరుగో...
స్పష్టమైన దర్శనంతో జీవితాన్ని గడపడం మొదలు పెట్టడానికి ఈ క్షణాలకు మించిన సమయం లేదు...

కాలమేవ జయతే!


'ఓ కొత్త ఆరంభం ప్రసరించే ప్రకంపనలు ఏడాదంతా చేతనంగా ఉండేలా చూసుకోవడమే విజయం'

ఇప్పుడేం చేయాలంటే...

- కష్టాలు, కన్నీళ్లు, బాధలు, వేదనలు... అన్నిటినీ మూటాముల్లే సర్దేసి, సరిహద్దు రేఖకు అవల వదిలేసి ముందడుగు వేయాలి.
- ప్రతిక్షణం, ప్రతి నిమిషం మనం అనుకున్నట్లుగా మలుచుకునే సాధనమవ్వాలి. మనం చేయాలనుకున్న పోరాటానికి ఆయుధమవ్వాలి.
- ఆగామి కాలం గొప్ప సంఘటనల సమాహారానికి వేదికవ్వాలి. మరిచిపోలేని వేడుకవ్వాలి.
- ఆగిపోయిన ఆలోచనల్ని ముందుకు సాగేలా చేయడానికి తరుణమిదే. కలల బూజు దులపాల్సిన సందర్భమిదే.
- బద్దకాన్ని నిర్దాక్షిణ్యంగా కొక్కేనికి తగలించాలి. గాయపడ్డ లక్ష్యాలకు మందురాసి ముందుకు తీసుకెళ్లాలి.
- నీరసపడిపోయిన నిర్ణయాలకు కొత్త ఉత్సాహానివ్వాలి. తీర్మానాల్ని తిరగరాయాలి.

ఒట్టి చేతులైనా గట్టి ఆయుధాలుగా మలుచుకుంటే ... సరైన సమయంలో, సరైన అవసరంలో ఓ చెయ్యి అందించడానికి కాలం సిద్ధంగా ఉంటుంది.

- గోపరాజు రాధాకృష్ణ



సమయం... శరణం... గచ్ఛామి

బుద్ధుడి దగ్గరకు వచ్చే సాధకులు ఆయనను అనేక సందేహాలు అడిగేవారు. అన్నిటికీ ఆయన సంతృప్తికరమైన సమాధానాలు చెబుతుండేవారు.
'భగవాన్! కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి?' అనే ప్రశ్నకు బుద్ధుడు ఇలా సమాధానమిచ్చాడు.

మనిషి కాల చక్రభ్రమణాన్ని గమనించాలి. ప్రపంచంలో కాలంతో సమానమైన సంపద లేదు. మిగిలినవన్నీ స్వప్నంతో సమానం. అవన్నీ జ్ఞానోదయం కాగానే భ్రమలుగా అర్థమవుతాయి. తన స్వార్థం కోసమే జీవించే మనిషిని కాలం పట్టించుకోదు. క్రిమికీటకాల్లా ఎలాంటి గుర్తింపు లేకుండా మరణం అనే అగ్నిలో స్వార్థపరుడు దహించుకుపోతాడు. అందుకే మనిషి ఏది సత్యమో అర్థం చేసుకోవాలి. గొప్ప పనులతో జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.

కాలానుగుణంగా వచ్చే అనేక మార్పులకు శరీరమే కాదు మనసు, బుద్ధి కూడా సిద్ధంగా ఉండాలి. ఒకప్పుడు శిరోధార్యమైంది... మరోకాలంలో వదిలేయాల్సిందవుతుంది. ప్రవాహంలాంటి ఈ మార్పులను తట్టుకుని నిలబడాలంటే ఆత్మస్థైర్యం ఉండాలి. ప్రపంచమనే నటనాలయంలో మనం పాత్రగా ప్రవర్తించాలి. అంతే తప్ప పాత్రగా మారిపోకూడదు.

- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ఇస్లాం సందేశం

సమయమిదే మిత్రమా!



ముహమ్మద్ (స) తన శిష్యులతో ఇలా చెప్పారు.

వృద్ధాప్యానికి పూర్వం యవ్వనం.
అనారోగ్యానికి పూర్వం ఆరోగ్యం.
లేమికి పూర్వం కలిమి.
పనుల్లో లీనమవ్వక పూర్వం తీరిక సమయం.
మరణానికి పూర్వం జీవితం.
మేలైనవిగా భావించండి.

ఓ వ్యక్తికి అంత్యకాలం సమీపిస్తుంది. అప్పటి వరకు అతను దైవ వాక్కుపై ఏమరుపాటుగా ఉన్నాడు. మరణానికి ముందు అతను ఇలా అనటం ప్రారంభించాడు,
"ఓ నా ప్రభూ! నేను వదలిపెట్టివచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి. ఇప్పటి నుంచి నేను మంచిపనులు చేస్తాను".
కానీ ఇది ఎంతమాత్రమూ జరిగేది కాదు.

ప్రళయదినాన 'నీ జీవితాన్ని, యవ్వనాన్ని ఎలా గడిపావు' అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వనంత వరకు మనిషి, దైవం ముందు నుంచి ఒక్క అడుగు కూడా కదపలేడు.

ఈ ప్రవచనాలన్నీ సమయం విలువను, కాలం గొప్పతనాన్ని తెలియజేసేవే. సెకన్లు, నిమిషాలు, గంటల సమయాన్ని దుర్వినియోగం చేసుకున్న వారు తీవ్ర నష్టానికి గురవుతారని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది. ఈ లోకంలో మనిషికి విలువైన సంపద పరుగెడుతున్న కాలమేనని స్పష్టం చేస్తున్నాయి. ఇస్లాం ఆరాధనలన్నీ సమయపాలనను నేర్పుతాయి. ఐదు పూటలా నమాజు వేళప్రకారం చేయాలి. మక్కా యాత్రను జిల్ హజ్ నెలలో చేస్తేనే హజ్ క్రతువు పూర్తవుతుంది. ఉపవాసాలు రమజాన్ నెలలో పాటిస్తేనే వాటి ఉద్దేశం నెరవేరుతుంది. ఇలా ప్రతీ ఆరాధనా సమయపాలనను, సమయ ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. 'నేను సమయం విలువను మంచు దిమ్మలు అమ్మేవాని ద్వారా అర్థం చేసుకున్నాను...' అని చెబుతారు ఇమామ్ రాజీ. మనిషికి దేవుడిచ్చిన వ్యవధి మంచు దిమ్మలా వేగంగా కరిగిపోతోందంటారాయన. ఇంతటి విలువైన సమయాన్ని వృథాగా గడపడమంటే కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే.



ప్రవక్త హజ్రత్ నూహ్ (అలై) మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఈ ప్రపంచాన్ని ఎలా అనుభవించారు? అని మృత్యుదూత అడిగారు.

'నేను ఇంటిలోని ఒక తలుపు నుంచి ప్రవేశించాను. మరో ద్వారం నుంచి వెళ్లిపోతున్నాను' అన్నట్లు గడిచింది ఈ జీవితం అని సమాధానమిచ్చారు.

ఈ చిరు జీవితాన్ని అర్థవంతంగా గడపాలంటారు ప్రవక్త మహనీయులు. 'ఏ వ్యక్తి రెండు రోజులు ఒకేలా గడుస్తాయో అతను వినాశనం పాలవుతాడు' అన్నారు హజ్రత్ అలీ. నిన్నటి కంటే ఈ రోజు మరింత మెరుగ్గా గడవాలన్నదే ఆయన ఉద్బోధ.


వివేకవంతుడైన వ్యక్తి తన సమయాన్ని నాలుగు భాగాలుగా విభజించుకోవాలంటారు ప్రవక్త ఇబ్రాహీం (అలై). ఒకభాగం దైవారాధన కోసం, ఆత్మపరిశీలన కోసం రెండో భాగం, సృష్టి నిర్మాణం పరిశీలన కోసం మూడో భాగం, తన కోసం, కుటుంబం కోసం నాలుగోభాగాన్ని ప్రత్యేకించుకోవాలన్నారు. ఇవే నా చివరి క్షణాలన్న స్పృహతో జీవితం గడపాలంటారు ఇమామ్ గజాలి. గడిచిపోయిన కాలాన్ని గురించి చింతిస్తూ కూర్చోకుండా రాబోయే భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా వర్తమాన కాలంలో సంతృప్తిగా, దైవాదేశాలకు కట్టుబడి జీవిస్తే జీవితం సాఫీగా సాగిపోతుందని అంటారాయన. జీవిత ఘడియలను మంచి పనుల్లో వెచ్చిస్తే చెడ్డ పనుల నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చని చెబుతారు ఇమామ్ షాఫయీ. సంతోష ఘడియల్లో ఎవరైతే దైవాన్ని స్మరిస్తారో వారిని కష్టకాలంలో అల్లాహ్ రక్షిస్తాడు.. అనే ప్రవక్త ఉద్బోధను గుర్తుంచుకుని జీవితాన్ని గడపాలి.

మీ గుండెమీద చెయ్యిపెట్టుకుని వినండి. మీ గుండె చేసే ఒక్కో చప్పుడు మీ జీవిత ఆయుష్షు తగ్గుతుందని హెచ్చరిస్తుంది. గడిచిపోయిన ప్రతీక్షణం మనల్ని మృత్యువుకు దగ్గరచేస్తుంది... అందుకే కాలాన్ని మంచి పనులతో సద్వినియోగం చేసుకోండి.

- ఖైరున్నీసాబేగం

క్రీస్తువాణి

అది వెలుగు బాట



'లౌకిక జీవితంలోనే కాదు... ఆధ్యాత్మిక జీవితంలో కూడా సమయపాలన, ప్రణాళిక అవసరం. అలా ఉన్నవారే పరమపద సోపానాన్ని చేరుకోగలరు.'
'రోజులు చంచలమైనవి. కాబట్టి సమయాన్ని పోనివ్వకుండా సద్వినియోగం చేసుకోండి.'
'జ్ఞాన మార్గంలో ప్రయాణం చేసేవారికి నైతికత, నిబద్ధత అనే దివిటీ మన చేతుల్లో ఎప్పుడూ వెలుగుతూ ఉండాలి.' .. ఇవీ సమయపాలనపై క్రీస్తు ఉపదేశాలు.


ఈనెల 6
వైకుంఠ ఏకాదశి

అది సకల కార్యాలకూ కారణ స్థానం... అది సర్వ దేవతలకూ పూజా స్థలం... సృష్టి, స్థితి, లయలకు అవసరమైన శక్తి, సంకల్పాలు ఉద్భవించేది అక్కడే... అందుకే ఏడాదికో రోజైనా ఆ దిక్కుకు తిరిగి నీవే దిక్కని మొక్కుతారందరూ.

కరుణాంతరంగుడి కారణ వైకుంఠం

మనం నివసిస్తున్న భూమి సౌరమండలంలో ఉంది. అలాంటి ఎన్నో మండలాలు కలిస్తే అది అండం. అంతులేనన్ని అండాల సమాహారమే బ్రహ్మాండం. అందుకే వాటన్నిటికీ పరిపాలకుడైన పరమాత్మను అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు అంటారు. ఆయన నివసించే వైకుంఠం రెండు భాగాలుగా ఉంటుందని చెబుతారు. వాటిపేర్లు కార్య వైకుంఠం, కారణ వైకుంఠం. పరమాత్మ నిర్వర్తించే సృష్టి, స్థితి, లయలను లీలలంటారు. వీటన్నిటికీ కేంద్ర స్థానం కార్య వైకుంఠం. ఇది విరజానదికి ఈవలి వైపు ఉంటుందని చెబుతారు. కార్య వైకుంఠం నుంచి సృష్టించిన లోకాలన్నిటినీ కలిపి లీలా విభూతి అని పిలుస్తారు. అసలీ కార్యాలన్నిటికీ కారణమైన స్థలం మరొకటుంది. దాన్ని కారణ వైకుంఠం లేదా పరమపదం అని పిలుస్తారు. ఇది విరజానది ఆవల ఉంటుందని చెబుతారు. ఈ పరమపదానికి ఆది లేదు అంతం లేదు. అందుకే దాన్ని నిత్యం అంటారు. దాన్నే నిత్య విభూతి అని కూడా పిలుస్తారు. మహర్షులు, దేవతలు, పుణ్య చరితులు కార్య వైకుంఠంలోకి ప్రవేశం పొందగలుగుతారు. కారణ వైకుంఠం మహా విష్ణువుకు ఆంతరంగిక ప్రదేశం అని చెబుతారు. అందులోకి ప్రవేశం లోకోత్తరమైన వ్యక్తులకే సాధ్యం. అలా ప్రవేశం పొందినవారు విష్ణువుతో ఐక్యం చెందారని అర్థం చేసుకోవాలి. అది అందరికీ లభించే అవకాశం కాదు. కార్య, కారణ వైకుంఠాలకు సంబంధించిన వివరాలు బ్రహ్మ వైవర్త, విష్ణు పురాణాల్లో కనిపిస్తాయి. బ్రహ్మ శరీరం నుంచి పుట్టిన మధుకైటభులనే రాక్షసులు తమ తెలివితేటలతో కారణ వైకుంఠ ప్రవేశాన్ని పొందారు. దీనికో కథ చెబుతారు.

సృష్టి ఆరంభంలో భగవానుడు లోకకల్యాణం కోసం వేదాలను సృజించాడు. వాటిని మధుకైటభులు అపహరించి పారిపోసాగారు. వారిని అడ్డుకోడానికి ప్రయత్నించిన విష్ణువుతో యుద్ధం చేశారు వారిద్దరూ. వారి నుంచి వేదాలను రక్షించిన విష్ణువుకు వారిపై అనురాగం కలిగింది. మీకు ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. ఆ మాటకు వారు తమకు కారణ వైకుంఠ ప్రాప్తి కలిగించమని కోరారట. సంకట స్థితిలో పడ్డ విష్ణువు ఆలోచించి ఎప్పుడూ, ఎవరూ ప్రవేశించని ఉత్తర ద్వారం ద్వారా వారిని వైకుంఠంలోకి పంపాడని చెబుతారు. అప్పుడు వారు 'అల్పులమైన మాకే ఇంతటి వరం ప్రసాదించావు. మరి నీ భక్తిలో తేలియాడే భక్తులకు ఇలాంటి అవకాశం కలిగించవా ప్రభూ' అని ప్రార్థించారు. దానికి శ్రీ మహా విష్ణువు 'మిమ్మల్ని ఇక్కడకు చేర్చిన ఈ రోజున తన భక్తులు ఉత్తర ద్వారం నుంచి తనను దర్శించుకుంటే వారికి మోక్ష ప్రాప్తి కలుగుతుందని' వరం ఇచ్చాడని చెబుతారు. మకర సంక్రాంతికి నెల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. అది దేవతలకు బ్రాహ్మీ ముహూర్త కాలం అని చెబుతారు. ఆ సమయంలో ముక్కోటి దేవతలు విష్ణువును దర్శించుకుంటారని, ఆ సమయంలో వచ్చే ఏకాదశి కాబట్టి 'ముక్కోటి ఏకాదశి' అని, ఆ రోజు విష్ణువును పూజిస్తే వైకుంఠప్రాప్తి కలుగుతుంది కాబట్టి ' వైకుంఠ ఏకాదశి' అనీ పేర్లు వచ్చాయని పౌరాణికులు అంటారు.





తిరుమలలో 'ఉత్తరం' కాదు...

వైకుంఠద్వార దర్శనం అన్ని దేవాలయాల్లో ఉత్తర దిక్కునుంచి జరుగుతుంది. కానీ కలియుగ వైకుంఠమైన తిరుమలలో మాత్రం మనకు ఉత్తర ద్వారం కనిపించదు. తిరుమల ఆలయానికి ప్రధాన ద్వారం తూర్పు అభిముఖంగా ఉంటుంది. ప్రధాన ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధులతో కూడింది మహాప్రదక్షిణ మార్గం. ఆలయంలోకి ప్రవేశించాక వెండి వాకిలి ముందువైపు ఆలయం చుట్టూ ఉంది సంపంగి ప్రదక్షిణ మార్గం. వెండి వాకిలి లోపల ఆలయం చుట్టూ ఉన్నదాన్ని విమాన ప్రదక్షిణ మార్గం అంటారు. కాగా ప్రధాన ఆలయానికి ఆనుకుని ఉన్న చిన్న మార్గమే వైకుంఠ ప్రదక్షిణ మార్గం. ఇది ఏడాదిలో రెండు రోజులు మినహా అన్ని రోజుల్లో మూసి ఉంటుంది. స్వామివారిని దర్శించుకుని ప్రధాన ఆలయం నుంచి వెలుపలకు రాగానే కుడి చేతి వైపు ఇది కనిపిస్తుంది.

- కాలగణన సూర్యచంద్రుల గమనాన్ని బట్టి చేస్తారు. భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు అనుసరించేది చాంద్రమానం. అందువల్లనే తెలుగువారి పండగలన్నీ చాంద్రమాన గణన ప్రకారమే జరుగుతాయి. సౌరమానం ప్రకారం వచ్చే పండగలు అతి తక్కువ ఉంటాయి. వాటిలో వైకుంఠ ఏకాదశి ఒకటి. దీన్నే ముక్కోటి ఏకాదశి, స్వర్గద్వారైకాదశి అని కూడా పిలుస్తారు.
- నిరంతర విష్ణు చింతనాపరుడు, సేవా తత్పరుడు అయిన నమ్మాళ్వార్‌కు కూడా శ్రీమహావిష్ణువు ముక్కోటి ఏకాదశి నాడు కారణ వైకుంఠ ప్రాప్తి కలిగించాడని పురాణ కథనం. అందువల్ల వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశికి ముందు పది రోజులు, తర్వాత పది రోజులు ఆళ్వారుల స్తోత్రాలతో స్వామిని పూజిస్తారు. ఇలా చేసే ఉత్సవాల్లో పగటి పూట ఉత్సవాలను పగల్ పత్తు. అని, రాత్రి పూట చేసే ఉత్సవాలని రాపత్తు అని పిలుస్తారు.
- మనకు ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు ఉంటాయి. మనస్సును పదకొండవ ఇంద్రియంగా భావిస్తారు. వికుంఠం అంటే లోపాలు లేకుండా సక్రమ స్థితిలో ఉండడం. మనిషికి ఉన్న పదకొండు ఇంద్రియాలు మంచి మార్గంలో ప్రయాణించడమే వైకుంఠ ఏకాదశి పర్వదినం ఇచ్చే సందేశం.
- ముక్కోటి ఏకాదశి నాడు.. వేకువజామునే నిద్రలేచి అవకాశం ఉన్నవారు నదీ స్నానం చేయాలి. వైష్ణవాలయానికి వెళ్లి ఉత్తర ద్వారం నుంచి శ్రీహరిని దర్శించుకోవాలి. ఆరోగ్యవంతులు ఆనాడు ఉపవాసం ఉండి, వీలైనంత ఎక్కువ సమయం విష్ణు చింతనలో కాలం గడపాలి. విష్ణుకథలు వినటం, హరినామ సంకీర్తనం చేయాలి. మర్నాడు ఉదయం మళ్లీ విష్ణువును పూజించి విష్ణుభక్తుడైన సత్పురుషుణ్ని భోజన వస్త్ర తాంబూలాదులతో సత్కరించి, ద్వాదశి పారణం (భోజనం) చేస్తారు.

- రమా శ్రీనివాస్, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ఈనాడు సినిమా



'భీష్మ'



'ఎంత మంచివాడవురా'



'నిశ్శబ్దం'

ఇలా శ్రీకారం చుట్టారు!

జనవరి 1... ఆశలు.. ఆశయాలు.. డైరీలు.. క్యాలెండర్లూ అన్నీ కొత్తగానే ఉండాలి. తొలి రోజు జోష్‌గా సాగిపోయిందంటే ఏడాదంతా అదే ఉత్సాహం కనిపిస్తుందన్న ఓ ఆకాంక్ష.


అసలే ఇలాంటి సెంటిమెంట్లు చిత్రసీమలో ఎక్కువ. ఏ పండగొచ్చినా ముందు హడావుడి చేసేది సినిమా వాళ్లే. అందునా జనవరి 1 అంటే ఇక చెప్పేదేముంది? తమదైన స్టైల్‌లో తొలిరోజుకి శ్రీకారం చుట్టారు. కొత్త పోస్టర్లతో కళకళలాడించారు. విడుదలకు సిద్ధంగా ఉన్న ప్రతి సినిమా నుంచీ ఒక్కో కొత్త స్టిల్ బయటకు వచ్చింది. సంక్రాంతికి వస్తున్న చిత్రాలైతే ఈ విషయంలో కాస్త ముందే ఉన్నాయి. 'సరిలేరు నీకెవ్వరు' టీమ్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. సకుటుంబ సపరివార సమేత చిత్రాన్ని చూపిస్తున్నాం అనే హింటు ఈ పోస్టరు ద్వారా ఇచ్చింది చిత్రబృందం. కల్యాణ్‌రామ్ సినిమా 'ఎంత మంచివాడవురా' నుంచి మరో కొత్త పోస్టర్ వచ్చింది. కల్యాణ్‌రామ్, మెహరీన్ జంటగా నటించిన సినిమా ఇది. ఈనెల 15న విడుదలవుతోంది. కథానాయకుడు, నాయిక మధ్య కెమిస్ట్రీ ఎంత బాగా పండిందో చూపించడానికి ఓ మచ్చుతునక వదిలారనిపిస్తోంది. మరో వైపు చేతిలో గులాబీ పట్టుకుని అమాయకంగా చూస్తోంది స్వీటీ అనుష్క. 'నిశ్శబ్దం' సినిమాకి సంబంధించిన కొత్త పోస్టర్ అది. థ్రిల్లర్ నేపథ్యంలో సాగే చిత్రమిది. త్వరలో విడుదల కాబోతోంది.

రవితేజ అంటేనే మాస్. పైగా తన సినిమా పేరు 'క్రాక్'. అందుకే కిక్ ఎక్కించే 'క్రాక్' లుక్కుతో రెడీ అయిపోయారు మాస్ రాజా. జనవరి 1న తన కొత్త సినిమాకి సంబంధించిన లుక్‌ని విడుదల చేశారు. పోలీస్ అవతారంలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు రవితేజ. గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయికగా నటిస్తోంది.

యువ కథానాయకులు నితిన్, నాగశౌర్య కూడా కొత్త పోస్టర్లతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. 'భీష్మ' నుంచి మరో రొమాంటిక్ పోస్టర్ బయటకు వచ్చింది. రష్మికకు గొడుగు పడుతున్న నితిన్ పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. వెంకీకుడుముల తెరకెక్కించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. ఇక 'అశ్వద్థామ' అవతారం ఎత్తిన నాగశౌర్య ఓ క్లాస్ లుక్‌తో ఆకట్టుకున్నాడు. ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రమిది. మెహరీన్ కథానాయికగా నటించింది. 'అశ్వద్థామ' కథ రాసింది నాగశౌర్యనే.



'అశ్వద్థామ'



'క్రాక్'

రవిబాబు 'క్రష్'

ఒక చిత్రంతో నవ్విస్తారు. మరో చిత్రంతో భయపెడతుంటారు. ఇంకోసారి థ్రిల్‌ని పంచుతుంటారు. ఇలా ఎప్పటికప్పుడు కొత్త రకమైన కథలతో సినిమాలు చేస్తూ వినోదం పంచుతున్న దర్శకనిర్మాత రవిబాబు. ఆయన తన ఫ్లయింగ్ ఫ్రాంగ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై 'క్రష్' అనే చిత్రం చేయబోతున్నారు. కొత్త యేడాది ఆరంభం సందర్భంగా బుధవారం ఆ సినిమా టైటిల్ లోగోని విడుదల చేశారు. "యువతరం ఆలోచనలకి అద్దం పట్టే కథ ఇది. జనవరి 24 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. వేసవిలో విడుదల చేస్తాం" అనిచిత్రవర్గాలు తెలిపాయి. ఇందులోని నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని త్వరలోనే ప్రకటించనున్నారు.



రవిబాబు

పంచ్ డైలాగ్

ప్రేమించాకా ఒకడు తాగితే లవ్ ఫెయిల్యూర్
అదే పెళ్లి అయ్యాకా ఒకడు తాగితే లైఫే ఫెయిల్యూర్

చిత్రం: రాజా రాణి
- పంపినవారు: బి. ఆంజనేయులు, మహబూబ్ నగర్

అవును... ఇప్పుడు ఆలియాభట్ మనసంతా కొత్త ఏడాదిపైనే ఉంది. ఆమె నుంచి ఈసారి నాలుగు భారీ చిత్రాలు రాబోతున్నాయి. తొలిసారి తన తండ్రి దర్శకత్వంలో నటిస్తున్న 'సడక్ 2' విడుదల కావడంతో పాటు భన్సాలీ సినిమాలో నటించాలనే తన చిన్ననాటి కల నెరవేరబోయేది ఈ ఏడాదిలోనే. ఆమె నటిస్తున్న 'ఆర్ ఆర్ ఆర్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాలు అలరించబోయేది ఈ సంవత్సరమే. తన జీవితంలో ఇన్ని ప్రత్యేకతలున్న 2020 కోసం కోటి ఆశలతో ఎదురుచూడటమే కాదు తన నటిస్తున్న చిత్రాల్లోని పాత్రలకు ప్రాణం పోసే పనిలో తలమునకలై ఉంది ఆలియా.

> ఓ నాయిక నుంచి ఏడాదికి రెండు సినిమాలు రావడమే ఎక్కువ. అలాంటిది ఈసారి నా నుంచి నాలుగు చిత్రాలు వస్తున్నాయి. అంటే ప్రేక్షకుల మనసుల్లో మరింత ఎక్కువ చోటు సంపాదించే అవకాశం దక్కనుంది. అంతేకాదు మా నాన్న దర్శకత్వంలో నేను నటిస్తున్న తొలి చిత్రం 'సడక్ 2' కూడా ఈ ఏడాదే విడుదల కానుంది. నాకు 'బ్రహ్మాస్త్ర' ప్రత్యేకంగా నిలవడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తొమ్మిదేళ్ల వయసులోనే భన్సాలీసార్ సినిమాలో నటించాలని నిర్ణయించుకున్నాను. అది 'గంగూబాయి కతియావాడి' రూపంలో తీరబోతుందీ ఈ ఏడాదే. దేశం గర్వించే దర్శకుడు రాజమౌళి సార్ 'ఆర్ ఆర్ ఆర్'లో నాకు అవకాశం దక్కింది. ఆ చిత్రమూ 2020లోనే వస్తోంది. బహుశా ఇన్ని ప్రత్యేకతలున్న సంవత్సరం నా జీవితంలో మళ్లీ రాదేమో
>
> – ఆలియా భట్

మనసంతా 2020 పైనే..



తండ్రి మహేష్‌భట్ నుంచి వచ్చిన సినీ వారసత్వాన్ని బాలీవుడ్ ఎంట్రీగా మాత్రమే వాడుకుంది ఆలియాభట్. కెరీర్ తొలినాళ్లలో బబ్లీ గర్ల్ ఇమేజ్‌తో యువతరాన్ని ఆకట్టుకున్న ఆలియా నెమ్మదిగా పంథా మార్చింది. 'ఉడ్తా పంజాబ్' చిత్రంతో తనలోని ఓ కొత్త నటిని తెరపై ఆవిష్కరించింది. ఆ తర్వాత 'రాజీ'తో మరో మెట్టు ఎక్కింది. నాయికగా దూసుకుపోతున్న ఆలియా గత ఏడాది విజయం, పరాజయం.. రెండింటిని రుచి చూసింది. 2019లో 'గల్లీబాయ్'తో ఔరా అనిపించింది. మురాద్ అనే ర్యాప్ గాయకుడి ప్రియురాలిగా రణ్‌వీర్ సింగ్ సరసన నటించింది. సహజమైన ఆమె నటన, సంభాషణలు పలికిన తీరు ప్రేక్షకుల్ని అలరించాయి. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆధునిక యువతి సఫీనాగా పాత్రకు జీవం పోసింది ఆలియా. గత ఏడాది భారీ వసూళ్లు అందుకున్న బాలీవుడ్ చిత్రాల్లో ఒకటిగా 'గల్లీబాయ్' నిలిచింది. కానీ ఆ తర్వాత ఆలియా నటించిన 'కళంక్' భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది. భారీ తారాగణంతో, బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో రూప్ చౌదరిగా నటించింది ఆలియా. అందరి అంచనాలను తారుమారు చేస్తూ భారీ ఫ్లాప్‌గా నిలిచిందీ చిత్రం. దీంతో నిరాశలో ఉన్న అభిమానులను ఖుషీ చేయడానికి ప్రత్యేక గీతంలో ఆడిపాడిందామె. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'లో 'ది హుక్ అప్ సాంగ్' పాటలో ఆలియా మెరిసింది.

ఆశల సంవత్సరం

గత ఏడాది మిశ్రమ ఫలితం ఇచ్చినా 2020పై భారీ ఆశలే పెట్టుకుంది ఆలియా. ఈ సంవత్సరం ఆమెకు చాలా ప్రత్యేకంగా నిలవనుంది కూడా. ఎందుకంటే ఆమె నటిస్తున్న భారీ చిత్రాలు 'ఆర్ ఆర్ ఆర్', 'బ్రహ్మాస్త్ర' ఈఏడాదే రానున్నాయి. వీటితో పాటు తొలిసారి తండ్రి దర్శకత్వంలో 'సడక్ 2'లో నటిస్తోంది. తండ్రితో చేస్తున్న తొలి సినిమా కాబట్టి ఆ సినిమా విడుదల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తోంది ఆలియా. జులై 10న ఈ చిత్రం విడుదల కానుంది. 'బాహుబలి' తర్వాత రాజమౌళి నుంచి వస్తోన్న 'ఆర్ ఆర్ ఆర్'లో రామ్ చరణ్ సరసన నటిస్తోందామె. ఈ సినిమా జులై 30న విడుదల కాబోతుంది. ఈ ఏడాది రాబోయే భారీ చిత్రాల్లో 'బ్రహ్మాస్త్ర' ఒకటి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, అమితాబ్ బచ్చన్ తదితరులు కీలక పాత్రధారులు. షారుఖ్‌ఖాన్, నాగార్జున అతిథి పాత్రల్లో మెరవనున్నారు. ఎప్పటికైనా సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో నటించాలి అనేది ఆలియా చిన్ననాటి కల. అది ఈ ఏడాది తీరనుంది. భన్సాలీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న చిత్రం 'గంగూబాయి కతియావాడి'. ముంబయి మాఫియా క్వీన్ గంగూబాయి జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. సెప్టెంబరులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అంటే ఈ ఏడాది ఆలియా సినీ జీవితంలో అత్యంత కీలకమైందన్నమాట. 2020లోనే ఆలియా వివాహం జరగబోతుందట. ఈఏడాది రణ్‌బీర్ కపూర్‌తో ఆలియా వివాహం జరగనుందంటూ బాలీవుడ్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.

తరవాత ఏం జరుగుతుంది?

అధర్వ మురళి, మేఘా ఆకాష్ జంటగా నటించిన అనువాద చిత్రం 'బూమరాంగ్'. ఆర్.కణ్ణన్ దర్శకుడు. సీహెచ్ సతీష్ కుమార్ నిర్మాత. శుక్రవారం విడుదల అవుతోంది. బుధవారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అధర్వ నాకిష్టమైన కథానాయకుడు. 'గద్దలకొండ గణేష్'లో చక్కటి నటన ప్రదర్శించాడు. యువతరం తలచుకుంటే సమాజంలో ఎలాంటి మార్పు తీసుకుని రావచ్చన్న అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. ప్రచార చిత్రాలు బాగున్నాయ"న్నారు. "ప్రతి క్షణం ఉత్కంఠతను రేకెత్తించే చిత్రమిది. తరవాత ఏం జరుగుతుందన్న ఆసక్తి చివరి వరకూ కొనసాగుతూనే ఉంటుంద"న్నారు నిర్మాత. సంగీతం: రథన్



అధర్వ మురళి, మేఘా ఆకాష్



అర్చన

అనుబంధాలు.. ఆప్యాయతలు

అన్నపూర్ణమ్మ, మాస్టర్ రవితేజ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. అర్చన, బాలాదిత్య జంటగా నటించారు. నర్రా శివనాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. ఎమ్.ఎన్.ఆర్.చౌదరి నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల 30న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. "అమరావతి సమీపంలోని వైకుంఠపురం అనే అందమైన గ్రామంలో తెరకెక్కించిన చిత్రమిది. కుటుంబ అనుబంధాలు, ఆప్యాయతలకి... హాస్యం, యువతరాన్ని అలరించే ప్రేమాయణాన్ని మేళవించిన కథ. ఇందులో జమున కీలక పాత్రలో కనిపిస్తారు. స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రంగా ప్రేక్షకుల మెప్పు పొందుతుంది" అన్నారు దర్శకనిర్మాతలు. బెనర్జీ, రఘుబాబు, కారుమంచి రఘు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రాజ్‌కిరణ్.

గీతోపదేశం

కోటలు మేడలు కట్టాలన్నా
కాటికి నలుగురు మోయాలన్నా
గుప్పెడు మెతుకులు పుట్టాలన్నా
ప్రాణం తీయాలన్నా ఒకటే రూపాయ్

గీతం: ఇది చేతులు మారి రాతలు మార్చే కాగితమోయ్, **చిత్రం** : వేదం,
రచయిత: ఎమ్.ఎమ్.కీరవాణి, - **పంపినవారు:** అరె.సతీష్ వర్మ, ఖమ్మం

'అలిషా' ఎవరు?



ఐశ్వర్య సాల్వి

ఆర్పీ పట్నాయక్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'అలిషా'. ఐశ్వర్య సాల్వి, వేదాంత్ సలూజా, రిచా కల్రా, అక్షయ్ బక్షి కీలక పాత్రధారులు. సోనాల్ నిర్మాత. కొత్త ఏడాది ఆరంభం సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. పూర్తి సినిమాని విదేశాల్లోనే తెరకెక్కిస్తారు. "డాల్బీ ఆట్మాస్ సౌండ్‌ని దృష్టిలో పెట్టుకుని తెరకెక్కిస్తున్న చిత్రమిది. స్టార్ కథానాయకులు నటించిన చాలా సినిమాలు డాల్బీ ఎట్మాస్ సౌండ్‌తోనే విడుదలైనా... ఆ సాంకేతికత కోసమే తయారు చేసిన కథలు ఇప్పటిదాకా మన దేశంలో రాలేదు. అలిషా ఎవరు? ఆమె కథేమిటన్నది తెరపైనే చూడాల"ని తెలిపాయి చిత్రవర్గాలు.



అందమైన బంధం

ఒకటికి రెండు ఉంగరాలు పెట్టుకోవడంలో కొత్తేం లేదు. కానీ రెండింటినీ కలిపే గొలుసు ఒకటి ఉంటే? ఈ నయారకం ఫ్యాషన్ అమ్మాయిలు ఎంతో ఇష్టంగా ధరించేస్తున్నారు. చూసేయండి మరి..





మనసు.. మాట వినడం లేదా?



నిషిత వయసు పదిహేనేళ్లు. ఈ మధ్య తరచూ ఆమె కళ్లలో భయం కనిపిస్తోంది! ఒంటరిగా గడుపుతూ.. పదే పదే లెంపలు వేసుకుంటోంది.. దేవుడి బొమ్మని చూస్తే చాలు కళ్లకి అద్దుకుంటోంది. ఏం జరిగిందని అడిగితే జవాబు చెప్పదు. 'చెప్పకూడదు' అంటుంది. కౌన్సెలర్ దృష్టికి తీసుకెళ్లాక తెలిసిన విషయం ఏంటంటే..ఆమెలో లైంగిక విషయాలపై ఆసక్తి కలుగుతుందని.. ఏం అలాంటి ఆలోచనలు రాకూడదా?

నిషితకు ఎప్పుడూ అవే ఆలోచనలు. ఇష్టమైన హీరో, క్రికెటర్ ఫొటో చూసినా, వారితో ప్రణయ భావనలు ఊహించుకుంటోంది. క్లాస్‌మేట్స్‌లో అందమైన, తెలివైన అబ్బాయిలు ఉంటారు. ఒకరిద్దరి తెలివి తేటల పట్ల, రూపం పట్ల ఆకర్షణ పెరిగింది. శ్రద్ధగా అలంకరించుకుని వారి కంట పడాలని చూస్తోంది. ఒక సాయంత్రం ఇష్టమైన క్రికెటర్ ఫొటో నోట్స్‌లో పెట్టుకుని చూస్తూ ఉండగా, తల్లి కంటబడింది. 'ఏం పాడు బుద్ధులు ఇవి? అక్క ఎంత బుద్ధిగా ఉంటుందో? పెళ్లి కావాల్సిన పిల్లలకు ఇలాంటి ఆలోచనలు రావడం ఎంత పాపం?' అని నానా మాటలు అనేసింది.

ఈ మాటలతో గుక్క తిప్పుకోలేకపోయింది నిషిత. తప్పు చేస్తున్నానన్న భావనలో కూరుకుపోయింది. అలాగని మనసులో రేగుతున్న ప్రణయ ఊహలను మాత్రం అదుపు చేయలేకపోయింది. ఈ సమస్య తన ఒక్కదానికేనా? ఇదేమైనా రోగమా? ఇంకెవరూ ఇలా ఉండరా? అనుకుంది. ఒకరిద్దరు దగ్గర స్నేహితులతో ఎవరికి చెప్పమని ఒట్టు వేయించుకుని.. 'మీకూ ఇలాంటి ఫీలింగ్స్ వస్తాయా అబ్బాయిల గురించి?' అని అడిగింది. వాళ్లు ముసిముసిగా నవ్వారు. 'అందరికీ ఉంటాయి' అన్నారు.

కౌమార దశలో ఉన్న పిల్లలకు సహజంగా ఎదురయ్యే ఇబ్బందులే ఇవి. శరీరంలో జరుగుతున్న హార్మోన్ల మార్పు వల్ల అపోజిట్ సెక్స్ మీద ఆకర్షణలు ఏర్పడడం, సెక్స్ భావనలు కలగడం, కోరికలు.. వాటిని ఎలా దారి మళ్లించాలో తెలియక, ఎవరికి చెప్పాలో తెలియక సతమతం అవడం మామూలే? తల్లిదండ్రులతో ఇలాంటి విషయాలు చర్చించే పద్ధతి మన దేశంలో లేదనే చెప్పాలి.

ఈ పరిస్థితుల్లో పిల్లలు చదువులో వెనుకపడతారనే భయం కంటే, తమ పరువు పోతుందనే ఆలోచనా ధోరణే తల్లిదండ్రుల్లో ఉంది. అందుకే ఇటువంటివి గమనిస్తే తిట్టడం, చేయి చేసుకోవడం, స్నేహాలపై ఆంక్షలు విధించడం చేసి పిల్లల మనసుని తీవ్రంగా నొప్పిస్తారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా ప్రవర్తిస్తూ ఇలాంటి ఇబ్బందులు దాటడానికి వారికి పరోక్షంగా సహకరిస్తున్నారు.

తల్లిదండ్రులకు...

- ఇలాంటి ఆకర్షణలు ఎక్కువ కాలం నిలవలేవు. ఇవి ప్రేమలుగా మారి భవిష్యత్తుకేం ఆటంకం కలిగించవని పెద్దలు గుర్తుంచుకోవాలి. బాల్యంలో అంటిపెట్టుకు తిరిగిన బొమ్మ మీద పెద్దయ్యాక ఆసక్తిపోయినట్లే, ఇప్పుడు ఏర్పడిన ఈ ఆకర్షణలు కొంతకాలానికి సమసిపోతాయని తెలుసుకోవాలి.
- మీడియా, సోషల్ మీడియా ప్రభావం ప్రబలిపోయిన ఈ రోజుల్లో పరిచయాలు ఏర్పడటం అతి త్వరగా జరిగిపోతోంది. వాటి గురించి తల్లిదండ్రులు జాగ్రత్త వహించాల్సిన మాట నిజమే అయినా, టీనేజ్‌లో పిల్లల్లో జరిగే శారీరక, మానసిక మార్పులను అర్థం చేసుకుని, వారితో స్నేహంగా మెలగాలి.
- మగపిల్లలైనా, ఆడపిల్లలైనా.. పిల్లలు తమతో ప్రతి విషయాన్నీ పంచుకునే వాతావరణం ఇంట్లో ఉండాలి. టీనేజ్ ఆకర్షణల గురించి తెలిసినప్పుడు.. కోప్పడకుండా సామరస్యంగా మాట్లాడాలి. 'తప్పు చేశా' అనే అపరాధ భావనలోకి వారిని నెట్టొద్దు. చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని వివరించాలి. విద్యారంగంలో నెలకొన్న పోటీ, ఆసక్తులను అడిగి తెలుసుకుని ఆలోచనలను వేరే వైపు మళ్లించే ప్రయత్నం చేయాలి. ప్రేమ భావనలని అణచి వేయాలని ప్రయత్నిస్తే అవి మరింత ఉద్ధృతమయ్యే అవకాశం ఉంది.
- పిల్లల స్నేహితులెవరో తెలుసుకుని వారితో తామూ స్నేహంగా ఉండాలి. స్నేహితుల ప్రవర్తన తేడాగా ఉన్నట్లు గమనిస్తే దాని గురించి పిల్లలతో సరైన 'టోన్'తో చర్చించాలి. స్నేహితుల మీద ఫిర్యాదులు గుప్పించకూడదు.
- ఆడా, మగ స్నేహంగా ఉంటే తప్పేంకాదు. రకరకాల వ్యక్తులతో మెలగడం, సోషలైజ్ అవడానికి వారికి దొరికిన అవకాశం అది. కాలం గడిచే కొద్దీ వాటిలో ఏ స్నేహాలు కొనసాగించాలో వారే నిర్ణయించుకుంటారు. అంతేకానీ అడుగడుక్కీ తల్లిదండ్రుల నిఘా, సలహాలు అవసరం లేదు. ఆ స్నేహాల్లో పడి చదువుని, ఇతర పనులను నిర్లక్ష్యం చేస్తుంటే జోక్యం చేసుకోవడంలో తప్పులేదు. వారు శారీరకంగా ముందడుగు వేస్తున్నారని అనుమానం వచ్చినా, పరిణామాలు చర్చిస్తూ, అభ్యంతరం తెలియజేయాలి. టీనేజ్ పిల్లల ఆకర్షణలను తేలిగ్గా తీసుకోవాలి. అతిగా స్పందించొద్దు.

టీనేజర్లకు...

- కొత్త కొత్త అభిరుచులు అలవరచుకొని వాటికి సమయం కేటాయించాలి.
- రొమాంటిక్ ఆలోచనలు నేరం అనే భావనలో నుంచి పూర్తిగా బయటకు రావాలి.
- ఆకర్షణలో ఉన్నప్పుడు జీవితం అందంగా కనిపిస్తుంది. కొత్త శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది. అదే అదునుగా భావించి ఆ శక్తిని చదువు మీద, ఇతర ఉపయోగకరమైన పనుల మీద వినియోగించుకోవాలి.
- ఆలోచనలు తీవ్రంగా వేధిస్తుంటే మీకు మీరే ఒక పరిమితి పెట్టుకోవాలి. 'ఈ రాత్రి పది వరకూ అలాంటి ఆలోచనలకు బ్రేక్ వేస్తా' అని నియమం పెట్టుకుని, ఆలోచనలు వచ్చినప్పుడల్లా వేరే వైపు వాటిని మళ్లిస్తూ ఉండాలి.
- ఏది ప్రధానం అనేదానిపై స్పష్టత ఉండాలి. ప్రేమ, సెక్స్... ఇలాంటి వాటికి జీవితంలో ముందు ముందు చాలా సమయం ఉంటుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని చదువు మీద దృష్టిని కేంద్రీకరించాలి.
- వీలైనంత వరకూ ఆకర్షణలను స్నేహాలుగానే ఉంచడం అలవాటు చేసుకోవాలి. ఒకవేళ తీవ్ర ఆలోచనలు అంతరాయం కలిగిస్తుంటే ఇతర పనుల్లో బిజీగా ఉండాలి. దృష్టి మళ్లుతుంది.

- వేల్పూరి సుజాత, కౌన్సెలర్

పులులపై బులెట్లు

దాడి నుంచి తప్పించుకోవాలంటే చేతిలో ఆయుధం ఉండాలి. ఆయుధం ఉంటే సరిపోతుందా? దాన్ని సరైన పద్ధతిలో వాడటం కూడా తెలియాలి కదా! అందుకే మృగాల దాడి నుంచి తమనితాము రక్షించుకోవడానికి కొడగు మహిళలు తుపాకీ కాల్చడంలో శిక్షణపొందుతున్నారు...

కర్నాటకలోని కొడగుకు దగ్గరగా ఉన్న గొనికొప్పల్ గ్రామం కాఫీ తోటలకు ప్రసిద్ధి. ఉపాధి కోసం అనేక మంది మహిళలు అక్కడ పనిచేయాల్సి ఉంటుంది. ఇలా పనిచేస్తున్న సమయంలో ఆ గ్రామానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాల నుంచి వచ్చిన క్రూరమృగాలు వారిపై దాడిచేస్తుండేవి. వాటి దాడిలో ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దాంతో స్వీయరక్షణకు అక్కడి మహిళలకు తుపాకీ కాల్చడంలో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు పోలీసులు. ఇప్పటివరకూ అయిదు బ్యాచుల్లో 150 మంది అతివలు 0.22 రైఫిల్‌ను కాల్చడం నేర్చుకున్నారు.



కొడగులోని గిరిజనులకు లైసెన్సు లేకుండా తుపాకీని వినియోగించడానికి కేంద్రప్రభుత్వ అనుమతి ఉంది. ఇక్కడ వన్యమృగాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఉన్న



ప్రత్యేక సౌకర్యమిది. ఈ దిశగా 0.22 రైఫిల్‌ను కాల్చడంలో పోలీసులు అందించే ప్రత్యేక శిక్షణలో చేరామంటున్నారు ఇక్కడి మహిళలు. తుపాకీ కాల్చడం ఇక్కడ సాధారణ విషయమే అయినా, ఎక్కువగా మగవారే ఇందులో ముందుండేవారు. ఈ శిక్షణ తీసుకున్న తరువాత తమలో ఆత్మస్థైర్యం పెరిగిందంటున్నారు అక్కడి ఆడవాళ్లు. ఇక్కడ పులుల దాడులతోపాటు, లైంగిక దాడులను ఎదుర్కోవడానికి కూడా ఈ తుపాకీ ఉపయోగపడుతుందని అంటున్నారు అధికారులు.

కొత్త తరం కలం కదిలింది!

ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక.
ఒక్క కథ వేయి జీవితాలకు ప్రతీక.
బతుకులోని నిశ్శబ్దం.. కథలో చప్పుడు చేస్తుంది.
సమాజంలోని చీకటిని.. కథ వెలుగులోకి తెస్తుంది.
కథంటే మాటల పదబంధం కాదు.. కంచెలు తెంచే ఖడ్గం... ఇలాంటి కథలే రాస్తున్నారు 60 మంది యువ రచయితలు. వారిలో ఒకరైన తోట అపర్ణ ఆ విశేషాలు పంచుకున్నారిలా...

ఓ వ్యక్తి కథ రాసి ఫేస్‌బుక్‌లో పెడతాడు... అరే భలే రాశారే అని మరో రచయిత నుంచి కామెంట్. మొన్న మీరు ఎఫ్‌బీలో పెట్టిన కథ ఉంది చూడండి... సూపరండసలు... దానికి తిరుగులేదు పొండి... ఇలాంటి లైకులు, కామెంట్లతోనే సామాజిక మాధ్యమాల్లో రచనపై ఆసక్తి ఉన్న 12 మందిమి కలుసుకున్నాం. ఇందులో సగం వరకు అమ్మాయిలే. మేమందరం తలో కథ రాసి 'ఇన్ ది మూడ్ ఫర్ లవ్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చాం. దీనికి నేను, వెంకట్ సిద్ధారెడ్డి సంపాదకులుగా వ్యవహరించాం. ఇది ఏదో సీరియస్‌గా సాగిపోయే సంప్రదాయ సాహిత్యం కాదండోయ్... ఇప్పుడున్న పరిస్థితులకు తగ్గట్టుగా... సులువుగా అర్థమయ్యేలా పదాలు, సన్నివేశాలు పెట్టి రాసిన పుస్తకమది. ప్రేమే ప్రధాన అంశంగా ఇది సాగిపోతుంది. పోయినేడు పుస్తక ప్రదర్శనలో ఈ పుస్తకానికి పాఠకులు ఫిదా అయిపోయారు. కొన్ని రోజుల్లోనే అన్ని కాపీలు అమ్ముడు పోయాయి. వారంలోనే మళ్లీ కొన్ని వేల పుస్తకాలను ప్రచురించాం.

ప్రచురణ సంస్థ పెట్టాం...

ఇన్ ది మూడ్ ఫర్ లవ్ పుస్తకానికి ముందు వీబీ సౌమ్య అనే అమ్మాయి సత్యజిత్‌రే 'అవర్ ఫిల్మ్స్ దేర్ ఫిల్మ్స్' పుస్తకాన్ని 'మన సినిమాలు.. వాళ్ల సినిమాలు' అనే పేరుతో తెలుగులోకి అనువదించింది. దీనికి సిద్ధారెడ్డి మెరుగులు దిద్దాడు. పుస్తకంలో ఉన్న గొప్పదనమే దీన్ని పాఠకులకు చేరువ చేస్తుందనుకున్నాం. కానీ ఏం లాభం. మార్కెటింగ్ పరంగా ఎన్నో



కష్టాలొచ్చాయి. ఇవే కాదు... చాలామంది పుస్తకాలు రాసి ఇతరులకు పంచడమో, అటకల మీద పెట్టడమో చేస్తున్నారు. కొనేవారు లేకే ఈ తంటాలు. ఇలా కాకుండా యువత మెచ్చేలా రాయాలనుకున్నాం. ప్రేమ కథలైతే ఎవరైనా ఇట్టే చదివేస్తారని నిర్ణయించుకున్నాం. మేం రాసిన పుస్తకాలను మేమే స్వయంగా ప్రచురించుకునేలా 'అన్వీక్షికి' అనే ప్రచురణ సంస్థ స్థాపించాం. దీనికోసం సిద్ధారెడ్డి ఎంతో కష్టపడ్డారు. దీనికి బండారు వందన చీఫ్ ఎడిటర్‌గా ఉన్నారు.

20 పుస్తకాలతో...

మా గ్రూప్‌లో 60 మంది యువ రచయితలు చేరారు. మేమందరం కలిసి 16 తొలిప్రేమ కథలు, లెటర్స్ టు లవ్, మీటూ కథలు... ఇలా మొత్తం 20 పుస్తకాలు మా ప్రచురణ కేంద్రంలో ప్రచురించాం. వీటితోనే పుస్తకప్రదర్శనలో ఒక స్టాల్ ఏర్పాటు చేశాం. ఇందులో మీటూ కథల పుస్తకాన్ని 13 మంది అమ్మాయిలు రాశారు. కడలి అనే 24 ఏళ్ల యువతి రాసిన 'లెటర్స్ టు లవ్' చదువరులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

- అభిసాయి ఇట్ట, ఈనాడు డిజిటల్, హైదరాబాద్

చిట్టి చేతికి చిక్కేలా...



పాలు తాగే పాపాయికి చేతిలో ఆ పాలడబ్బా అమరాలి కదా! లేకపోతే పాపాయి పాలు తాగేంత సేపు అమ్మే ఓపిగ్గా పట్టుకోవాలి. అలా కాకుండా పాపాయి పాలడబ్బాకు ఈ బాటిల్ హోల్డర్‌ని అమర్చండి. పాపాయి చిట్టి వేళ్లు ఆ హోల్డరులోకి వెళ్లి చక్కగా కుదురుకుంటాయి. డబ్బా పాపాయి చేతిలో అమరిపోతుంది.

పొడిగా ఉంచుతున్నారా?

జననాంగం నుంచి వచ్చే దుర్వాసన. ఎవరికి చెప్పాలన్నా ఇబ్బందిగా ఉండే సమస్య ఇది. మరి దీనికి పరిష్కారం లేదా? ఎందుకు లేదు. కొద్దిగా అవగాహనతో వ్యవహరించి... కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే తేలిగ్గానే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు...

ఇన్ఫెక్షన్ల బారినపడ్డా, లైంగిక చర్య తరువాత, నెలసరి సమయంలో... పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ఇలా జరగడానికి ఆస్కారం ఉంది. హార్మోన్లలో మార్పులు, బ్యాక్టీరియా పెరుగుదల వంటివి కూడా దుర్వాసన వెలువడటానికి కారణాలే. ఈ సమస్య నుంచి బయటపడటానికి ఇలా ప్రయత్నించండి..

- ✦ ప్రతి రోజూ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి.
- ✦ శుభ్రం చేసుకోవడానికి సువాసనలనిచ్చే సబ్బులకు దూరంగా ఉండాలి. బదులుగా సహజమైన వాటిని ఎంపిక చేసుకోవాలి. లేకపోతే ఆ ప్రాంతంలో వాపు, దురదా లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి.
- ✦ ఆ ప్రాంతం ఎల్లప్పుడూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం బేబీవైప్స్‌ను ఉపయోగించవచ్చు.
- ✦ లోషన్ల వంటివి ఆ ప్రాంతంలో అస్సలు ఉపయోగించొద్దు.
- ✦ నెలసరి సమయంలో వాడే ప్యాడ్, టాంపూన్స్‌తో గంటలు తరబడి ఉండిపోకూడదు. మధ్యలో మార్చుకోవాలి.
- ✦ ఎర్రగా మారడం, దురద, మంటగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఇంటి ముగ్గుకు స్వాగతం!



25 చుక్కలు
ఒకటి వచ్చేవరకు
సరి చుక్క


అమ్మా, తోబుట్టువులతో....



సోఫియా

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలిం సిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512. ✦ email:vasundhara@eenadu.net

21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు
సరి చుక్క





ఎల్. రమాదేవి
వైరా, ఖమ్మం జిల్లా, తెలంగాణ

మరిన్ని ముగ్గులు, ఫొటోల కోసం www.eenadu.net, www.vasundhara.net సైట్లు చూడండి.

సైంటిస్ట్ బార్బీ వచ్చేసింది...

ఆడపిల్లల్లో సైన్స్, ఇంజినీరింగ్ రంగాల పట్ల ఆసక్తిని కలిగించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఓ అమ్మ తయారుచేసిన బొమ్మే ఈ సైంటిస్ట్ బార్బీ..

ఉతాహ్ విశ్వవిద్యాలయంలో అటవీ పర్యావరణ శాస్త్రవేత్తగా ఉన్న నళిని తన కూతురు బార్బీబొమ్మను అడగడంతో కొత్తగా ఏదైనా చేయాలనుకుంది. శాస్త్రవేత్తగా ఎందరో విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన, పర్యావరణంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే నళిని, చిన్నారుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేదిశగా శాస్త్రవేత్త బార్బీని తయారుచేసింది. దానికి ట్రీ టాప్ బార్బీ'గా నామకరణం చేసింది. చిన్నారుల్లో సైన్స్ పట్ల అవగాహన రావాలన్నా, ఆసక్తి పెరగాలన్నా... చిన్నప్పటి నుంచి ఇలాంటి బొమ్మల గురించి తెలిసుండాలని అంటోంది నళిని.



వైవిధ్య చదువు



బ్లాక్‌చెయిన్ డెవలపర్

ఇంటర్నెట్ యుగంలో సమాచారాన్ని దొంగిలించడం, నాశనం చేయడం మామూలే. ఇది కొన్నిసార్లు భారీ నష్టాలకు కారణమవుతుంది. భద్రతకూ ముప్పును తీసుకొస్తుంది. వీటన్నింటికీ కళ్లెం వేసేదే బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ. ఇది సమాచారాన్ని వివిధ బ్లాకుల్లో నిక్షిప్తం చేసి, సురక్షితంగా ఉంచుతుంది. ఈ ప్రక్రియకు సాయపడేవారే బ్లాక్‌చెయిన్ డెవలపర్లు. వీరిలో కోర్ డెవలపర్లు బ్లాక్‌చెయిన్ సిస్టమ్ ఆర్కిటెక్చర్‌ను, ప్రొటోకాల్స్, సెక్యూరిటీ పాటర్న్‌లను నిర్మిస్తారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్లు దానిని ఉపయోగించి అప్లికేషన్లు, ఆప్‌లు మొదలైన వాటిని రూపొందిస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు: హైపర్‌లెడ్జర్, సాలిడిటీ, నోడ్.జేఎస్, స్మార్ట్ కాంట్రాక్ట్

కోర్సులు: లర్నింగ్ ఫుల్ స్టాక్ జావాస్క్రిప్ట్ డెవలప్‌మెంట్; మాంగోడీబీ, నోడ్ అండ్ రియాక్ట్; లర్నింగ్ గో; పైథాన్ ఫర్ డేటాసైన్స్ ఎసెన్షియల్ ట్రెయినింగ్; కోడ్ క్లినిక్: గో

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ స్పెషలిస్ట్

కొన్ని మినహా దాదాపుగా అన్ని రంగాల్లోకి ఏఐ/ రోబోట్లు రానున్నాయి. ఇవి సమాచారాన్ని ఉత్పత్తి చేయడమే కాదు, దాన్ని విశ్లేషించి, లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన నిర్ణయాలూ తీసుకుంటాయి. ఈ నిపుణులు స్వయంగా నిర్ణయాలు తీసుకునే మెషిన్లను రూపొందిస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు: మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్, టెన్సర్‌ఫ్లో, పైథాన్ (ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్), నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ)

కోర్సులు: పైథాన్ ఫర్ డేటాసైన్స్ ఎసెన్షియల్ లర్నింగ్; పైథాన్: డిజైనింగ్ పాటర్న్స్; మెషిన్ లర్నింగ్ అండ్ ఏఐ ఫౌండేషన్స్; రెకమెండేషన్స్; పైథాన్: ప్రోగ్రామింగ్ ఎఫిషియెంట్లీ; పైథాన్: డేటా అనలిస్ట్; లర్నింగ్ హడూప్

జావా స్క్రిప్ట్ డెవలపర్

ఏదైనా వెబ్‌సైట్‌ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దే వారిని ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌లు అంటారు. చూడటానికి ఎలా ఉండాలన్న దానిపైనే వీరు పనిచేస్తే.. జావాస్క్రిప్ట్ డెవలపర్లు ఫ్రంట్ ఎండ్ లాజిక్ అమలయ్యేలా చూస్తారు. వెబ్‌సైట్ ప్రోగ్రామింగ్, డెవలప్‌మెంట్, దాని కోర్ అంశాలను అమలుపరచడం వీరి విధులు.

కావాల్సిన నైపుణ్యాలు: ఆంగ్యులర్‌జేఎస్, నోడ్.జేఎస్, రియాక్ట్.జేఎస్, రియాక్ట్ నేటివ్, మాంగోడీబీ

కోర్సులు: లర్నింగ్ ఫుల్ స్టాక్ జావాస్క్రిప్ట్ డెవలప్‌మెంట్: మాంగోడీబీ, నోడ్, రియాక్ట్; లర్నింగ్ ఈసీఎంఏ స్క్రిప్ట్-6; లర్నింగ్ రీడక్స్; వెబ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్స్; ఫుల్ స్టాక్ వర్సెస్ ఫ్రంట్ ఎండ్; లర్నింగ్ గ్రాఫ్‌క్యూఎల్.

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ కన్సల్టెంట్

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ (ఆర్‌పీఏ) అంటే వ్యక్తులు చేసే రొటీన్ పనులను రోబోలు నిర్వహించేలా రూపొందించిన సాఫ్ట్‌వేర్. ఆర్‌పీఏను సంస్థల్లో ఉపయోగించే విధానం, వాటి వల్ల కలిగే ఉపయోగాలపై ఆర్‌పీఏ కన్సల్టెంట్‌లు పనిచేస్తారు. అన్నింటికీ ఒకే విధానాన్ని ఉపయోగించడం కాకుండా వివిధ సంస్థల అవసరాలను గమనించి, వాటికి అనుగుణంగా మార్గాలను సూచిస్తుంటారు.

కావాల్సిన నైపుణ్యాలు: యూఐపాత్, ఆటోమేషన్ ఎనీవేర్, బ్లూ ప్రిజమ్, ప్రాసెస్ ఆటోమేషన్, ఎస్‌క్యూఎల్

కోర్సులు: పైథాన్ ఫర్ డేటా సైన్స్ ఎసెన్షియల్ ట్రెయినింగ్; ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఫౌండేషన్స్; స్క్రమ్: ద బేసిక్స్



కొత్త ఏడాది ఈ కొలువులదే హవా!

ఆలోచనల అవసరం లేకుండా లక్షల రిక్వెస్టులను అలవోకగా పరిష్కరించే ఆర్‌పీఏకి ఆదరణ పెరుగుతోంది. కొత్త దశాబ్దంలో దీనికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తోడై యంత్రాలే నిర్ణయాలు తీసేసుకుంటాయి. పనుల వేగం పదుల రెట్లు పెరుగుతుంది. ఎన్నో రంగాలపై దీని ప్రభావం పడనుంది. అందుకే ఇరవై ఇరవై నుంచి కొన్ని రకాల కొలువులకు డిమాండ్ ఎక్కువకాబోతోందని అంచనా. అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే కొన్నేళ్లపాటు నిలకడగా ఉండే ఆ అవకాశాలను అందుకోవచ్చు.

ఆటోమేషన్‌కు ఆదరణ ఎక్కువవుతున్నకొద్దీ యంత్రాలతో వ్యక్తులకు పోటీ పెరుగుతోంది. దీంతో సాంకేతిక రంగంలో ఎన్నో కెరియర్లు పుట్టుకొస్తున్నాయి. ఈ విషయాన్నే లింక్‌డిన్ ధ్రువీకరిస్తోంది. 2015–19 మధ్య కాలంలో జరిగిన నియామకాల ఆధారంగా ఈ సంస్థ నివేదికను రూపొందించింది. కొత్త సంవత్సరంలో డిమాండ్ పెరగనున్న కొలువుల జాబితాను వెలువరించింది.

ఏ రంగాల్లో?

- ఐటీ అండ్ సర్వీసెస్
- కంప్యూటర్ సాఫ్ట్‌వేర్
- ఇంటర్నెట్
- ఫైనాన్షియల్ సర్వీసెస్
- హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్
- రిసెర్చ్
- ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్
- అకౌంటింగ్
- మేనేజ్‌మెంట్ కౌన్సెలింగ్
- ఇన్ఫర్మేషన్ సర్వీసెస్
- ఈ లర్నింగ్
- ఫుడ్ అండ్ బెవరేజెస్
- మార్కెటింగ్ అండ్ అడ్వర్టైజింగ్
- డిజిటల్ మార్కెటింగ్
- టెలికమ్యూనికేషన్స్
- ఇండస్ట్రియల్ ఆటోమేషన్
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్
- కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ
- అవుట్ సోర్సింగ్/ ఆఫ్ షోరింగ్.

బ్యాక్ ఎండ్ డెవలపర్

ఏదైనా వెబ్ అప్లికేషన్‌లో ఎవరికీ కనిపించకుండా తెర వెనక జరిగే పనిని బ్యాక్ ఎండ్ డెవలపర్ నిర్వహిస్తారు. అప్లికేషన్ ఉద్దేశం ఆధారంగా దాని రూపకల్పన ఉంటుంది. ఆకట్టుకునేలా కనిపించే ఫ్రంట్ ఎండ్‌లోకి వినియోగదారుడు ప్రవేశించడానికి పరోక్షంగా తోడ్పడేవాటిని వీళ్లు రూపొందిస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు: నోడ్.జేఎస్, మాంగోడీబీ, జావాస్క్రిప్ట్, డీజేఆంగో, మైఎస్‌క్యూఎల్

కోర్సులు: పీహెచ్‌పీ: డిజైన్ పాటర్న్స్; అడ్వాన్స్‌డ్ పీహెచ్‌పీ; పైథాన్: డిజైన్ పాటర్న్స్; లర్నింగ్ ఫుల్ స్టాక్ జావాస్క్రిప్ట్ డెవలప్‌మెంట్: మాంగోడీబీ, నోడ్, రియాక్ట్; లర్నింగ్ స్ప్రింగ్ విత్ స్ప్రింగ్ బూట్

సైట్ రిలయబిలిటీ ఇంజినీర్

సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అంశాలకు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ విధానాన్ని జోడించడాన్ని సిస్టమ్ రిలయబిలిటీ ఇంజినీరింగ్ (ఎస్ఆర్ఈ)గా చెప్పొచ్చు. ఆప్‌ల డెవలప్‌మెంట్, ఆపరేషనల్ ప్రాసెస్‌లు సులువుగా అమలయ్యేలా చూడటం వీరి విధి. టెక్నాలజీ అవసరం రోజువారీ జీవితాల్లో పెరుగుతున్నకొద్దీ వీరికి గిరాకీ ఉంటుంది.

కావాల్సిన నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), యాన్సిబుల్, డాకర్ ప్రొడక్ట్స్, క్యూబర్‌నెట్స్, జెంకిస్

కోర్సులు: DevOps ఫౌండేషన్స్; లర్నింగ్ యాన్సిబుల్; అడ్వాన్స్‌డ్ లైనక్స్: ద లైనక్స్ కర్నల్; లర్నింగ్ గో, పైథాన్: డిజైన్ పాటర్న్స్, లైనక్స్: బాష్ షెల్ అండ్ స్క్రిప్ట్స్, పైథాన్: ప్రోగ్రామింగ్ ఎఫిషియంట్లీ.

కస్టమర్ సక్సెస్ స్పెషలిస్ట్

ఏదైనా వస్తువు/ ప్రొడక్ట్‌కు సంబంధించి సమస్య ఎదురైనప్పుడు వినియోగదారులు సంస్థ కస్టమర్ కేర్ సర్వీస్‌ను సంప్రదిస్తుంటారు. ఆ తరహాలోనే కస్టమర్ సక్సెస్ స్పెషలిస్ట్ పని చేస్తుంటారు. సమస్య వీరి దృష్టికి వచ్చినప్పుడు దాన్ని కోర్ క్లయింట్, సంస్థల అవసరాలుగా గుర్తించి సేవలు అందిస్తారు. వీరికి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ నైపుణ్యాలు రెండూ అవసరమవుతాయి.

కావాల్సిన నైపుణ్యాలు: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), టీం మేనేజ్‌మెంట్, కస్టమర్ రిటెన్షన్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (ఎస్ఏఏఎస్), అకౌంట్ మేనేజ్‌మెంట్

కోర్సులు: ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఫౌండేషన్స్; గివింగ్ యువర్ ఎలివేటర్ పిచ్; డెవలపింగ్ ఎగ్జిక్యూటివ్ ప్రెజెన్స్; చేంజ్ మేనేజ్‌మెంట్ ఫౌండేషన్స్.

ఫుల్ స్టాక్ ఇంజినీర్

ఒక అప్లికేషన్‌కు సంబంధించి అన్ని అంశాలు- ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీ, బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్ లాంగ్వేజెస్, డేటా బేస్, సర్వర్, ఏపీఐ, వర్షన్ కంట్రోలింగ్ సిస్టమ్స్‌పై పనిచేస్తారు. వీరు క్లయింట్లు, సంస్థ రెండింటి కోసం పనిచేయగలుగుతారు. మొత్తంగా సిస్టమ్ సమర్థంగా పనిచేసేలా చూస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు: ఆంగ్యులర్ జేఎస్, నోడ్.జేఎస్, జావాస్క్రిప్ట్, రియాక్ట్.జేఎస్, మాంగోడీబీ

కోర్సులు: లర్నింగ్ ఫుల్ స్టాక్ జావా స్క్రిప్ట్ డెవలప్‌మెంట్: మాంగోడీబీ, నోడ్, రియాక్ట్; లర్నింగ్ స్ప్రింగ్ విత్ స్ప్రింగ్ బూట్; పీహెచ్‌పీ: డిజైన్ పాటర్న్స్; సీ++ డిజైన్ పాటర్న్స్: పార్ట్-1; లర్నింగ్ రిడక్స్

రోబోటిక్స్ ఇంజినీర్ (సాఫ్ట్‌వేర్)

వీరు రోబోట్ కంట్రోల్, ఆటోమేషన్ నిమిత్తం సాఫ్ట్‌వేర్ రూపొందిస్తారు. బిజినెస్ అవసరాలకు అనుగుణంగా ఆటోమేటిక్‌గా రోబోలు పనిచేసేలా చేస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు: రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ (ఆర్‌పీఏ), యూఐపాత్, బ్లూ ప్రిజమ్, ఆటోమేషన్ ఎనీవేర్, రోబోటిక్స్, ఎస్‌క్యూఎల్

కోర్సులు: పైథాన్ ఫర్ డేటా సైన్స్ ఎసెన్షియల్ ట్రెయినింగ్; మెషిన్ లర్నింగ్ అండ్ ఏఐ ఫౌండేషన్స్; రెకమెండేషన్స్; మెషిన్ లర్నింగ్ అండ్ ఏఐ ఫౌండేషన్స్: వాల్యూ ఎస్టిమేషన్స్; విజువల్ బేసిక్ ఎసెన్షియల్ ట్రెయినింగ్; సీ++; అండ్.నెట్ ప్రోగ్రామింగ్.

(కొత్త సంవత్సరంలో డిమాండ్ ఉండే మరికొన్ని కొలువుల వివరాల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.)

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఫ్యాక్ట్‌లో 140 ఖాళీలు

కొచ్చి (కేరళ)లోని ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్ (ఫ్యాక్ట్) కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 140 **పోస్టులు:** సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ, డిప్యూటీ మేనేజర్, తదితరాలు. **అర్హత:** పోస్టుని అనుసరించి పదోతరగతి, ఐటీఐ, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం. **ఎంపిక విధానం:** ఆప్టిట్యూడ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
చివరితేది: జనవరి 22, 2020. http://www.fact.co.in/

ఈఐఎల్, న్యూదిల్లీ

న్యూదిల్లీలోని ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ ఎగ్జిక్యూటివ్ పోస్టులు. **మొత్తం ఖాళీలు:** 102
విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, వెల్డింగ్/ ఎన్‌డీటీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, వేర్‌హౌజ్, సేఫ్టీ.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్. **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జనవరి 02, 2020. **దరఖాస్తుకు చివరితేది:** జనవరి 22, 2020. https://engineersindia.com/

ప్రవేశాలు

ఎన్‌సీహెచ్ఎం జేఈఈ-2020

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) 2020 విద్యా సంవత్సరానికి నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్ఎం జేఈఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ● ఎన్‌సీహెచ్ఎం జేఈఈ-2020
కోర్సులు: బీఎస్సీ (హాస్పిటాలిటీ, హోటల్ అడ్మినిస్ట్రేషన్). **అర్హత:** ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా ఇంటర్మీడియట్/ తత్సమాన ఉత్తీర్ణత.
ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా.
పరీక్షతేది: ఏప్రిల్ 25, 2020.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తుకు చివరితేది: మార్చి 20, 2020.
వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in/

మరిన్ని నోటిఫికేషన్లకు QR కోడ్ స్కాన్ చేయవచ్చు లేదా **www.eenadupratibha.net** చూడవచ్చు.

దరఖాస్తు చేశారా?



✦ **యూపీఎస్సీలో వివిధ ఖాళీలు**
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ, బీటెక్, గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం. చివరితేది: జనవరి 02, 2020
✦ **వీఎస్ఎస్‌సీ–తిరువనంతపురంలో సైంటిస్టులు**
అర్హత: పోస్టుని అనుసరించి ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీబీఎస్, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం. చివరితేది: జనవరి 03, 2020
✦ **ఈసీఐఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీలు**
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, గేట్ స్కోర్. చివరితేది: జనవరి 04, 2020
✦ **ఆర్మీ పబ్లిక్ స్కూల్, సికింద్రాబాద్**
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, బీఈడీ, పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, సీటెట్/ టెట్‌లో అర్హత, అనుభవం. చివరితేది: జనవరి 05, 2020

ఆర్ఆర్‌బీ పరీక్షలు
అరిథ్‌మెటిక్

రెండు వడ్డీల మధ్య తేడా ఎంత?

స్టడీ మెటీరియల్

ఇటీవల పరీక్షల్లో వడ్డీ లెక్కల్లో కొత్త మోడల్స్ వస్తున్నాయి. రెండు రకాల వడ్డీలను కలిపి ప్రశ్నలు ఇస్తున్నారు. వీటిని పరిశీలించి సాధన చేస్తే వేగంగా సమాధానాలను గుర్తించవచ్చు.

బారువడ్డీ, చక్రవడ్డీల మధ్య సంబంధం

1. కొంత సొమ్మును 5% వడ్డీరేటుతో 2 సంవత్సరాల కాలానికి బారువడ్డీ, చక్రవడ్డీకి ఇస్తే రెండు వడ్డీల మధ్య తేడా రూ. 25. అయితే ఆ సొమ్ము ఎంత?

1) రూ.10,000 2) రూ.12,000 3) రూ.15,000 4) రూ.18,000

సమాధానం: 1

సాధన: 2 సంవత్సరాల మధ్య తేడాకు సూత్రం $D = P\left(\frac{r}{100}\right)^2$

$$25 = P \times \frac{5}{100} \times \frac{5}{100} \Rightarrow P = \frac{25 \times 100 \times 100}{5 \times 5} = 10{,}000$$

$\therefore$ P = రూ.10,000

2. కొంత సొమ్మును 5% వడ్డీరేటుతో 3 సంవత్సరాల కాలానికి బారువడ్డీ, చక్రవడ్డీకి ఇస్తే రెండు వడ్డీల మధ్య తేడా రూ.122. అయితే ఆ సొమ్ము ఎంత?

1) రూ.12,000 2) రూ.16,000 3) రూ.20,000 4) రూ.24,000

సమాధానం: 2

సాధన: 3 సంవత్సరాల మధ్య తేడాకు సూత్రం

$$D = P\left(\frac{r}{100}\right)^2\left(\frac{300 + r}{100}\right)$$

$$122 = P \times \frac{5}{100} \times \frac{5}{100} \times \frac{305}{100}$$

$$P = \frac{122 \times 100 \times 100 \times 100}{5 \times 5 \times 305} = 16{,}000$$

$\therefore$ P = రూ. 16000

3. ఒకరు కొంత సొమ్మును చక్రవడ్డీకి ఇస్తే 2 ఏళ్లకు రూ.4840, 3 ఏళ్లకు రూ.5324 అయ్యింది. అయితే వడ్డీరేటు ఎంత?

1) 10% 2) 9% 3) 8% 4) 7%

సమాధానం: 1

సాధన: $A = P\left(1 + \frac{R}{100}\right)^n$ ను ఉపయోగించి

$$5324 = P\left(1 + \frac{R}{100}\right)^3 \quad \text{.......... (1)}$$

$$4840 = P\left(1 + \frac{R}{100}\right)^2 \quad \text{.......... (2)}$$

1 ÷ 2 చేస్తే...

$$\frac{5324}{4840} = \frac{P\left(1 + \frac{R}{100}\right)^3}{P\left(1 + \frac{R}{100}\right)^2}$$

$$\frac{484}{440} = \left(1 + \frac{R}{100}\right)^3 \times \left(1 + \frac{R}{100}\right)^{-2}$$

$$\frac{484}{440} = 1 + \frac{R}{100} \Rightarrow \frac{484}{440} - 1 = \frac{R}{100}$$

$$\frac{484 - 440}{440} = \frac{R}{100} \Rightarrow \frac{44}{440} = \frac{R}{100} \Rightarrow R = \frac{44 \times 100}{440}$$

$\therefore$ R = 10%

సంక్షిప్త పద్ధతి: $\frac{5324 - 4840}{4840} \times 100 = \frac{484}{4840} \times 100 = 10\%$



4. కొంత సొమ్మును చక్రవడ్డీకి ఇస్తే రెండేళ్లలో రూ.7350, మూడేళ్లలో రూ.8575 అవుతుంది. అయితే ఇచ్చిన సొమ్ము ఎంత?

1) రూ.5000 2) రూ.5400
3) రూ.5600 4) రూ.6000

సమాధానం: 2

సాధన: $7350 \times \frac{7350}{8575} \times \frac{7350}{8575}$ = రూ.5400

- బిజ్జల విష్ణువర్ధన్ రెడ్డి

(మరింత సమాచారం కోసం www.eenadupratibha.net చూడవచ్చు.)

ఆత్మీయ పలకరింపు

పొరుగు దేశాల నేతలకు మోదీ శుభాకాంక్షలు

దిల్లీ: పొరుగు దేశాలైన భూటాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవుల దేశాల నేతలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ఫోన్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రాంతీయంగా శాంతి నెలకొనడానికి, భద్రతకు భారత్ కట్టుబడి ఉందని, 'పొరుగు వారే ప్రథమం' విధానాన్ని పాటిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని ఉద్ఘాటించారు. ఈ మేరకు భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యెల్ వాంగ్‌చుక్, బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు గొటబయ రాజపక్స, నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీలతో ఫోన్‌లో మాట్లాడారు. భూటాన్ ప్రధానమంత్రి లోటే షేరింగ్, శ్రీలంక ప్రధానమంత్రి మహింద రాజపక్స, మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మహ్మద్ సోలిహ్‌లకూ ఫోన్ చేశారు.

అవగాహన కోసం

'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' క్విజ్ పోటీలు

ఈనాడు, దిల్లీ: దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు ఇతర రాష్ట్రాల పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో కేంద్ర పర్యాటక శాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ వేదికగా క్విజ్ కార్యక్రమం ప్రారంభించింది. ఇతర రాష్ట్రాల్లోని సంగీతం, నాటకం, వంటలు, భాష, చరిత్ర, పర్యాటక ప్రదేశాల పట్ల అవగాహనను పెంచడమే లక్ష్యంగా ఈ క్విజ్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. జూన్ 30 వరకు https://quiz.mygov.in/quiz/ebsb/ లింక్ ద్వారా క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చని కేంద్ర పర్యాటక శాఖ తెలిపింది.

విన్నపం

'ఐఐఎంల్లో బోధన పోస్టుల భర్తీకి రిజర్వేషన్లు వద్దు'

దిల్లీ: ప్రతిష్ఠాత్మక 20 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల్లో రిజర్వేషన్లు పాటించకుండా అధ్యాపక పోస్టులను భర్తీ చేసేలా అనుమతి ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్‌ఆర్‌డీ)ను ఆ సంస్థల అధికారులు కోరారు. బోధన పోస్టుల భర్తీకి ఇప్పటి వరకూ ఈ సంస్థలు రిజర్వేషన్లు పాటించడం లేదు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనకబడ్డవర్గాలకు ఉన్న కోటా మేరకు రిజర్వేషన్లు కల్పించి బోధన పోస్టులు భర్తీ చేయాలని హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

విషాదం

జకార్తాను ముంచెత్తిన వరద

9 మంది దుర్మరణం

జకార్తా: ఇండోనేసియా రాజధానిని ముంచెత్తిన వరదల్లో 9 మంది మరణించారు. మంగళవారం నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. గ్రేటర్ జకార్తాలో.. విద్యుదాఘాతం, నీటమునిగిపోవడం, కొండచరియలు విరిగి పడటం, శరీర ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయి ఒళ్లంతా చల్లబడటం వంటి కారణాలతో 9 మంది మరణించినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

స్మరణ

కోరేగావ్-భీమా స్మారకానికి భారీగా నివాళి

పుణె: మహారాష్ట్రలోని కోరేగావ్-భీమా పోరాట 202వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పుణెలోని విజయ స్థూపం వద్దకు ప్రజలు భారీసంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. రెండేళ్ల క్రితం ఇదే సందర్భంలో హింసాత్మక నిరసనలు జరిగిన నేపథ్యంలో ఈసారి భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు దాదాపు ఎనిమిది లక్షల మంది నివాళులర్పించారని అంచనా. స్థూపాన్ని సందర్శించినవారిలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, వంచిత్ బహుజన్ అఘాడీ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేడ్కర్, కేంద్ర మంత్రి రాందాస్ అఠవాలే ఉన్నారు.

2021లో చంద్రయాన్-3



ఈనాడు డిజిటల్ – బెంగళూరు

- సజావుగా సాగుతున్న ప్రాజెక్టు పనులు
- గగన్‌యాన్ కోసం వాయుసేన నుంచి నలుగురి ఎంపిక
- రష్యాలో త్వరలోనే వారికి శిక్షణ ప్రారంభం
- ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి

పట్టు వదలని విక్రమార్కుడిలా జాబిల్లిపైకి మరో యాత్ర చేపట్టేందుకు భారత్ సన్నద్ధమవుతోంది. 'చంద్రయాన్-3'గా పిలిచే ఈ నూతన ప్రాజెక్టును వచ్చే ఏడాది చేపట్టే అవకాశాలున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. సంబంధిత పనులు సజావుగా సాగుతున్నట్లు తెలిపింది. బెంగళూరులో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇస్రో ఛైర్మన్ కె.శివన్ ఈ మేరకు పలు వివరాలు వెల్లడించారు. 'చంద్రయాన్-3'ని 2020లోనే చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం వెల్లడించిన సంగతి గమనార్హం.

చంద్రయాన్-3లో ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ వ్యవస్థ ఉంటాయని శివన్ తెలిపారు. చంద్రయాన్-2 ఆర్బిటర్ ఏడేళ్లపాటు పనిచేస్తుందని, కొత్త ప్రాజెక్టుకూ దాని సేవలు వినియోగించుకుంటామని చెప్పారు. చంద్రయాన్-3 ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.615 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. వేగ నియంత్రణలో వైఫల్యం కారణంగా చంద్రయాన్-2లోని విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై విజయవంతంగా దిగలేకపోయిందని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయం వల్లే కూలిన ల్యాండర్ చిత్రాలను తాము విడుదల చేయలేదన్నారు. విక్రమ్ జాడను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన చెన్నైకి చెందిన ఇంజినీర్ షణ్ముగ సుబ్రమణ్యన్‌ను శివన్ అభినందించారు. 2020లో మొత్తం 25 మిషన్లను చేపట్టేందుకు ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

'నావిక్' ఈ ఏడాదే

'చంద్రయాన్-3'తోపాటే ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టు పనులనూ ఏకకాలంలో పూర్తి చేస్తున్నట్లు శివన్ చెప్పారు. గగన్‌యాన్ కోసం వాయుసేనకు చెందిన నలుగురు పురుషులను ఎంపిక చేశామని, రష్యాలో ఈ నెల 3వ వారం నుంచి వారికి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రత్యేక జీపీఎస్ వ్యవస్థతో కూడిన 'ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (నావిక్)ను ఈ ఏడాదే ఆవిష్కరిస్తామని చెప్పారు. గత ఏడాది ప్రణాళికకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రయోగాలను ఈ ఏడాది మార్చిలోగా దశలవారీగా పూర్తిచేస్తామన్నారు.

తూత్తుకుడిలో వేగంగా భూ సేకరణ

తమిళనాడులోని తూత్తుకుడిలో అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటు కోసం 2,300 ఎకరాల భూ సేకరణ పనులు వేగంగా సాగుతున్నాయని శివన్ వెల్లడించారు. తక్కువ వ్యయంతో రూపొందించే బుల్లి ఉపగ్రహ వాహక నౌకలను తొలి దశలో అక్కడి నుంచి ప్రయోగిస్తామని, తర్వాత భారీ వాహకనౌకల ప్రయోగాలకూ విస్తరిస్తామని తెలిపారు.

ధర మాత్రం మరచిపోలేం

- అల్జీమర్స్ మందు సంవత్సరానికి రూ.4.06 లక్షలు

బీజింగ్: అల్జీమర్స్‌ను నయం చేసే ఔషధం చైనా మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. అయితే దీని ధర మాత్రం చాలా ఎక్కువ. అంతేకాదు.. గోధుమ రంగు నాచు నుంచి సేకరించిన పదార్థంతో తయారుచేసిన ఈ ఔషధాన్ని 17 సంవత్సరాలు క్రమం తప్పకుండా వాడితే అల్జీమర్స్ వ్యాధి నుంచి బయటపడొచ్చని చైనా జాతీయ ఔషధ ఉత్పత్తుల యంత్రాంగం ప్రకటించింది. స్వల్ప మధ్యస్థాయిలో ఉన్న అల్జీమర్స్‌ను ఈ ఔషధం నయం చేస్తుందని తెలిపింది. ఏడాదికి సరిపడా ఔషధం ధర రూ.4,06,153 (5,700 డాలర్లు). ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కేవలం 5 కోట్ల మంది అల్జీమర్స్ రోగులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 కేంద్రాల్లో 2,000 మందికిపైగా అల్జీమర్స్ రోగులపై ఔషధ పరీక్షలు నిర్వహిస్తామని, ఇందుకోసం రూ.21 వేల కోట్లు (3బిలియన్ డాలర్లు) వెచ్చిస్తామని ఈ ఔషధాన్ని తయారుచేసిన షాంఘై గ్రీన్‌వ్యాలీ ఫార్మాస్యూటికల్స్ ప్రకటించింది.

భారత్‌కు కాకుండా మరెక్కడికెళ్తారు?

పౌరసత్వ సవరణ చట్టంపై కిషన్‌రెడ్డి వ్యాఖ్య

వారణాశి: పాకిస్థాన్‌లోని హిందువులు, ఇతర మైనారిటీలకు ఆశ్రయం ఇవ్వాల్సిన నైతిక బాధ్యత భారత్‌కు ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. "పొరుగునే ఉన్న మూడు దేశాల్లో తీవ్ర అణచివేతకు గురవుతున్న మైనారిటీలకు మనం కాకపోతే మరెవరు పౌరసత్వాన్నిస్తారు. భారత్‌కు తరలిరాకపోతే వారంతా మరెక్కడికెళతారు? ఇటలీకా?" అని ఆయన ప్రశ్నించారు. హిందువులు లేదంటే సిక్కులను ఇటలీ అక్కున చేర్చుకోదని, పేదవారు కావడమే అందుకు కారణమని అన్నారు. జీఎస్‌టీకి, సీఏఏకి మధ్య ఉన్న వ్యత్యాసాలు కాంగ్రెస్ సారథి రాహుల్‌కు తెలియదని అందుకే, ఆయన పౌరసత్వ సవరణ చట్టానికి, పన్నులకు లంకెపెడుతూ మాట్లాడారని విమర్శించారు.



ఫలతోరణం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం వివిధ రకాల ఫలాలతో తీర్చిదిద్దిన చెన్నైలోని కడంబాడి మాత ఆలయ ఆవరణ

వంట గ్యాస్ మరింత భారం

దిల్లీ: రాయితీలేని వంటగ్యాస్ ధర పెంచుతూ బుధవారం చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ధర 14.2 కేజీల సిలిండర్‌కు రూ.19 పెరిగింది. దిల్లీలో దీని ధర రూ.695 నుంచి రూ.714కు చేరింది. గత ఐదు నెలలుగా రాయితీలేని వంట గ్యాస్ ధర పెరుగుతుండడం గమనార్హం. వినియోగదారులకు రాయితీపై 12 సిలిండర్లు ఇస్తారు. అంతకన్నా ఎక్కువ సిలిండర్లు కావలసిన వారు రాయితీలేనివి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ కింద సరఫరా చేసే కిరోసిన్ ధర కూడా పెరిగింది. విమాన ఇంధనమైన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధర 2.6% మేర పెరిగింది.


పోప్ పశ్చాత్తాపం

వాటికన్‌సిటీ: సహనమూర్తి అయిన పోప్ కూడా అసహనానికి గురైన క్షణాలవి. కానీ ఆ తర్వాత ఆయన అందుకు ఎంతో పశ్చాత్తాపం చెందారు. తన చర్యకు క్షమాపణలు కోరారు. గత నెల 31న భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ ...ఆశీర్వదిస్తూ ముందుకు సాగుతున్న పోప్ ఫ్రాన్సిస్‌ను చూడగానే ముందువరసలో నిలుచుని ఉన్న ఓ మహిళ భావోద్వేగానికి గురయ్యారు. ఆత్రంగా, ఆర్ద్రంగా ఆయన చేతిని గట్టిగా పట్టుకున్నారు. చేయి వదిలించుకోవాలని పోప్ ప్రయత్నించినా ఆమె వదలలేదు. దీంతో ఆయన ఆమె చేతిపై రెండు దెబ్బలు వేసి చేతిని విదిలించేసుకుని ముందుకు సాగారు. ఆయన మొహంలో కాస్తంత అసహనం కనిపించింది. బుధవారం పోప్ స్పందిస్తూ మనం చాలా సందర్భాల్లో సహనం కోల్పోతుంటామని.. తన విషయంలోనూ అదే జరిగింది అని అన్నారు. తనను క్షమించాలని కోరారు.

రాజకీయాలకు మేం దూరం

- ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నడుచుకుంటాం
- తొలి సీడీఎస్ రావత్ ఉద్ఘాటన

దిల్లీ: సాయుధ బలగాలు రాజకీయాలకు దూరంగా ఉంటాయని భారత త్రిదళాధిపతి (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవి నడుచుకుంటాయని ఉద్ఘాటించారు. రాజకీయపరమైన సంబంధాలున్నాయంటూ తనపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ మేరకు స్పందించారు. దేశ తొలి సీడీఎస్‌గా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సైన్యం, నౌకాదళం, వాయుసేనల మధ్య సమన్వయాన్ని పెంపొందించి.. వాటిని ఓ బృందంలా పనిచేయించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రావత్‌కు త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి.



త్రిదళాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా... సైన్యాధ్యక్షుడు జనరల్ నరవణే, నౌకాదళ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, వైమానికదళ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్‌లతో బిపిన్ రావత్

త్రివిధ దళాలు కలిస్తే వాటి ఉమ్మడి శక్తి రెట్టింపు కావాలని రావత్ అభిప్రాయపడ్డారు. '1+1+1 విలువ 5 లేదా 7 కావాలి. అంతేగానీ 3 కాదు'' అని వ్యాఖ్యానించారు. సమన్వయం కారణంగా ఆయా బలగాల శక్తి చాలా ఎక్కువవ్వాలని పేర్కొన్నారు. అదే సీడీఎస్(తన) లక్ష్యమని తెలిపారు. మూడేళ్లలో త్రివిధ దళాల మధ్య పూర్తిస్థాయి సమన్వయాన్ని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేస్తానన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను రావత్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పాక్ ఉగ్రవాదుల చొరబాటు యత్నం భగ్నం

- నియంత్రణ రేఖ దగ్గర ఇద్దరు సైనికుల వీరమరణం

జమ్మూ: భారీస్థాయిలో ఆయుధాలతో భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన పాక్ ఉగ్రవాదుల ప్రయత్నాలను సైన్యం విజయవంతంగా అడ్డుకొంది. ఈ క్రమంలో చొరబాటుదారులు కాల్పులు జరపడంతో భారత సైనికులు ఇద్దరు బుధవారం వీర మరణం పొందారు. జమ్మూ-కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో నియంత్రణరేఖ దగ్గర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి భారత్‌లోకి చొరబడేందుకు కొందరు సాయుధులు యత్నిస్తూ ఖారీ త్రయాట్ అడవిలో భారత సైన్యం కంటపడ్డారు. అనంతరం సైన్యంపై ఉగ్రమూక కాల్పులకు తెగబడింది. వీటిని తిప్పికొట్టే క్రమంలో నాయక్ సావంత్ సందీప్ రఘునాథ్ (29), రైఫిల్‌మన్ అర్జున్ థాపా మగర్ (25) వీరమరణం పొందారు.

ఇక చైనా సరిహద్దుపై దృష్టి: నరవాణే

ఉత్తర దిక్కులోని చైనా సరిహద్దుపై ఇక దృష్టి సారించాల్సి ఉందని సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం.నరవాణే పునరుద్ఘాటించారు. 28వ సైన్యాధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు బుధవారం ఇక్కడ లాంఛనంగా సైనిక వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పాకిస్థాన్ సరిహద్దుపైనే ఇంతవరకు దృష్టి కేంద్రీకరించామని, ఇకపై చైనా సరిహద్దుపైనా శ్రద్ధ పెట్టాల్సి ఉందని తెలిపారు. "చైనాతో మనకు వాస్తవాధీన రేఖ ఉంది. సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. అయితే సరిహద్దుల్లో శాంతి, సామరస్యం ఉండేలా మనమెంతో కృషి చేశాం. దీనిని ఇలాగే కొనసాగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇంతవరకు మనం పశ్చిమ సరిహద్దుకే ప్రాధాన్యం ఇచ్చాం. ఇకపై ఉత్తర సరిహద్దుకు కూడా అంతే ప్రాధాన్యం లభించాలి. ఇక్కడ మన సామర్థ్యాలను పెంచుతాం" అని తెలిపారు. సైన్యంలోని శ్రేణులన్నీ మానవ హక్కులపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఎదుర్కోవడానికి సైన్యం సిద్ధంగా ఉందని దేశ ప్రజలకు జనరల్ నరవాణే భరోసా ఇచ్చారు.

అమెరికాలో కాల్పుల మోత

వేర్వేరు ఘటనల్లో 9 మంది మృతి

వాషింగ్టన్: అమెరికాలో నూతన సంవత్సరం తొలిరోజు తెల్లవారుజామున పలుచోట్ల కాల్పుల మోత మోగింది. ఒమాహాలో ఒక నివాస సముదాయంలో కాల్పులు చోటుచేసుకుని ఇద్దరు మృతి చెందారు. పోలీసులు ఒక సాయుధుడిని మట్టుబెట్టారు. సెయింట్‌లూయిస్‌లో నలుగురు హత్యకు గురయ్యారు. ఫ్లోరిడాలోని ఓ క్లబ్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. పశ్చిమ వర్జీనియాలోని ఓ బార్ వద్ద జరిగిన కాల్పుల్లో ఏడుగురు, టెనసీలోని వాల్‌మార్ట్ వద్ద కాల్పుల్లో ఒకరు గాయపడ్డారు.

రాజ్యాంగ పరిరక్షణకు దిల్లీలో ప్రతిన

దిల్లీ: దేశ రాజధానిలోని ఇండియా గేట్ బుధవారం ఆందోళనలతో దద్దరిల్లింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తమకు వద్దంటూ నిరసనకారులు పెద్దపెట్టున నినదించారు. రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడతామని ప్రతినబూనారు. పీఠిక చదువుతూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. నిరసనకారులకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వద్ద పలువురు ఉద్యమకారులు, కళాకారులు మద్దతు ప్రకటించారు. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం వెలుపల భారీ నిరసన కార్యక్రమంలో బాలీవుడ్ నటి స్వరభాస్కర్ పాల్గొని మద్దతు ప్రకటించారు.



సీఏఏకు వ్యతిరేకంగా ఇండియా గేట్ వద్ద ఆందోళన చేపడుతున్న నిరసనకారులు

తప్పుదోవ పట్టిస్తున్న విపక్షాలు: సోనోవాల్

ఈనాడు–గువాహటి: పౌరసత్వ సవరణ చట్టం సాయంతో బంగ్లాదేశ్ నుంచి దాదాపు 2.5 కోట్ల మంది హిందువులు అసోంకి వచ్చి స్థిరపడతారంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ స్పష్టంచేశారు. భూముల్ని వీరికి ఇచ్చేస్తారంటూ తప్పుదోవ పట్టిస్తున్నాయని బుధవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ..

అగ్రస్థానంలో తెలంగాణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశుసంతతిని వృద్ధి చేసి, పాల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం గత సెప్టెంబరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 600 జిల్లాల్లో రోజుకు 25వేల చొప్పున ఆర్నెల్ల కాలంలో కోటి బర్రెలు, ఆవులకు కృత్రిమ గర్భధారణ చేయాలనేది లక్ష్యం.. కాగా 9,73,128 పశువులకు ఆ ప్రక్రియ పూర్తిచేశారు. ఇందులో తెలంగాణ 1,41,165తో అగ్రస్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ 1,02,273, గుజరాత్ 93,461, ఉత్తర్‌ప్రదేశ్ 79,217, తమిళనాడు 63,765తో తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. బిహార్, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మినహా మిగిలిన రాష్ట్రాలేవీ 50వేల మార్కు దాటలేదు. తెలంగాణలోని 32 జిల్లాల్లో కార్యక్రమం అమలవుతోంది. జిల్లాకు 100 గ్రామాలనేది నిబంధన కాగా, హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల్లోని కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 2,38,740 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలనేది లక్ష్యమని.. ఇప్పటికే 2,07,709 పశువులకు (87 శాతం) ప్రక్రియ పూర్తిచేశామని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మంజువాణి తెలిపారు. దీంతో పాటు పశువుల ఆన్‌లైన్ ట్యాగింగ్ కూడా పూర్తిచేస్తున్నామని ఆమె వివరించారు.

రూ.3 కోట్ల లంచం కేసులో డీఆర్ఐ ఉన్నతాధికారి అరెస్టు

దిల్లీ: రూ.3 కోట్ల లంచం కేసుకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అదనపు డైరెక్టర్ జనరల్ చందర్‌శేఖర్, మరో ఇద్దరిని సీబీఐ బుధవారం అరెస్టు చేసింది. ఓ ఎగుమతిదారుకు సంబంధించిన కీలకపత్రాలను గత జూన్‌లో నిర్వహించిన దాడుల్లో డీఆర్ఐ స్వాధీన పరచుకుంది. ఈ పత్రాల ఆధారంగా డీఆర్ఐ కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.3 కోట్లు ఇవ్వాలంటూ చందర్‌శేఖర్ తరఫున అనుప్ జోషి, రాజేశ్‌ధండా అనే ఇద్దరు వ్యక్తులు సదరు ఎగుమతి దారును బెదిరించి, లంచాన్ని డిమాండ్ చేసినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు.

వస్తోంది.. కృత్రిమ మేధ కేంద్రం

ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుకు రంగం సిద్ధం

రూసా కింద రూ.కోటి నిధులతో రూపకల్పన

నెల రోజుల్లో అందుబాటులోకి..

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ కేంద్రం ఏర్పాటుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సమాయత్తమైంది. మరో నెల రోజుల్లోనే దీనికి శ్రీకారం చుట్టనుంది. దీనివల్ల విద్యార్థులు, ఆచార్యులు, పరిశ్రమలు కలిసి పరిశోధనలు చేయడం ద్వారా సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఓయూ అధికారులు పేర్కొన్నారు. మనిషి పరిష్కరించలేని సమస్యలను కృత్రిమ మేధ సాంకేతికతతో పరిష్కరించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ ప్రవేశపెట్టిన రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్(రూసా) కింద ఆరు నెలల క్రితం రూ.107 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవలే రూసా నిధులు రూ.17 కోట్లు విడుదల కావడంతో అందులో రూ.కోటి నిధులతో ఆ కేంద్రాన్ని పట్టాలెక్కించనున్నారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌లో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. మరో నెల లోపు దీన్ని ప్రారంభిస్తామని రూసా నిధుల వినియోగానికి ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్ ఎండీ ఆచార్య రామచంద్రం చెప్పారు.

మూడుదశల్లో...

మొదటి దశ: కేంద్రాన్ని నెలకొల్పడం, అవసరమైన పరికరాలు సమకూర్చుకోవడం, ప్రయోగశాల ఏర్పాటు, ఇంటర్న్‌షిప్ కింద బీటెక్, ఎంటెక్ విద్యార్థులను నియమించడం.

రెండో దశ: తర్వాత ఆరు నెలల్లో బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో విద్యా ప్రణాళిక మార్పు, పరిశ్రమలతో ఒప్పందం, శిక్షణ, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ పోటీల్లో పాల్గొనడం.

మూడో దశ: ఆ తర్వాత 15 నెలల్లో పరిశ్రమలు, సంస్థలు, ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకొని ప్రస్తుతం సమాజానికి అవసరమైన ప్రాజెక్టులు చేపడతారు. తెలంగాణ ట్రాఫిక్ పోలీసు విభాగానికి ప్రయోజనం కలిగించేలా యూనివర్సిటీ ఆఫ్ డెలివేర్‌తో విజన్ అండ్ ఇమేజ్ అనాలసిస్ అనే అంశంపై పరిశోధన చేయడం.



కృత్రిమ మేధ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఓయూలోని టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఇదే

కేంద్రం లక్ష్యాలివీ...

- ▲ విద్యా ప్రణాళికలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టి సిలబస్‌ను బలోపేతం చేయడం
- ▲ పరిశ్రమలు, ఆయా సంస్థలతో చర్చిస్తూ మార్కెట్ అవసరాల మేరకు పాఠ్య ప్రణాళికను రూపొందించడం
- ▲ బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ రంగాల్లో ప్రాజెక్టు వర్క్ చేసేందుకు సదుపాయాలు కల్పించడం.
- ▲ కన్సల్టెన్సీ ప్రాజెక్టులు చేపట్టి వాటిని పూర్తి చేయడం



సెన్సెక్స్ ▲ 52	నిఫ్టీ ▲ 14	రూపాయి ▲ 14 పైసలు	ముడి చమురు ▼
41306	12183	71.22	66.03 (బ్రెంట్ ధర డాలర్లలో)



ఆదాయపు పన్ను తగ్గిస్తారా?

నిర్మలా సీతారామన్ రెండో బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి

దిల్లీ: రాబోయే బడ్జెట్‌లో వేతన జీవులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏమైనా వరాలు కురిపిస్తారా? ఆదాయపు పన్ను తగ్గిస్తారా? ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే ఉంది. ఫిబ్రవరి 1న ఆమె తన రెండో బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఓ వైపు ఆర్థిక మందగమనం.. మరోవైపు కార్పొరేట్ పన్ను కోతను గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో బడ్జెట్లో పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించేందుకు అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.

ఎందుకంటే..

- నిర్మలా సీతారామన్ మొదటి బడ్జెట్‌లో ఆర్థిక వ్యవస్థను మందగమనం నుంచి గట్టెక్కించే చర్యలేవీ (2019, జులై 5న) లేవనే మాట అప్పట్లో బాగా వినిపించింది. దీనికి సమాధానమో లేదంటే ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే ఉద్దేశంతోనో మొత్తానికి సెప్టెంబరులో కార్పొరేట్ పన్నును ఆమె బాగా తగ్గించారు. ఈ ఒక్క నిర్ణయంతో ఖజానాపై రూ.1.45 లక్షల కోట్ల మేర ప్రభావం పడనుంది.
- మరోవైపు 2019లో చాలా వస్తువులపై వస్తు, సేవల పన్నులను ప్రభుత్వం తగ్గించింది. స్థిరాస్తి, విద్యుత్ వాహనాలు, హాస్టల్ వసతి, వజ్రాల తయారీ, అవుట్‌డోర్ కేటరింగ్ లాంటివి ఇందులో ఉన్నాయి.
- జీఎస్‌టీ, కార్పొరేట్ పన్నును తగ్గించడం, ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో వినియోగం నెమ్మదించడంతో పన్నుల వసూళ్లపై ప్రభావం పడింది. దీంతో ఆదాయ లక్ష్యాలను సాధించడం ప్రభుత్వానికి కష్టతరంగా మారింది.

అయితే ఈ విషయాలపై పెద్దగా ఆలోచన చేయని సామాన్య ప్రజలు మోదీ 2.0 ప్రభుత్వం తమకు కూడా పన్నుల వరాలు ప్రకటిస్తుందనే ఆశతో ఉన్నారు.

మాకూ తగ్గించరా?

కార్పొరేట్లకు కార్పొరేట్ పన్ను, అంకురాలకు ఏంజెల్ ట్యాక్స్, వ్యాపారులకు జీఎస్‌టీ, విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు సర్‌ఛార్జీ విధించి మళ్లీ ఉపసంహరించుకోవడం... ఇలా అందరికీ ప్రోత్సాహకాలు అందించినప్పుడు తమకు కూడా పన్ను తగ్గిస్తే బావుంటుదని వేతన జీవులు కోరుకుంటున్నారు. గత బడ్జెట్లో సంవత్సరానికి రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి పన్ను చెల్లించనక్కర్లేదనే ప్రతిపాదన చేశారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను ఏడాదికి రూ.40,000 నుంచి రూ.50,000కి పెంచారు. ఇప్పుడు మరిన్ని ప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుత మందగమన పరిస్థితులు, ఇప్పటికే తగ్గించిన పన్నులతో ఆదాయంపై పడుతోన్న భారాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వం వేతనజీవులకు పన్నులు తగ్గించకపోవచ్చనే అభిప్రాయమే ఎక్కువగా వినిపిస్తోంది. అదే సమయంలో వినియోగం నెమ్మదించినందున ఆదాయపు పన్ను తగ్గిస్తే మరింత డబ్బు వ్యవస్థలోకి వచ్చి వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో పన్ను కోత దిశగా కూడా నిర్ణయం తీసుకోవచ్చని మరికొందరు అంటారు. చూడాలి మరి.. నిర్మలా సీతారామన్ మొగ్గు ఎటు వైపోనని.




ముగింపు మెరుపులు

- డిసెంబరులో పెరిగిన వాహన విక్రయాలు
- రాణించిన మారుతీ, మహీంద్రా

దిల్లీ: గత ఏడాది చివర్లో వాహన విక్రయాలు కొద్దిగా పుంజుకున్నాయి. డిసెంబరు దేశీయ అమ్మకాల్లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రాలు వృద్ధిని నమోదు చేయగలిగాయి. హ్యుందాయ్, టయోటా, హోండా, టాటా మోటార్స్ మాత్రం నిరాశపరిచాయి. మారుతీ సుజుకీ దేశీయ అమ్మకాలు 1,21,479 నుంచి 2.4 శాతం వృద్ధి చెంది 1,24,375కు చేరాయి. వ్యాగన్‌ఆర్, సెలెరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ వంటి కాంపాక్ట్ కార్ల అమ్మకాలు 51,346 నుంచి 27.9 శాతం పెరిగి 65,673కు చేరాయి. ఎర్టిగా, ఎస్-క్రాస్, బ్రెజా వంటి యుటిలిటీ విభాగం విక్రయాలు 20,225 నుంచి 17.7 శాతం పెరిగి 23,808కు చేరాయి. ఇక ఆల్టోతో కూడిన చిన్న కార్ల విభాగం అమ్మకాలు 13.6 శాతం తగ్గాయి. మహీంద్రా అమ్మకాలు 36,690 నుంచి 1 శాతం వృద్ధితో 37,081కు పెరిగాయి. హ్యుందాయ్ మోటార్ విక్రయాలు సైతం 9.8% తగ్గి 42,093 నుంచి 37,953కు చేరాయి. డిసెంబరులో ఎంజీ మోటార్ 3,021 కార్లు విక్రయించింది. వివిధ కంపెనీల విక్రయాల గణాంకాలు పట్టికలో..

డిసెంబరులో వాహన విక్రయాలు

సంస్థ	2019	2018	వృద్ధి/ (క్షీణత)
మారుతీ సుజుకీ	1,24,375	1,21,479	2.4
హ్యుందాయ్ మోటార్	50,135	55,638	(9.9)
మహీంద్రా అండ్ మహీంద్రా	37,081	36,690	1
టయోటా కిర్లోస్కర్	7,769	12,489	(38)
హోండా కార్స్	8,412	13,139	(36)
టాటా మోటార్స్	44,254	50,440	(12)
ఎంజీ మోటార్	3,021	-----	--
వాణిజ్య			
మహీంద్రా ట్రాక్టర్స్	17,990	17,404	3
వీఈ కమర్షియల్	5,042	6,236	(19.1)



శుభారంభం

స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు



కొత్త ఏడాది స్టాక్ మార్కెట్లకు శుభారంభాన్నిచ్చింది. సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీల్లోని ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ షేర్లు పెరగడంతో సెన్సెక్స్ 52 పాయింట్లు, నిఫ్టీ 14 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లు పని చేయకపోవడంతో అక్కడి నుంచి మన మార్కెట్లకు ఎలాంటి సంకేతాలు అందలేదు. 2019 సెప్టెంబరు త్రైమాసికానికి వాణిజ్య లోటు తగ్గుముఖం పట్టడంతో కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) జీడీపీలో 0.9 శాతానికి పరిమితం కావొచ్చన్న అంచనాతో మార్కెట్ సెంటిమెంటు సానుకూలంగా మారింది. మౌలిక ప్రాజెక్టులపై రూ.102 లక్షల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయబోతోందన్న వార్త కూడా కలిసొచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 14 పైసలు లాభపడి 71.22 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 41,349.36 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. వెంటనే 41,443.52 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసిన సూచీ తర్వాత విక్రయాల ఒత్తిడికి లోనైంది. ఒక దశలో 41,251.18 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 52.28 పాయింట్ల లాభంతో 41,306.02 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 14.05 పాయింట్ల లాభంతో 12,182.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 12,222.20-12,165.30 పాయింట్ల మధ్య కదలాడింది.

మార్కెట్ సమీక్ష

సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 2.76%, ఎన్‌టీపీసీ 2.06%, ఎంఅండ్ఎం 0.97%, ఎల్‌అండ్‌టీ 0.86%, హెచ్‌డీఎఫ్‌సీ 0.84%, ఇన్ఫోసిస్ 0.70%, హెచ్‌యూఎల్ 0.70%, హెచ్‌యూఎల్ 0.70%, హెచ్‌సీఎల్ టెక్ 0.63%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.57% చొప్పున లాభపడ్డాయి. టైటన్ 2.76%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.72%, బజాజ్ ఆటో 1.21%, ఓఎన్‌జీసీ 1.05%, టాటా స్టీల్ 0.90%, మారుతీ సుజుకీ 0.75%, యాక్సిస్ బ్యాంక్ 0.68%, కోటక్ బ్యాంక్ 0.59%, భారతీ ఎయిర్‌టెల్ 0.55% మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఔషధ రంగాలు లాభపడ్డాయి. వాహన, లోహ, ఆర్థిక రంగాలు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 1,363 షేర్లు సానుకూలంగా, 1,068 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 190 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

నేటి మార్కెట్

సూచీలు సానుకూలంగా కదలాడే అవకాశం ఉంది. కొత్త ఏడాది సెలవుల అనంతరం విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు నేడు షేర్ల కొనుగోళ్లకు దిగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనాతో తొలి దశ వాణిజ్య ఒప్పందంపై ఈ నెల 15న సంతకాలు చేస్తామని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం కలిసొచ్చే అంశం. చాలా వరకు ఆసియా, ఐరోపా మార్కెట్లు బుధవారం పని చేయలేదు. దీంతో నేడు కొనుగోళ్లు ఊపందుకోవచ్చని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. నిఫ్టీ-50 సూచీకి 12,100-12,118 పాయింట్ల వద్ద మద్దతు, 12,200-12,247 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు అగ్ర శ్రేణి 100 కంపెనీలనే పెద్ద స్థాయి కంపెనీలుగా సెబీ గుర్తిస్తోంది. తాజాగా 150 కంపెనీలను లార్జ్ క్యాప్ సంస్థలుగా గుర్తించే అవకాశం ఉందని సమాచారం వస్తుండటంతో ఎంపిక చేసిన మధ్య, చిన్న స్థాయి షేర్లలో కొనుగోళ్లకు అవకాశం ఉండొచ్చు. మార్కెట్ విలువ పరంగా అగ్రశ్రేణి 151-300 కంపెనీలను ఇకపై మధ్య స్థాయి కంపెనీలుగా మార్కెట్ల నియంత్రణ సంస్థ గుర్తించే అవకాశం ఉందని సమాచారం. డిసెంబరు నెల వాహన గణాంకాలు విడుదలవడంతో ఆయా కంపెనీల షేర్లపై మదుపర్లు దృష్టి సారించొచ్చు.



కోడిగుడ్లు — 1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	464	వరంగల్	467
2వ తేదీకి		విశాఖపట్నం	487
విజయవాడ	474	చిత్తూరు	488
గోదావరి	474	చిల్లరగా (డజను)	72

వైద్య పర్యాటకానికి పెద్దపీట

అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఎండీ సంగీతారెడ్డి



అపోలో హాస్పిటల్స్ సమీప భవిష్యత్తులో వైద్య పర్యాటకంపై ప్రధానంగా దృష్టి సారించనుంది. అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఎండీ సంగీతారెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే తమ సంస్థలో అంతర్జాతీయ రోగుల విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు, గత ఏడాదిలో ఈ విభాగం 2 లక్షల మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్ గ్రూపు ఆదాయంలో ఈ విభాగం వాటా క్రమేణా పెరుగుతున్నట్లు చెప్పారు. మనదేశంలో వైద్య పర్యాటకం ఇంకా శైశవ దశలోనే ఉంది, కానీ ఈ విభాగంలో ఎంతో అభివృద్ధి సాధించే అవకాశం కనిపిస్తోంది- అన్నారామె.

వైద్య సేవల నిమిత్తం మనదేశానికి వచ్చే అంతర్జాతీయ రోగుల్లో ప్రధానంగా కేన్సర్, గుండె జబ్బులు, నరాల వ్యాధులతో బాధపడే వారు అధికంగా ఉంటున్నట్లు, ఇంకా అవయవ మార్పిడి కోసం కూడా ఎక్కువ మంది వస్తున్నారని తెలిపారు. విదేశాల నుంచి అపోలో హాస్పిటల్స్‌కు చికిత్స నిమిత్తం వస్తున్న వారిలో పసిఫిక్ ఐల్యాండ్స్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, ఇరాక్, కెన్యా, నైజీరియా, ఇథియోపియా, ఒమన్, యెమెన్, శ్రీలంక, ఉజ్బెకిస్తాన్, మ్యాన్మార్, నేపాల్ దేశాలకు చెందిన వారు అధికంగా ఉంటున్నట్లు వివరించారు. ఈ తరహా సేవలు విస్తరించే కొద్దీ మరెన్నో దేశాల నుంచి రోగులను మనదేశం ఆకర్షించగలదని పేర్కొన్నారు.

కొన్ని అవరోధాలు, ఇబ్బందులను ప్రభుత్వం తొలగిస్తే వైద్య పర్యాటకం మనదేశంలో బహుముఖంగా విస్తరిస్తుందని సంగీతారెడ్డి అభిప్రాయపడ్డారు. వీసా నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేసిందని పేర్కొంటూ, అదేవిధంగా వైద్య పర్యాటకులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల ప్రక్రియను సరళీకృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే విధంగా 'వీసా ఆన్ అరైవల్' సదుపాయాన్ని విస్తరించాలన్నారు. మరోపక్క చౌకగా వైద్య సేవలను అందించటంలో మనదేశానికి ఉన్న సత్తాను ప్రపంచ వ్యాప్తంగా చాటుకోవలసిన అవసరం ఉందని, అందుకు ప్రభుత్వం చేయూత నివ్వాలని సూచించారు.

అందుబాటు ధర ఇళ్లకే గిరాకీ

ఈ జులై నుంచి స్థిరాస్తి వ్యాపారం రాణింపు • నిర్మాణ సంస్థల అంచనా

దిల్లీ: ద్రవ్యలభ్యత - రుణాలకు కొరత, పెట్టుబడి పెట్టాలనే ఉత్సుకత లేకపోవడం.. వెరసి గతేడాది స్థిరాస్తి రంగం మందగమనంలో నడిచింది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సంస్కరణలతో, ఈ ఏడాది ద్వితీయార్థంలో స్థిరాస్తి రంగం రాణించవచ్చని అనరాక్ ప్రోపర్టీ కన్సల్టెంట్స్, జేఎల్ఎల్ ప్రోపర్టీ కన్సల్టెంట్స్ అంచనా వేస్తున్నాయి.

2019లో అధికకాలం పాటు స్థిరాస్తి వృద్ధి నెమ్మదించింది. ఇందులో ప్రధానపాత్ర గృహనిర్మాణ రంగానిదే. వాణిజ్య నిర్మాణరంగం మాత్రం దూసుకెళ్లింది. 2020 ప్రథమార్థంలోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని, ద్వితీయార్థంలో పురోగమించవచ్చని భావిస్తున్నారు. కొనుగోలుదార్లు, పెట్టుబడిదార్లు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నందునే, ఈ ఏడాది ప్రథమార్థంలో గృహనిర్మాణ రంగంలో స్తబ్దత కొనసాగవచ్చని అనరాక్ ప్రోపర్టీ కన్సల్టెంట్స్ ఛైర్మన్ అనుజ్‌పురి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు తగిన ధరకు, నాణ్యమైన నిర్మాణాలు ఇవ్వగలిగితే గృహనిర్మాణ రంగం పురోగమిస్తుందని అభిప్రాయ పడ్డారు. అందుబాటు ధర గృహాలే స్థిరాస్తి విపణికి కీలకమని, హైదరాబాద్, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె నగరాలలోని కొత్త ప్రాజెక్టుల్లోనూ ఇవే 40 శాతం వాటా కలిగి ఉన్నాయని తెలిపారు. దేశంలో వాణిజ్య నిర్మాణాలకు గిరాకీ బాగా ఉంటుందని జేఎల్ఎల్ ప్రోపర్టీ కన్సల్టెంట్స్ వివరించింది.

విలాసవంత నిర్మాణాల్లో ఇబ్బంది ఇదే

మధ్యశ్రేణి, విలాసవంత గృహ నిర్మాణానికి వస్తే, వీటి కోసం ముందస్తుగా చెల్లించాల్సిన మొత్తం అధికంగా ఉంటోంది. నెలవారీ వాయిదాల్లో కట్టాల్సిన మొత్తమూ ఎక్కువే. ఈ నిర్మాణాలు ఆలస్యమైతే, కొనుగోలుదార్లపై అధిక భారం పడుతోందని, దేశంలోని పలు ప్రాంతాల్లో ఇదే సమస్యగా మారిందని వివరించింది.



గృహ నిర్మాణ రంగం ఇలా

- 4-5 శాతం: 2019లో గృహనిర్మాణ వృద్ధి
- 40 శాతం: కొత్త ప్రాజెక్టుల్లో అందుబాటు గృహాల వాటా
- 6,60,000: విక్రయం కాని ఫ్లాట్లు/ఇళ్లు

వాణిజ్య నిర్మాణాలు భళా

11 శాతం: 2018తో 2019లో వృద్ధి
13 శాతం: 2020లో వృద్ధి అంచనా
43.3 మిలియన్ చదరపు అడుగులు: కార్యాలయ స్థలాల లభ్యత

మాల్యా చరాస్తులను బాకీ కింద జమ కట్టుకోండి


బ్యాంకులకు ప్రత్యేక కోర్టు అనుమతి



దిల్లీ: విజయ్ మాల్యా చెల్లించాల్సిన బకాయిల వసూళ్ల కోసం ఆయన చరాస్తులు ఉపయోగించుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 15 బ్యాంకుల బృందానికి ప్రత్యేక కోర్టు అనుమతినిచ్చింది. ఈ ఆస్తుల్లో యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్) షేర్లు లాంటివి ఉన్నాయి. మాల్యాను 2016లో అపరాధిగా ప్రకటించినపుడు మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ ఆస్తులను జప్తు చేశారు. ఒక వ్యక్తి తప్పించుకొని పారిపోయాడనో లేదంటే అరెస్టు వారెంట్‌ను ఉల్లంఘించాడనో భావిస్తే ఆ వ్యక్తికి వారెంట్ జారీ చేస్తారు. అలా వారెంటు జారీ చేసిన వ్యక్తిని అపరాధిగా (ప్రొక్లెయిమ్డ్ అఫెండర్) ప్రకటిస్తారు. మాల్యా చెల్లించాల్సిన రుణాల వసూలు నిమిత్తం ఆయన చరాస్తులను ఉపయోగించుకునేందుకు అనుమతినివ్వాలని ప్రత్యేక కోర్టుకు బ్యాంకుల బృందం దరఖాస్తు చేసుకుంది. ఆస్తులను జప్తు నుంచి బయటకు ఇచ్చేందుకు ప్రత్యేక కోర్టు మంగళవారం అనుమతినిచ్చిందని బ్యాంకుల బృందం తరపు న్యాయవాది తెలిపారు. మాల్యా తరపు న్యాయవాది మాట్లాడుతూ.. కేవలం యూబీహెచ్ఎల్ షేర్లను వాడుకునేందుకే కోర్టు అనుమతినిచ్చిందని తెలిపారు.

ఈ నెల కొత్త శిఖరాలే

- సానుకూలతలు కనిపిస్తున్నాయ్
- నిఫ్టీ 12,500కు చేరొచ్చు
- చిన్న, మధ్య షేర్లను పరిశీలించొచ్చు
- విశ్లేషకుల సగటు అంచనాలు



కొత్త సంవత్సరంలో తొలి నెలలో కొత్త గరిష్ఠ స్థాయిలు ఖాయమని విశ్లేషకులు అంటున్నారు. నిఫ్టీ-50 జనవరిలో 12,500 పాయింట్లకు చేరవచ్చని 29 బ్రోకరేజీ సంస్థల సగటు అంచనాగా ఉంది. వార్తా సంస్థ కోజెన్సిస్ నిర్వహించిన సర్వే ప్రకారం.. జనవరిలో మదుపర్లు భారీ స్థాయి షేర్లపై దృష్టి సారించే అవకాశం ఉంది. అయితే ఫిబ్రవరి 1న జరగబోయే బడ్జెట్ రీత్యా మధ్య, చిన్న స్థాయి షేర్లలో మంచి విలువైన వాటినీ పరిగణనలోకి తీసుకోవచ్చని తెలుస్తోంది.

మొత్తం మీద జనవరిలో స్టాక్‌మార్కెట్ సానుకూలంగా కనిపిస్తోంది. మొత్తం 29 బ్రోకరేజీల్లో కేవలం ఏడు మాత్రమే నిఫ్టీ-50 సూచీ 12,000 పాయింట్ల స్థాయి కిందకు చేరొచ్చని అంచనా వేశాయి. డిసెంబరు 20న నిఫ్టీ రికార్డు గరిష్ఠమైన 12,293.90 స్థాయికి చేరిన విషయం తెలిసిందే.

సానుకూలతలకు ఇవీ కారణాలు..

- వినియోగం పెంచడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు, వ్యయాలు దేశీయ ఆర్థిక వృద్ధిపైన సానుకూల ప్రభావం చూపుతాయన్న అంచనాలు ఉన్నాయి.
- దేశీయ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ.. దేశీయ, విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లను కొనసాగిస్తుండడం.. సూచీలకు మద్దతునిచ్చే అంశమని సీడీ ఈక్విసెర్చ్ అధిపతి కిషన్‌గుప్తా అంటున్నారు.
- 2019లో విదేశీ మదుపర్లు 14.5 బిలియన్ డాలర్ల కొనుగోళ్లు చేయగా.. దేశీయ మదుపర్లు రూ.52565 కోట్ల మేర కొన్నారు.

12,500కు అవకాశం..

12400-12,700 స్థాయిలకు నిఫ్టీ చేరొచ్చని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. 11700-12000 వద్ద మద్దతు లభించవచ్చని సర్వేలో తేలింది. 29 బ్రోకరేజీల్లో 12 మాత్రం 12,500 స్థాయికి చేరొచ్చని చెబుతున్నారు. డిసెంబరు ముగింపుతో పోలిస్తే ఇది 3 శాతం అధికం. మరో అయిదు మంది మాత్రం 4 శాతం వరకు లాభాలు ఉండొచ్చని ఆశాభావంతో ఉన్నారు. నిఫ్టీ డిసెంబరులో 1 శాతం మాత్రమే లాభమందుకుంది. అంతక్రితం మూడు నెలల్లో మాత్రం కార్పొరేట్ పన్ను కోత నేపథ్యంలో 9 శాతం వరకు పెరగడం విశేషం.

పడ్డ షేర్లపై ఆసక్తి..

బాగా నష్టపోయిన షేర్లను కొనుగోలు చేయడం మంచి వ్యూహమే అవుతుందని సునిధి సెక్యూరిటీస్ ప్రతినిధి ఒకరు అంటున్నారు. 'మధ్య, చిన్న స్థాయి షేర్లు చాలా వరకు తక్కువ స్థాయిలో చలిస్తున్నాయి. అంతక్రితం ఏడాదుల్లో భారీ స్థాయిల్లో చలించినవే ఇవి' అని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పెషాలిటీ రసాయనాలు, ఎంపిక చేసిన ఆర్థిక సేవలు, గ్యాస్ పంపిణీ విభాగం వంటి వాటిలో పెట్టుబడులు పెట్టడం మంచిదని చెబుతున్నారు. ఈ సీజనులో మంచి దిగుబడి వస్తే వినియోగం పెరుగుతుంది. అదే సమయంలో ప్రభుత్వం సరైన విధాన చర్యలు చేపడితే వృద్ధి మెరుగుపడవచ్చని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జనవరి నెలకు నిఫ్టీ-50 మద్దతు, నిరోధ స్థాయిలు

బ్రోకరేజీ సంస్థ	మద్దతు	నిరోధం
ఆదిత్య బిర్లా మనీ	12,100	12,450
అడ్రాయిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్	11,800	12,400
ఏంజెల్ బ్రోకింగ్	12,000	12,500
యాంటిక్ స్టాక్ బ్రోకింగ్	12,000	12,500
కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్	12,000	12,500
సీడీ ఈక్విసెర్చ్	12,000	12,500
దౌలత్ క్యాపిటల్ మార్కెట్	11,900	12,500

ఛాంపియన్స్



మంచు పర్వతాల నుంచి..


దిల్లీ: మంచు పర్వతాల నుంచి టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, అతని భార్య అనుష్క శర్మ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్విట్జర్లాండ్‌లో విహరిస్తోన్న విరుష్క జోడీ అభిమానులను ఉద్దేశించి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టింది. "మా తరపు నుంచి మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. మిమ్మల్ని దేవుడు చల్లగా చూడు గాక" అనే వ్యాఖ్యతో కోహ్లి ట్విట్టర్‌లో వీడియో పోస్టు చేశాడు. ఆ వీడియోలో ఈ జంట.. "మేం అందమైన ప్రదేశంలో ఉన్నాం. మీ కోసం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్నాం. మీ అందరికీ 2019 గొప్పగా సాగిందని అనుకుంటున్నాం. 2020 మరింత ఉత్తమంగా ఉండాలని కోరుకుంటున్నాం" అని పేర్కొంది.

అతను కానీ ఎత్తు వేశాడంటే..

ఆరేళ్ల ముందు సంగతి. విశ్వనాథన్ ఆనంద్ అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్. ఆరోసారి టైటిల్ కోసం బరిలోకి దిగాడీ దిగ్గజ క్రీడాకారుడు. ఆనంద్ అనుభవమంత లేదు ప్రత్యర్థి వయసు! అతను ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తలపడుతోంది తొలిసారి. మ్యాచ్‌లో ఆ కుర్రాడిని ఎదుర్కోవడానికి ఆనంద్ తంటాలు పడుతుంటే.. డ్రా చేసుకోవడమే గగనం అన్నట్లుగా ఆడుతుంటే.. అభిమానులకు చాలా కష్టంగా అనిపించింది! చివరి అతడికి ఆనంద్ టైటిల్ కోల్పోతుంటే.. ఆనంద్ అభిమానుల అహం దెబ్బ తింది. తర్వాతి ఏడాది మళ్లీ ఆనంద్.. అదే ప్రత్యర్థికి తలవంచితే తల కొట్టేసినట్లయింది!

కానీ తర్వాత అంతర్జాతీయ చెస్‌లో ఆ కుర్రాడి ఆధిపత్యం.. అప్రతిహత విజయాలు చూశాక.. అప్పటి ఆనంద్ ఓటములు ఎంతమాత్రం అవమానకరం కాదని, అతను ఓడింది ప్రపంచ చెస్ చరిత్రలోనే ఒక మహా మేధావి చేతుల్లో అని అందరికీ అర్థమైంది!

ఆ మహా మేధావి పేరు.. మాగ్నస్ కార్ల్‌సన్! ప్రస్తుతం క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్.. ఈ మూడు రకాల చెస్‌లోనూ ఇతగాడే ప్రపంచ ఛాంపియన్!



ఈనాడు క్రీడావిభాగం

మొన్న మన కోనేరు హంపి ర్యాపిడ్ చెస్‌లో ప్రపంచ ఛాంపియన్ అయింది. నిర్ణీత 12 రౌండ్లు ముగిసేసరికి మరో ఇద్దరితో కలిసి ఆమె సమాన పాయింట్లు సాధించింది. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా, హంపి లీ టింగ్‌జీ టైటిల్ పోరులో తలపడ్డారు. టైబ్రేక్‌లో కూడా సమమైతే విజేతను తేల్చడానికి ఆర్మగెడాన్ గేమ్ నిర్వహించాల్సి వచ్చింది. మరి పురుషుల విభాగం పరిస్థితేంటా అని చూస్తే.. సగం రౌండ్లు అయ్యేసరికే ఛాంపియన్ ఎవరో తేలిపోయింది. అందరి అంచనాలకు తగ్గట్లే మాగ్నస్ కార్ల్‌సన్ ఆధిపత్యం చలాయించాడు. అన్ని రౌండ్లూ అయ్యేసరికి ద్వితీయ స్థానంలో ఉన్న క్రీడాకారుడి కంటే అతను ఒక పాయింట్ ఆధిక్యంలో నిలిచాడు. తర్వాత బ్లిట్జ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తే.. కాస్త పోటీ ఎదురైంది కానీ.. అతడికి ఎవ్వరూ చెక్ పెట్టలేకపోయారు. అర పాయింట్ తేడాతో అతను టైటిల్ ఎగరేసుకుపోయాడు. ర్యాపిడ్‌లో అతను ప్రపంచ ఛాంపియన్ కావడం ఇది మూడోసారి కాగా.. బ్లిట్జ్‌లో ఏకంగా అయిదోసారి టైటిల్ సాధించాడు. ఇక చెస్‌లో అత్యున్నతమైన క్లాసికల్ విభాగంలో అతను నాలుగుసార్లు ఛాంపియన్. 2013లో 22 ఏళ్ల వయసులోనే దిగ్గజ క్రీడాకారుడు ఆనంద్‌ను ఓడించి తొలిసారి ప్రపంచ ఛాంపియన్ అయిన అతను.. తర్వాతి నాలుగేళ్లలో మరో మూడు టైటిళ్లు సొంతం చేసుకున్నాడు. మూడు విభాగాల్లో కలిపి 12 ప్రపంచ టైటిళ్లతో తనకు తానే సాటి అనిపిస్తున్నాడు. అంతకంతకూ కార్ల్‌సన్ జోరు పెరుగుతోందే తప్ప తగ్గట్లేదు. ప్రత్యర్థులు బలహీన పడుతుంటే.. అతనేమో మరింత బలం పుంజుకుంటున్నాడు. కార్ల్‌సన్ ఏదైనా టోర్నీలో టైటిల్ గెలవకపోతే షాకవుతున్నారు తప్ప.. అతడి ఏ విజయమూ ఆశ్చర్యానికి గురి చేయడం లేదు. ఒకే సమయంలో క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ మూడు విభాగాల్లోనూ ఛాంపియన్‌గా నిలవడం అతడికే చెల్లింది. బాబీ ఫిషర్, అనతోలి కార్పోవ్, గ్యారీ కాస్పరోవ్, విశ్వనాథన్ ఆనంద్.. ఇలా ఎందరో మేధావుల్ని చూసింది చెస్ ప్రపంచం. ఆయా సమయాల్లో వాళ్లను మించిన చెస్ ఛాంపియన్లు లేరనిపించి ఉంటుంది అభిమానులకు. కానీ కార్ల్‌సన్ వాళ్లందరినీ మించిన వాడని అతడి విజయాలు, గణాంకాలు చాటి చెబుతాయి. ఏ ఛాంపియన్‌తో పోల్చినా.. అతడి ఆట ప్రత్యేకం.. అతడి వ్యూహాలు రహస్యం.. అతడి వ్యక్తిత్వం అనూహ్యం! తొమ్మిదేళ్లకే జాతీయ ఛాంపియన్.. 12 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్.. 19 ఏళ్లకే ప్రపంచ నంబర్‌వన్.. 22 ఏళ్లకే ప్రపంచ ఛాంపియన్.. చరిత్రలో ఏ క్రీడాకారుడూ అందుకోని ఎలో రేటింగ్.. 12 ప్రపంచ టైటిళ్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే కార్ల్‌సన్ ఘనతలెన్నో!

దేశంలో సగం మంది చెస్‌లోనే..

కార్ల్‌సన్ సొంత దేశం నార్వేలో చెస్‌కు ఎప్పట్నుంచో ఆదరణ ఉంది. అయితే దానికి విశేషమైన ఆదరణ తెచ్చి.. ప్రతి కుటుంబంలోనూ చెస్ క్రీడాకారులు తయారయ్యేలా చేసిన ఘనత మాత్రం మాగ్నస్‌దే. 55 లక్షల జనాభా ఉండే ఆ దేశంలో సగం మందికి చెస్‌తో పరిచయం ఉందిప్పుడు. ఇప్పుడు దేశంలో ప్రతి పిల్లాడు చెస్ ఓనమాలు నేర్చుకుంటున్నాడు. యువతకూ చెస్ పిచ్చి పట్టుకుంది. పెద్దవాళ్లూ ఈ ఆటను అనుసరిస్తున్నారు. కార్ల్‌సన్ తెచ్చిన ఊపుతో దేశంలో చెస్ ఉపకరణాలు అమ్మే దుకాణాలు, చెస్ థీమ్స్‌తో బార్లు పెద్ద ఎత్తున ఏర్పాటు కావడం విశేషం.

అతనంతే అదో టైపు

ఆటలోనే కాదు.. బయటా కార్ల్‌సన్ విలక్షణం. అతడి తీరు ఎవరికీ అంతుబట్టదు. సాధారణంగా ఓపెనింగ్ విషయంలో కొన్ని రకాల శైలిలుంటాయి. ఒక ఎత్తును బట్టి తర్వాతి ఆటనంతటినీ అంచనా వేయొచ్చు. కానీ కార్ల్‌సన్ ఈ ఒరవడిని మార్చాడు. ఒక శైలికి కట్టుబడకుండా ఓపెనింగ్‌లో చిత్రమైన ఎత్తులు వేసి.. గేమ్‌లను ఎక్కడెక్కడికో తీసుకెళ్లడం అతడికలవాటు. దీని వల్ల కార్ల్‌సన్‌తో గేమ్‌లకు సన్నద్ధం కావడం ప్రత్యర్థులకు సవాలుగా మారింది. కంప్యూటర్లు కూడా మాగ్నస్ ఆటను సరిగా విశ్లేషించలేని స్థితిలో అతడితో మ్యాచ్‌లకు వాటి ప్రాధాన్యం పెద్దగా ఉండట్లేదు. గత ఏడాది కరువానాతో ప్రపంచ ఛాంపియన్‌షిప్ సందర్భంగా కార్ల్‌సన్ ఆటతీరుపై కొన్ని విమర్శలొచ్చాయి. 12కు 12 గేమ్‌లనూ డ్రా చేసుకున్నాడతను. చివరి గేమ్‌లో విజయావకాశాలు బాగానే ఉన్నప్పటికీ.. 31 ఎత్తుకే అతను డ్రాకు ప్రతిపాదించడాన్ని ఒకప్పటి కార్ల్‌సన్ గురువు, దిగ్గజ క్రీడాకారుడు కాస్పరోవ్‌తో పాటు మరో దిగ్గజ క్రీడాకారుడు క్రామ్నిక్ కూడా తప్పుబట్టారు. అయితే ర్యాపిడ్‌లో తనకున్న పట్టును దృష్టిలో ఉంచుకుని అతను టైబ్రేక్‌లో అతడి సంగతి చూసుకుందామనుకున్నాడు. అందులో వరుసగా మూడు గేమ్‌లు గెలిచి కరువానాకు చెక్ పెట్టేశాడు. ఈ సందర్భంగా "తమ తెలివి తక్కువ అభిప్రాయాల్ని వెల్లడించే స్వేచ్ఛ కాస్పరోవ్, క్రామ్నిక్‌లకు ఉంది" అంటూ కార్ల్‌సన్ దిగ్గజాలిద్దరికీ పంచ్ విసరడం విశేషం. అందుకే కార్ల్‌సన్‌తో పెట్టుకోవడానికి పెద్ద పెద్ద క్రీడాకారులు కూడా జంకుతారు. ఇక చెస్‌లో ఉన్నంతసేపూ ఎంతగా అందులో నిమగ్నం అవుతాడో.. దాన్నుంచి బయటికి వస్తే మరో మనిషిలా కనిపిస్తాడు కార్ల్‌సన్. మిగతా చెస్ క్రీడాకారులకు భిన్నంగా దృఢమైన దేహంతో, సిక్స్ ప్యాక్‌తో కనిపించడం కార్ల్‌సన్‌కే చెల్లింది. ఫుట్‌బాల్, బీచ్ వాలీబాల్, టెన్నిస్, రాక్ క్లైంబింగ్, స్విమ్మింగ్, ఐస్ స్కేటింగ్, గోల్ఫ్.. తీరిక వేళల్లో ఇలా అతనెన్నో ఆటలాడతాడు. పెద్ద టోర్నీల్లో తలపడ్డాక చివరి గేమ్ అవ్వగానే వెళ్లి దుస్తులతోనే వెళ్లి స్విమ్మింగ్ పూల్‌లో దూకడం.. నేరుగా ఫుట్‌బాల్ మైదానంలోకి వెళ్లి ఆ ఆటలో సేదదీరడం కార్ల్‌సన్ విలక్షణతను చాటి చెబుతాయి.

హార్దిక్ ప్రణయ ప్రయాణం



దుబాయి

టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య బ్యాటింగ్‌లో ప్రదర్శించే దూకుడును.. ప్రేమలోనూ చూపిస్తున్నాడు. తన ప్రేయసి అంటూ బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను పరిచయం చేసి ఒక్క రోజు కూడా గడవకముందే నిశ్చితార్థం కూడా ముగించేశాడు. నూతన సంవత్సరాన్ని మరింత మధురంగా మార్చేస్తూ.. బుధవారం సముద్రం మధ్య పడవలో తన ప్రేయసికి ఉంగరం తొడిగి ఏడాదిని సరికొత్తగా మొదలెట్టాడు. ఆ విషయాన్ని అతను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకొని ఆశ్చర్యపరిచాడు. అమితాబ్ బచ్చన్ 'షాన్' సినిమాలోని హిట్టు పాట "మే తేరా, తూ మేరి జానె, సారా హిందూస్తాన్"ను ప్రస్తావిస్తూ.. నటాషాతో కలిసి ఉన్న ఫోటోను పోస్టు చేశాడు. మరోవైపు నటాషా కూడా పాండ్య మోకాళ్లపై కూర్చొని తనకు పెళ్లి ప్రతిపాదన చేస్తున్న వీడియోను పోస్టు చేసింది. సెర్బియాకు చెందిన నటాషాకు, హార్దిక్‌కు మధ్య కొంతకాలంగా ఏదో నడుస్తోందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే. చివరకు ఆ వార్తలను నిజం చేస్తూ.. బాలీవుడ్ సినీ తారలను టీమ్ ఇండియా క్రికెటర్లు పెళ్లి చేసుకునే సంప్రదాయాన్ని కొనసాగించే దిశగా పాండ్య అడుగులు వేశాడు. వెన్నునొప్పికి శస్త్రచికిత్స చేయించుకున్న పాండ్య ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఈ నెల చివర్లో ఆరంభమయ్యే న్యూజిలాండ్ పర్యటనకు అతను అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

ఛాంపియన్ ఆగమనం


ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ మహిళల విభాగంలో విజేతగా నిలిచిన తెలుగు తేజం కోనేరు హంపి.. స్వస్థలానికి చేరుకుంది. రష్యాలోని మాస్కోలో టోర్నీని ముగించుకున్న బుధవారం విజయవాడ చేరుకున్న ఆమెకు గన్నవరం విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎండీ కాటంనేని భాస్కర్, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ కుమార్, శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రమణ, రాష్ట్ర క్రీడాధికారి రామకృష్ణ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హంపి తల్లిదండ్రులు అశోక్, లత, భర్త దాసరి అన్వేష్ పాల్గొన్నారు.





చిన్నారులకు స్వర్ణ పతకాన్ని చూపిస్తున్న హంపి

ఎవరైనా ఎన్‌సీఏకు వెళ్లాల్సిందే



దిల్లీ: గాయం నుంచి కోలుకోవడానికి ప్రతి ఆటగాడూ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి వెళ్లాల్సిందేనని బీసీసీఐ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ స్పష్టం చేశాడు. ఎన్‌సీఏలో సౌకర్యాలను వాడుకోవడానికి భారత బౌలర్లు కాస్త సందేహిస్తుండడంపై అడిగినప్పుడు.. 'నేను రాహుల్ ద్రవిడ్‌ను కలిశాను. ఎన్‌సీఏలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేశాం. బౌలర్లు ఎన్‌సీఏకు వెళ్లాల్సిందే. ఎవరైనా వాళ్లకు చికిత్స చేయాలనుకుంటే ఎన్‌సీఏకు వెళ్లాలి" అని గంగూలీ చెప్పాడు. బౌలర్ల ఇబ్బంది ఎన్‌సీఏ శిక్షణ సిబ్బందితోనా లేదా అక్కడి సౌకర్యాలతోనా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. ''కారణమేదైనా మేం అన్నింటినీ సర్దుబాటు చేస్తాం. ఆటగాళ్లు సౌకర్యంగా ఉండేలా చూస్తాం" అని అన్నాడు. అత్యాధునిక సౌకర్యాలతో కొత్త స్థలంలో ఎన్‌సీఏ నిర్మాణం త్వరలో ఆరంభిస్తామని తెలిపాడు.

నాలుగు దేశాల టోర్నీపై..: ప్రతిపాదిత నాలుగు దేశాల టోర్నమెంట్‌కు ఐసీసీ, ప్రసారదారు నుంచి అనుమతి రావాల్సివుందని గంగూలీ చెప్పాడు. భవిష్య పర్యటన ప్రణాళిక (ఎఫ్‌టీపీ)లో ఎక్కడ ఖాళీ ఉందో కూడా చూడాలని అన్నాడు. "నాణ్యమైన క్రికెట్‌ను అందించాలన్నది మా ఉద్దేశం. ప్రస్తుతం కేవలం ద్వైపాక్షిక సిరీస్‌లు మాత్రమే జరుగుతున్నాయి. జనం ఓ అత్యున్నత స్థాయి టోర్నమెంట్‌ను చూడాలనుకుంటున్నారు. దాని కోసమే మేం ప్రయత్నిస్తున్నాం. పింక్ బాల్ టెస్టు కూడా స్టేడియాలకు జనాన్ని రప్పించాలన్న ప్రయత్నంలో భాగమే" అని గంగూలీ చెప్పాడు. నాలుగు దేశాల టోర్నీలో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లు మూడు జట్లు కాగా.. మరో జట్టును ఎంచుకోవాల్సివుంది. దాని కోసం ప్రయత్నం జరుగుతోందని, బలమైన జట్టును ఎంచుకుంటామని గంగూలీ చెప్పాడు. ఆస్ట్రేలియాలో వార్షిక బాక్సింగ్ డే టెస్టుకు జనం నుంచి భారీ స్పందన లభిస్తున్న నేపథ్యంలో భారత్‌కూ అలా ఓ టెస్టు ఉండాలన్న అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా అన్న ప్రశ్నకు "ఆ దిశగా పని చేయాల్సివుంది. అప్పుడు ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. అదే న్యూజిలాండ్.. ఆస్ట్రేలియాతో ఎక్కడో, మరేదో రోజు ఆడితే అంత ఆసక్తి కలగకపోవచ్చు. కానీ బాక్సింగ్ డే జనాన్ని ఒక్క దగ్గరికి చేరుస్తుంది. కాబట్టి ఈవెంట్లు సృష్టించడం ముఖ్యం. పింక్ బాల్ టెస్టు ఒక ఈవెంట్. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా అది జరుగుతుంది. కోల్‌కతాలో జరిగింది. ముంబయి, బెంగళూరు, గుజరాత్‌లో కూడా జరుగుతుంది. దాని వల్ల ప్రేక్షకులు తిరిగి మైదానాల బాట పడతారు" అని గంగూలీ బదులిచ్చాడు.

మాకంత సంకుచితత్వం లేదు



ఇంజమామ్

కరాచి: పాకిస్థాన్‌కు ఆడే రోజుల్లో కొందరు సహచర క్రికెటర్లు మతం ఆధారంగా తన పట్ల వివక్ష చూపించారన్న డానిష్ కనేరియా ఆరోపణలను మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ ఖండించాడు. తమది అంత సంకుచిత మనస్తత్వం కాదని చెప్పాడు. కనేరియా.. ఇంజమామ్ నాయకత్వంలో కూడా ఆడాడు. "ఆ ఆరోపణలను అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను. ఒక వ్యక్తిని అంగీకరించలేనంత సంకుచిత మనస్తత్వాలు మావి కావు. మేము అలా చేయం. పాక్ ప్రజలవి చాలా పెద్ద మనసులు. మేం ప్రతి ఒక్కరినీ ఆదరిస్తాం" అని తన యూట్యూబ్ ఛానెల్‌లో ఇంజమామ్ అన్నాడు. పాకిస్థాన్ క్రికెట్లో మతానికి ఎలాంటి పాత్రా లేదని చెప్పాడు. కనేరియా దేశ భవిష్యత్తు అని జట్టు మేనేజ్‌మెంట్ భావించిందని, సక్లయిన్ కన్నా అతడికి ప్రాధాన్యమిచ్చిందని చెప్పాడు. "ఈ వివాదం గురించి వింటున్నా. కొందరు డానిష్‌ను వేరుగా చూశారని, అతడి కలిసి తినడానికి కూడా ఇష్టపడలేదన్నది ఆరోపణ. నా కెప్టెన్సీలోనే అతడు ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడు. నాకెప్పుడూ అలా అనిపించలేదు. ఏ ఆటగాడు కూడా మరో ఆటగాణ్ని ముస్లిం కాదన్న కారణంతో హీనంగా చూడలేదు. అలాంటి ఒక్క ఘటన కూడా నా దృష్టికి రాలేదు" అని ఇంజమామ్ వివరించాడు.

నాపై విమర్శల ప్రభావం ఉండదు



దిల్లీ: విమర్శలు కానీ, అంచనాల భారం కానీ తనపై ఎలాంటి ప్రభావం చూపవని ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధు అంది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాక ఫామ్ కోల్పోయిన సింధు.. అనేక టోర్నీల్లో త్వరగా నిష్క్రమించింది. గత నెలలో వరల్డ్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను కూడా నిలబెట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో సింధు మాట్లాడుతూ.. "ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బాగా ఆడా. కానీ ఆ తర్వాత అనేక టోర్నీల్లో తొలి రౌండ్లలో ఓడిపోయా. కానీ సానుకూల దృక్పథంతోనే ముందుకు సాగా. అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలవడం సాధ్యం కాదు. కొన్ని సార్లు అద్భుతంగా ఆడొచ్చు, కొన్నిసార్లు తప్పులు చేయొచ్చు" అని చెప్పింది. "తప్పుల నుంచి ఎంతో నేర్చుకున్నా. సానుకూలతతో ఉండి బలంగా పుంజుకోవడం చాలా ముఖ్యం. నాపై చాలా అంచనాలు ఉంటాయి. కానీ ఒత్తిడి, విమర్శలు నాపై ప్రభావం చూపవు. ఎందుకంటే నేను ఎప్పుడూ గెలవాలని జనం ఆశిస్తుంటారు. ఎవరికైనా అతి పెద్ద లక్ష్యం ఒలింపిక్సే. మేం టెక్నిక్, నైపుణ్యంపై దృష్టిసారించాం. అంతా ప్రణాళిక ప్రకారం జరగనుంది" అని చెప్పింది.

దశాబ్దపు వన్డే, టీ20 జట్ల కెప్టెన్ ధోని

ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో ఎంపిక



దిల్లీ: ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో దశాబ్దపు (2010-19) వన్డే, టీ20 జట్లకు మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. టెస్టు కెప్టెన్సీ విరాట్ కోహ్లీకి దక్కింది. కనీసం 50 మ్యాచ్‌లు లేదా ఆరేళ్లు ఆడడం టెస్టు జట్టుకు ఎంపికకు అర్హతగా నిర్ణయించారు. వన్డే జట్టుకు 75 మ్యాచ్‌లు, టీ20లకు 100 మ్యాచ్‌లు ఆడిన వారిని పరిగణనలోకి తీసుకుంది 23 మంది సభ్యుల సెలక్షన్ ప్యానెల్. కోహ్లి కాకుండా భారత్ నుంచి అశ్విన్‌కు మాత్రమే టెస్టు ఎలెవన్‌లో స్థానం లభించింది. ఈ దశాబ్దంలో కోహ్లి 54.97 సగటుతో 7202 పరుగులు చేయగా.. అశ్విన్ 362 వికెట్లు పడగొట్టాడు. భారత్ నుంచి ఒక్క కోహ్లి మాత్రమే మూడు ఫార్మాట్లకూ ఎంపికయ్యాడు. రోహిత్ శర్మ వన్డే ఎలెవన్‌లో.. బుమ్రా టీ20 ఎలెవన్‌లో ఉన్నారు.

భారత్‌తో టీ20లకు లంక జట్టులో మాథ్యూస్



కొలంబో: భారత్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శ్రీలంక లసిత్ మలింగ సారథ్యంలో 16 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ సుదీర్ఘ విరామం తర్వాత పొట్టి క్రికెట్లోకి పునరాగమనం చేశాడు. 32 ఏళ్ల మాథ్యూస్ చివరిసారి 2018 ఆగస్టులో టీ20 మ్యాచ్ ఆడాడు. శ్రీలంక గురువారం భారత్‌కు చేరుకుంది. తొలి టీ20 5న గువాహటిలో, రెండో టీ20 7న ఇండోర్‌లో, మూడో టీ20 10న పుణెలో జరుగుతాయి.

శ్రీలంక జట్టు: మలింగ, దనుష్క గుణతిలక, అవిష్క ఫెర్నాండో, ఏంజెలో మాథ్యూస్, దసున్ శనక, కుశాల్ పెరీరా, నిరోషన్ డిక్వెలా, ధనంజయ డిసిల్వా, ఇసుర ఉదాన, భనుక రాజపక్స, ఒషాద ఫెర్నాండో, హసరంగ, లహిరు కుమార, కుశాల్ మెండిస్, సందకన్, కసున రజిత.

జ్ఞాన నేత్రం

మూత్రపిండాల్లోకి నేరుగా జన్యువుల చేరవేత!

- సరికొత్త విధానాన్ని ఆవిష్కరించిన పరిశోధకులు



వాషింగ్టన్: మూత్రపిండ సంబంధిత వ్యాధులను ప్రభావవంతంగా అడ్డుకోగల జన్యు చికిత్సా విధానాలను అభివృద్ధి చేసే దిశగా పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. జన్యువులను సిరల ద్వారా నేరుగా మూత్రపిండాలకు చేరవేసే వ్యవస్థను ఆవిష్కరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పలు విధానాలు జన్యువులను నిర్దేశిత భాగాలకు ప్రభావవంతంగా చేర్చలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలోని 'మయో క్లినిక్' పరిశోధకులు ఔషధ సరఫరా నిమిత్తం సరికొత్త వ్యవస్థను రూపొందించారు. ఔషధాల చేరవేత కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన విభిన్న అడినో-అసోసియేటెడ్ వైరస్ (ఏఏవీ) వాహకాలను ఎలుకల మూత్రపిండాల్లోకి నూతన విధానంలో సమర్థంగా చేరవేశారు. వ్యాధుల చికిత్స, నివారణకు ఉద్దేశించిన జన్యువులను నిర్దేశిత భాగాలకు చేర్చేందుకు తమ ఆవిష్కరణ దోహదపడుతుందని పరిశోధకులు తెలిపారు.

భావోద్వేగాల నియంత్రణ గుట్టు వీడింది!



న్యూయార్క్: ఆనందం, బాధ.. పరస్పరం భిన్నమైన ఈ రెండు భావోద్వేగాలను మెదడు ఎలా నియంత్రిస్తుంది? దీర్ఘకాలంగా చిక్కుముడిగా ఉన్న ఈ ప్రశ్నకు అమెరికాలోని కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ (సీఎస్‌హెచ్‌ఎల్) పరిశోధకులతో కూడిన బృందం తాజాగా సమాధానం కనుగొంది. మెదడులో 'వెంట్రల్ పలిడీయం'గా పిలిచే నాడీ వలయం సంతోషం, బాధలను అదుపు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తాజా అధ్యయనంలో పరిశోధకులు గుర్తించారు. గాబా, గ్లుటమేట్ వంటి ప్రత్యేక సమ్మేళనాల సహాయంతో వలయంలోని నాడీకణాలు ఆ పనిని పూర్తిచేస్తున్నట్లు తేల్చారు. వెంట్రల్ పలిడియంలోని కణాలు సరిగా పనిచేయకపోవడంతో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నవారు భావోద్వేగాల నియంత్రణ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నిర్ధారించారు. కుంగుబాటు, వ్యాకులత వంటి రుగ్మతలకు సంబంధించి మరిన్ని అంశాలను తెలుసుకొని.. మెరుగైన చికిత్సా మార్గాలను అభివృద్ధి చేసేందుకు తాజా ఆవిష్కరణ దోహదపడే అవకాశముంది.

నిర్ధారణ కిట్ల కొనుగోల్‌మాల్

- ఐపీఎంలో వెలుగులోకి ఉల్లంఘనలు
- సొంత కమిటీతో తూతూమంత్రంగా టెండరు ప్రక్రియ
- పదేళ్లుగా నిబంధనలకు పాతర
- ఏటా రూ.కోటి వరకూ కొన్న వైనం
- అభివృద్ధి నిధుల నుంచి అనుమతి లేకుండా వ్యయం
- దిద్దుబాటు చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి



ఈనాడు, హైదరాబాద్: నిర్ధారణ పరీక్షల కిట్ల కొనుగోలులో నిబంధనలు ఉల్లంఘించిన వ్యవహారం మరోటి వెలుగులోకి వచ్చింది. ఐఎంఎస్(బీమా వైద్య సేవల) విభాగంలో రూ.వందల కోట్ల కుంభకోణం ఇప్పటికే సంచలనం సృష్టించగా.. అంత భారీగా కాకపోయినా స్వల్ప మొత్తాల కొనుగోళ్లలోనూ ఇదే తరహా ఉల్లంఘన జరిగినట్లు తెలుస్తోంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం)లో స్వైన్‌ఫ్లూ, నీరు, ఆహార నాణ్యతా పరీక్షల నిర్వహణకు అవసరమైన కిట్లు, రసాయనాలు, చేతి తొడుగులు, ముఖానికి మాస్కులు, తదితర వస్తువుల కొనుగోళ్లకు సంబంధించిన నిధుల వ్యయంలో నిబంధనలకు పాతరేసినట్లుగా తాజాగా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. అనుమతులు లేకుండానే ఖర్చు పెట్టినట్లుగా తేల్చారు. గత పదేళ్లుగా(ఉమ్మడి రాష్ట్రం నుంచి) ఇదే ధోరణిలో కొనసాగుతున్న ఈ వ్యవహారం వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి రావడంతో దిద్దుబాటు చర్యలపై దృష్టిపెట్టారు. ఐపీఎంకు అవసరమైన నిర్ధారణ పరీక్షల కిట్లు, వస్తువులను రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎంఎస్ఐడీసీ) ద్వారానే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఐపీఎం ఏం చేస్తుంది?

రాష్ట్రంలో ఆహార, నీటి కల్తీని నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తోంది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసినే. రాష్ట్రం మొత్తమ్మీద ప్రభుత్వ, ప్రైవేటు వైద్యంలో హెచ్1ఎన్1(స్వైన్‌ఫ్లూ) నిర్ధారణ పరీక్షలు నిర్వహించేది ఇదొక్కటే. ఈ పరీక్షల కిట్ల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.కోటి వరకు నిధులు మంజూరవుతున్నాయి. ఇక్కడ చేసే ప్రతి పరీక్షకు నిర్దిష్ట రుసుమును వసూలు చేస్తుంటారు. అలా వసూలు చేసిన మొత్తాన్ని ఐపీఎం అభివృద్ధి సంస్థ నిధుల్లో జమ చేస్తున్నారు. అలా ఇప్పటి వరకు సుమారు రూ.23 కోట్లు సంస్థ ఖాతాలో ఉన్నాయి.

ఉల్లంఘనలు ఇలా..

- వైద్య ఆరోగ్య శాఖలో ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా ఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఈ-టెండరు ప్రక్రియ నిర్వహిస్తారు. ఐపీఎంలో సొంతంగా కొనుగోలు చేయడంతో పాటు ఈ-టెండరు విధానాన్ని పాటించడం లేదు.
- కేవలం పత్రికా ప్రకటన ఇస్తూ.. వేర్వేరు విభాగాల్లో తమకు అనుకూలమైన ఉత్పత్తి సంస్థలకే టెండర్లను కట్టబెడుతున్నారనే ఆరోపణలున్నాయి.
- ఎంఎస్ఐడీసీలో ఏ విభాగంలో టెండరు నిర్వహించినా.. సంబంధిత విభాగానికి సంబంధించిన నిపుణుల కమిటీని వేర్వేరు ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నియమించి తుది నిర్ణయం తీసుకుంటుండగా.. ఐపీఎంలో పని చేస్తున్న నిపుణులు, మరికొందరు ఉద్యోగులతో కూడిన కమిటీని నియమించి టెండరుపై తుది నిర్ణయం తీసుకుంటున్నారు.
- ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు, విడుదలలో వ్యత్యాసం ఉంటుండడంతో.. సంస్థ ఖాతాలోంచి ఏటా ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.
- ఒకవేళ సర్కారు నుంచి కేటాయించిన నిధుల విడుదలలో జాప్యం ఏర్పడినా.. విడుదలైన నిధులు అవసరాలకు సరిపోకపోయినా.. అభివృద్ధి సంస్థ నిధుల నుంచి ఖర్చు చేసుకోవడానికి వెసులుబాటు ఉంది. ఇందుకు ముందస్తుగానే ప్రభుత్వ అనుమతి తీసుకోవడం తప్పనిసరి.
- 2015, 2017, 2018, 2019 సంవత్సరాల్లో స్వైన్‌ఫ్లూ కేసులు అధికంగా నమోదయ్యాయి. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఐపీఎంలో హెచ్1ఎన్1 నిర్ధారణ పరీక్షల కిట్లను పెద్దసంఖ్యలో కొనుగోలు చేశారు. కేవలం స్వైన్‌ఫ్లూ కిట్ల కొనుగోలులోనే రూ.కోట్లలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది.

వెలుగులోకి ఇలా..

- ప్రభుత్వ అనుమతి లేకుండా కొనుగోళ్లు జరిపినప్పుడు ఐపీఎం అభివృద్ధి సంస్థ పాలకమండలి సమావేశాన్ని నిర్వహించి ఆమోదముద్ర వేయించుకోవాలి. గత ఆరేళ్లుగా ఐపీఎం పాలక మండలి సమావేశమే నిర్వహించలేదు.
- రెండేళ్ల కిందట కొత్తగా సంచాలకులుగా నియమితులైన అధికారి ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి ఇటీవల తీసుకెళ్లినట్లు తెలిసింది.
- నిబంధనలు ఉల్లంఘించిన కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని కోరినట్లుగా సమాచారం.
- పదేళ్ల నుంచి ఇదే తరహాలో నిబంధనలను ఉల్లంఘించినట్లుగా తేలడంతో.. తక్షణమే ఐపీఎంలో సొంత కొనుగోళ్లు నిలిపివేయాలని ఆదేశించారు.

తెలంగాణలో 13 శాతం వృద్ధి.. ఏపీలో 11 శాతం..

జీఎస్టీ వసూళ్లపై కేంద్ర ప్రభుత్వం వెల్లడి

ఈనాడు, దిల్లీ: జీఎస్టీ వసూళ్లలో గత ఏడాది డిసెంబరు నెలకుగాను తెలంగాణలో 13 శాతం, ఏపీలో 11 శాతం వృద్ధి కనిపించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశవ్యాప్తంగా డిసెంబరు నెలలో రూ.1,03,184 కోట్ల మేరకు జీఎస్టీ వసూళ్లు జరిగినట్లు తెలిపింది. ఇందులో సీజీఎస్టీ రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్టీ 26,792 కోట్లు, ఐజీఎస్టీ రూ.48,099 కోట్లు, సెస్సు రూ.8331 కోట్లు ఉన్నట్లు వెల్లడించింది. నవంబరు నెలకు సంబంధించి డిసెంబరు 31 వరకు వచ్చిన జీఎస్టీఆర్ 3బీ రిటర్న్‌ల సంఖ్య 81.21 లక్షలని తెలిపింది. డిసెంబరు 2018తో పోలిస్తే డిసెంబరు 2019లో జీఎస్టీ వసూళ్లు 16 శాతం అధికమని పేర్కొంది. డిసెంబరు 2018లో ఆంధ్రప్రదేశ్‌లో రూ.2049 కోట్ల వసూళ్లు రాగా.. 2019 డిసెంబరులో రూ.2265 కోట్లు వచ్చాయి. తెలంగాణలో 2018 డిసెంబరులో రూ.3014 కోట్లు, 2019 డిసెంబరులో రూ.3420 కోట్ల జీఎస్టీ వసూళ్లు వచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

'హిమోక్యూ'లో ఇంటి దొంగ

- సంస్థకు సమాచారం లేకుండా అధికార పత్రం సమర్పణ
- దాని ఆధారంగానే ఐఎంఎస్ నిధుల మళ్లింపు

ఈనాడు, హైదరాబాద్: బీమా వైద్య సేవల(ఐఎంఎస్) కుంభకోణంలో భాగంగా కళ్లు చెదిరేలా జరిగిన 'లెజెండ్' డొల్ల కంపెనీ బాగోతంలో 'హిమోక్యూ' సంస్థ ఇంటి దొంగ పాత్రను అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. స్వీడన్‌కు చెందిన హిమోక్యూ సంస్థకు సంబంధం లేకుండానే తప్పుడు అధికార పత్రం సృష్టించడంలో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ వెంకటేశ్ పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. కుంభకోణంలో కీలక నిందితుడైన ఓమ్ని మెడి సంస్థ యజమాని కంచర్ల శ్రీహరిబాబు అలియాస్ బాబ్జీతో కలిసి వెంకటేశ్ ఈ కుట్ర పన్నినట్లు అనిశా అధికారులు తాజాగా గుర్తించారు. 2017లో హిమోక్యూ ఏరియా మేనేజర్‌గా పనిచేసినప్పటి నుంచే వెంకటేశ్ ఈ కుట్రలో పాలుపంచుకున్నట్లు తెలిసింది. శరీరంలో తెల్ల రక్తకణాల సంఖ్య, గ్లూకోజ్ స్థాయిని నిర్ధారించే పరీక్ష కిట్ల సరఫరా వ్యవహారంలో హిమోక్యూ సంస్థ తరఫున తెలంగాణవ్యాప్తంగా అధీకృత పంపిణీదారు లెజెండ్ సంస్థ మాత్రమే అనేది ఆ తప్పుడు పత్రం సారాంశం. దాని ఆధారంగానే ఐఎంఎస్ సంస్థ సంచాలకురాలు(సస్పెన్షన్) దేవికారాణి, సంయుక్త సంచాలకురాలు(సస్పెన్షన్) పద్మ.. లెజెండ్ సంస్థకు పరీక్ష కిట్ల సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టారు. బాబ్జీ చేసిన కుట్రలో భాగంగా కృపాసాగర్‌రెడ్డి పేరిట సృష్టించిన లెజెండ్ సంస్థకు ఐఎంఎస్ నుంచి నిధుల్ని అక్రమంగా మళ్లించారు. రూ.11,800 విలువ గల ఒక్కో కిట్‌ను రూ.36,800లకు కొన్నట్లు రికార్డులు సృష్టించడంతోపాటు అసలు కొనకుండానూ రికార్డుల్ని ఏమార్చి రూ.54 కోట్లు కొల్లగొట్టగలిగారు. ఈ వ్యవహారంలో దేవికారాణి, పద్మ, బాబ్జీ, కృపాసాగర్‌రెడ్డి, లెజెండ్ ఉద్యోగి వెంకటేశ్వర్లుతోపాటు వెంకటేశ్‌పై కేసు నమోదు కాగా.. బాబ్జీ, వెంకటేశ్‌లను బుధవారం రిమాండ్‌కు తరలించారు. మిగతా కొందరు ఐఎంఎస్ ఉద్యోగులతోపాటు ప్రైవేటు వ్యక్తుల పాత్ర గురించి ఆరా తీస్తున్నారు. మరోవైపు ఐఎంఎస్‌కు పరీక్ష కిట్లను సరఫరా చేసేందుకు హిమోక్యూ సంస్థనే ఎందుకు ఎంచుకున్నారు? ఇందులో మరేదైనా మతలబు ఉందా? అనే విషయాలపై కూపీ లాగుతున్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

నిందితుడు వరసకు పెదనాన్న

మహాముత్తారం, న్యూస్‌టుడే: నాలుగేళ్ల చిన్నారిపై వరసకు పెదనాన్న అయ్యే వ్యక్తే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో చోటుచేసుకుంది. కాటారం డీఎస్పీ బోనాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనంపేటకు చెందిన నాలుగేళ్ల చిన్నారి తల్లి, అమ్మమ్మతో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తోంది. ఆ సమయంలోనే చిన్నారికి వరసకు పెదనానయ్యే భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన రాస కొమురయ్య(37) గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడ్డాడు. కుటుంబసభ్యులు నిద్రమత్తులో ఉండగా చిన్నారిని అపహరించి సమీపంలోని పత్తిచేలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కుటుంబసభ్యులకు మెలకువ వచ్చి చిన్నారి కోసం గాలించగా ఫలితం కనిపించ లేదు. ఉదయం ఏడుగంటల తర్వాత పత్తిచేల నుండి చిన్నారి ఏడుస్తూ రావడాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. తనపై అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో చిన్నారి చెప్పింది. స్వల్ప రక్తస్రావం కాగా బాలికపై అత్యాచారం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి పూర్తిస్థాయి నిర్ధారణ, చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

ఎన్టీపీసీ కొత్త కానుక!

- 900 మెగావాట్ల సరఫరాకు ఒప్పందం
- యూనిట్ రూ.2.89కే ఇవ్వడానికి అంగీకారం
- ఫిబ్రవరిలో జలవిద్యుదుత్పత్తికి ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి తక్కువ ధరకే విద్యుత్తును కానుకగా ఇవ్వడానికి ఎన్టీపీసీ ముందుకొచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేకంగా 900 మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు రాష్ట్ర ట్రాన్స్‌కో ఎన్టీపీసీతో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకుంది. యూనిట్ రూ. 6- రూ. 10 మధ్య ధర ఉన్న విద్యుత్తును ఎన్టీపీసీ రూ. 2.89కే తెలంగాణకు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అదనపు విద్యుత్కేంద్రం నిర్మించకుండా ఎన్టీపీసీ ఇలా నేరుగా ఒక రాష్ట్రానికి ప్రత్యేకంగా కరెంటును అడిగిన వెంటనే ఇవ్వడం అరుదని ట్రాన్స్‌కో వర్గాలు తెలిపాయి. ఎత్తిపోతల పథకాలకు అదనపు విద్యుత్తు అవసరమైన నేపథ్యంలో 1500 మెగావాట్లు కావాలని ఇటీవల ట్రాన్స్‌కో ఎన్టీపీసీని కోరగా 900 మె.వా. ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ కరెంటును 2021 ఫిబ్రవరి నుంచి సరఫరా చేస్తామని తెలిపింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ కోసం ప్రత్యేకంగా రామగుండంలో నాలుగు వేల మె.వా. ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్లను ఎన్టీపీసీ నిర్మించాలి. ఇందులో ఒక్కోటి 800 మె.వా. సామర్థ్యమున్న రెండు ప్లాంట్లను ప్రస్తుతం నిర్మిస్తోంది. వీటిలో ఒకటి వచ్చే అక్టోబరు నాటికి పూర్తికావచ్చని అంచనా. అది అందుబాటులోకి వస్తే మరో 800 మె.వా. ఎన్టీపీసీ నుంచి సరఫరా అవుతుంది. మరోవైపు భద్రాద్రి జిల్లా మణుగూరు వద్ద జెన్‌కో నిర్మిస్తున్న విద్యుత్కేంద్రంలో 270 మె.వా. సామర్థ్యమున్న 3వ ప్లాంటులో బాయిలర్‌ను ఈ నెల 30న వెలిగించారు. వచ్చే మార్చి నాటికి ఇందులో ప్రయోగాత్మకంగా ఉత్పత్తి ప్రారంభిస్తారు. మొత్తం నాలుగు ప్లాంట్లలో రెండింటిని గతంలోనే ప్రారంభించారు. వచ్చే జూన్ నాటికి మూడు ప్లాంట్ల ద్వారా 810 మె.వా. ఉత్పత్తికి అవకాశముంది. వీటన్నిటితో విద్యుత్తు పరంగా ఇబ్బందులు తొలగుతాయని జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు. 1



మణుగూరు విద్యుత్కేంద్రంలో 3వ ప్లాంటు బాయిలర్‌ను వెలిగించడంతో బయటికి వస్తున్న పొగ

పెరుగుతున్న అవసరాలు

ప్రస్తుత రబీ సీజన్‌లో పంటల సాగు పెరుగుతున్నందున విద్యుత్తు డిమాండ్ కూడా క్రమంగా విస్తరిస్తోంది. ఇటీవల 11100 మె.వా.కు చేరింది. వచ్చే నెలలో 13 వేల మె.వా.కు పెరగవచ్చని అంచనా. రాష్ట్ర చరిత్రలో అత్యధిక డిమాండ్ గత ఆగస్టు 30న 11,808 మె.వా. నమోదైంది. ఈ రబీ సీజన్‌లో ఈ రికార్డును దాటి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. చెరువులు, రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉన్నందున వరి సాగు విస్తీర్ణం రికార్డుస్థాయిలో పెరుగుతుందని వ్యవసాయశాఖ ఇప్పటికే అంచనా వేసింది. అవసరాల తగినట్లు సరఫరాకు కొత్త సంవత్సరంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభాకరరావు వివరించారు. ఫిబ్రవరిలో నాగార్జునసాగర్, శ్రీశైలం విద్యుత్కేంద్రాల్లో జలవిద్యుదుత్పత్తి చేసి తక్కువ ధరకే కరెంటు సరఫరా అయ్యేలా చూసేందుకు ఇప్పటి నుంచే తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఈ రెండు రిజర్వాయర్లలోకి రివర్స్ పంపింగ్ విధానంలో నీటిని వెనక్కి పంపుతున్నట్లు చెప్పారు. ఇలా పంపిన నీటిని ఫిబ్రవరిలో అదనపు విద్యుదుత్పత్తికి వాడుకోవాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయి నిధులతో రహదారుల అభివృద్ధి

రహదారులు-భవనాల శాఖ ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: రహదారుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన విధానానికి తెరతీసింది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఖర్చులు తగ్గించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు ఇప్పటికే సూచించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రహదారుల మరమ్మతులకు రూ.500 కోట్లను కేటాయించటం విశేషం. ఈ నిధులు ఎలా సమీకరిస్తారన్నది అధికారులకు అంతుచిక్కలేదు. క్షేత్రస్థాయి నుంచి నిధులు సమీకరించి అక్కడే వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలోనే సింగరేణి కాలరీస్, వివిధ రకాల ఖనిజాల సేకరణ, రవాణా సందర్భంగా వసూలు చేసే ఖనిజాభివృద్ధి నిధి నుంచి నిధులను సమీకరించి రహదారుల మరమ్మతులకు వినియోగించాలని నిర్ణయించింది. రహదారుల మరమ్మతులకు ఇలా నిధులను సమీకరించటం తొలిసారి అని అధికారులు చెబుతున్నారు.

సింగరేణి నిధులతో...

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సింగరేణి ప్రాబల్యం అధికం. ఆయా జిల్లాల్లో అధిక శాతం బొగ్గు తవ్వకాలు, రవాణా జరుగుతుంటాయి. సహజంగా రహదారులు దెబ్బతింటాయి. సింగరేణి నుంచి వసూలు చేసే రూ.300 కోట్లతో ఆయా జిల్లాల్లోని రహదారులకు చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా జిల్లాల పరిధిలో ఏయే రహదారులు అభివృద్ధి చేయాలి, ఎంత వ్యయం అవుతుందన్న వివరాలను రహదారులు భవనాల శాఖ సిద్ధం చేస్తోంది.

ఖనిజాభివృద్ధి నిధితో మరమ్మతులు

ఆయా జిల్లాలోని ఖనిజాల తవ్వకాల సందర్భంగా క్వారీల నుంచి సంబంధిత జిల్లాల యంత్రాంగాలు రాయల్టీని వసూలు చేస్తాయి. ఆ నిధులు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉంటాయి. ఇప్పటివరకు వాటిని ఆ జిల్లాల్లోని ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే వినతుల మేరకు పనులు చేపట్టేందుకు వెచ్చిస్తున్నారు. కాగా ఈ నిధులను చిన్న చిన్న పనులకు వినియోగిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే వాటిని రహదారుల అభివృద్ధికి ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కుటుంబ కలహాల చిచ్చు

- భార్య, కుమార్తెకు నిప్పుపెట్టి ఆత్మహత్యాయత్నం
- దంపతులు, కుమార్తెకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

చిన్నంబావి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి భార్య, కుమార్తెకు నిప్పుపెట్టి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నంబావి మండలం అయ్యవారిపల్లిలో చోటుచేసుకుంది. అయ్యవారిపల్లికి చెందిన జయన్న, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు హైదరాబాద్‌లో పనిచేస్తుండగా కుమార్తె కొల్లాపూర్‌లో ఇంటర్ చదువుతోంది. ఇటీవల దంపతులిద్దరూ తరచూ గొడవపడుతున్నారు. బుధవారం రాత్రి భార్య, కుమార్తె ఇంట్లో నిద్రిస్తుండగా జయన్న వారిపై కిరోసిన్ పోసి తనపైనా చల్లుకున్నాడు. వారికి నిప్పుపెట్టి తనకూ అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వరలక్ష్మితో పాటు కుమార్తెకూ తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు ముగ్గురినీ చికిత్స కోసం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కాలిన గాయాలతో దంపతులు, కుమార్తె



చిట్టి దేహాలకు.. వెచ్చటి రక్షణ

ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో జనం వణికిపోతున్నారు. నవజాత శిశువులు, బాలింతలు మరింత అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు వెచ్చదనాన్ని అందించేందుకు రిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అక్కడ వార్మర్లు అందుబాటులో ఉండగా.. గది వెచ్చదనం కోసం హీటర్లను సమకూర్చారు. దీంతో వెచ్చదనంతో పాటు విటమిన్ లోపం దూరమవుతుందని, శిశువులు ఆరోగ్యవంతంగా పెరుగుతారని సిబ్బంది చెబుతున్నారు. ఈ ఏడాది ఆరు హీటర్లను అందుబాటులోకి తెచ్చారు.

–ఈనాడు, ఆదిలాబాద్

దశాబ్ది బుజ్జాయిలు 3.92 లక్షలు!

- అందులో 5వ వంతు భారత చిన్నారులే
- 2020 తొలి రోజు జననాలపై యునిసెఫ్ అంచనా

దిల్లీ: కొత్త సంవత్సరం, దశాబ్ది తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా 3,92,078 మంది చిన్నారులు జన్మించారని ఐరాస బాలల నిధి (యునిసెఫ్) అంచనా వేసింది. ఇందులో సగం జననాలు 8 దేశాల్లోనే ఉంటాయని తెలిపింది. అత్యధికంగా 17% మంది భారత్‌లోనే పుట్టారని వెల్లడించింది. నూతన సంవత్సరం రోజు జన్మించిన చిన్నారులను ఉద్దేశించి ఏటా జనవరిలో యునిసెఫ్ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా బుధవారం ఈ అంచనాలను విడుదల చేసింది. భారత్ తరువాత స్థానాల్లో చైనా (46,299 జననాలు), నైజీరియా (26,039), పాకిస్థాన్ (16,787), ఇండోనేషియా (13,020), అమెరికా (10,452), కాంగో (10,247), ఇథియోపియా (8,493) ఉంటాయని పేర్కొంది. తొలి చిన్నారి దక్షిణ పసిఫిక్‌లోని ఫిజిలో జన్మించే అవకాశం ఉందని చెప్పింది. భారత్‌కు చెందిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ 1894లో, ప్రముఖ బాలీవుడ్ నటి విద్యాబాలన్ 1979లో జనవరి 1న జన్మించారు. 2018లో 25లక్షల మంది చిన్నారులు పుట్టిన నెల రోజుల్లోనే మరణించారని యునిసెఫ్ తెలిపింది. అందులో మూడో వంతు తొలి రోజే మృతి చెందారని పేర్కొంది. వీరు కాకుండా ఏటా 25 లక్షల మంది శిశువులు తల్లి గర్భంలోనే మృత్యువాత పడుతున్నారని పేర్కొంది. అయితే గత 3 దశాబ్దాల్లో 5 ఏళ్ల లోపు చిన్నారుల మరణాల నివారణలో గొప్ప పురోగతి సాధించినట్లు తెలిపింది. నెలలోపు శిశువుల మరణాల నివారణ ఆశించినస్థాయిలో లేదని స్పష్టం చేసింది.

వేడుకల ఖర్చుతో విద్యార్థులకు వితరణ

ఈనాడు–హైదరాబాద్ : నూతన సంవత్సరం అంటే పెద్ద కేక్ తెచ్చి కోయడం.. మిఠాయిలు పంచడం. సంస్థ కార్యాలయంలో జనవరి 2న జరగాల్సిన ఈ వేడుకను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) రద్దుచేసుకుంది. ఆ వేడుకలకు అయ్యే బడ్జెట్‌ను ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఖర్చు చేయాలని నిర్ణయించింది. ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను, విద్యార్థుల కోసం క్రీడా ఉపకరణాలను అందించనుంది. ఎఫ్‌డీసీ ఛైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎండీ పి.రఘువీర్ గురువారం వీటిని అందించనున్నారు.

తమిళ రచయిత నెల్లై కన్నన్ అరెస్టు

మోదీ, అమిత్‌షాలపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంతోనే..

తమిళనాడు డెస్క్: ప్రముఖ తమిళ రచయిత, వక్త నెల్లై కన్నన్‌ను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేయాలని బుధవారం భాజపా శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. కొంత మంది నేతలు నెల్లై కన్నన్ ఇంటిని ముట్టడించారు. ఆ సమయంలో అనారోగ్యంగా ఉందంటూ ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి వద్దా భాజపా నేతలు నిరసనలు చేశారు. చివరికి రాత్రి పోలీసులు నెల్లై కన్నన్‌ను అరెస్టు చేశారు.

Founder: Ramoji Rao. Editor: D N Prasad, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Published and Printed at Eenadu Press, Alugunoor, Karimnagar-505 527. Telangana State. Mobiles: 9959021802, 9959021803.
RNI No. 52793/92,. Regd No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re.1.00 Portblair Rs.10.00